www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 13-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 344 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ.10.36 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పుబ్బ తె.6.19 తదుపరి ఉత్తర; వర్జ్యం: మ.12.49-2.34; అమృతఘడియలు: రా.11.19-1.04; దుర్ముహూర్తం: ఉ.10.25-11.13, మ.3.10-3.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.28; సూర్యాస్తమయం: 6.21

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్



అన్ని రాష్ట్రాల సీఈవోలకు ఈసీ ఆదేశం!

న్యూఢిల్లీ, మార్చి 12: ఓటర్ల గుర్తింపు సక్రమంగా జరిగేలా ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్, మొబైల్ నంబర్లతో లింక్ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)కు సర్క్యులర్‌ను ఈసీఐ జారీ చేసినట్టు తాజాగా ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. దీంతోపాటు ఈనెల 4న నిర్వహించిన సీఈవోల కాన్ఫరెన్స్‌లో 'ఓపెన్ రిమార్క్స్ ఆఫ్ సీఈసీ' పేరిట సీఈవోలందరికీ పంపిణీ చేసిన పత్రాల్లోనూ అవే ఆదేశాలు

మిగతా 14వ పేజీలో...

అందరూ పాల్గొనాలి

ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా మార్చడానికి 7 మండలాలు, 56 గ్రామాల్లోని 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో అథారిటీని ఏర్పాటు చేశాం. 2029-30 నాటికి రాష్ట్రంలో 6 వేల ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. - గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్

- అసెంబ్లీకి సభ్యులందరూ రావాలి.. బడ్జెట్‌పై చర్చలో పాలుపంచుకోవాలి
- బడ్జెట్ అంకెల కూర్పు మాత్రమే కాదు.. భవిష్యత్తుకు ప్రతిబింబం
- పౌరుల ఆకాంక్షలు నెరవేరేలా కేటాయింపులు.. అందరికీ అభివృద్ధి ఫలాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వ సంకల్పం దృఢమైనది
- దేశానికే ఆదర్శంగా రాష్ట్రం.. చర్చకు ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు
- బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. చప్పట్లతో సమర్థించిన సీఎం రేవంత్, కాంగ్రెస్ సభ్యులు.. వ్యతిరేకంగా బీఆర్ఎస్ నినాదాలు

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ అనేది కేవలం అంకెల కూర్పు మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి ప్రభుత్వ ప్రాథమ్యాలకు ప్రతిబింబమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రభుత్వ విధానాలను, కార్యక్రమాలను తెలిపే ఆర్థిక పరమైన నమూనా అని పేర్కొన్నారు. శాసనసభ్యులంతా తప్పనిసరిగా సభకు హాజరు కావాలని, బడ్జెట్‌పై చర్చలో శ్రద్ధాసక్తులతో పాల్గొనాలని సూచించారు. బడ్జెట్ చర్చలు రేపటి ఆర్థిక ఇబ్బందులను నివారిస్తాయని, కొన్నిసార్లు అంకెలు భయపెట్టినప్పటికీ.. ప్రతీ కేటాయింపు వెనుక ప్రజల ఆకాంక్షలు ఉన్నాయనేది గుర్తించాలని

మిగతా 2వ పేజీలో...

19న రాష్ట్ర బడ్జెట్


- 27 వరకు అసెంబ్లీ
- మొత్తం 12 పని దినాలు
- నేడు, 15న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు, చర్చ
- 17, 18 తేదీల్లో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు
- చర్చించి ఆమోదించనున్న సభ
- 21, 22న బడ్జెట్‌పై చర్చ
- ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదంతో 27న ముగింపు
- సమావేశాల్ని మరో 4 రోజులు పొడిగించాలన్న బీఆర్ఎస్
- 15 రోజులు నడపాలన్న బీజేపీ

2

అసెంబ్లీకి హాజరైన కేసీఆర్

- 45 నిమిషాల ముందే చేరుకున్న ప్రతిపక్ష నేత
- కేసీఆర్‌తో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ భేటీ


అసెంబ్లీలో గవర్నర్‌కు నమస్కరిస్తున్న ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు


కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, జూపల్లి, పీసీసీ చీఫ్ మహేశ్

బీఆర్ఎస్‌తో సత్సంబంధాలా!

- అలా ఉంటే మీపై పోటీ పెట్టకుండా ఉంటారా?
- రాజకీయంగా ప్రత్యర్థులమనే భావన ఉండాల్సిందే
- సభ జరిగినన్ని రోజులూ సభ్యులు హాజరుకావాల్సిందే
- ప్రతిపక్షాన్ని తిట్లతో కాదు.. సబ్జెక్టుతో తిప్పికొట్టాలి
- విపక్ష సభ్యుల గందరగోళంపై విప్‌లు స్పందించలేదేం?
- ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి
- ఇకపై అన్ని నియోజకవర్గాలకూ సమానంగా నిధులు
- సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే జయవీర్ మధ్యలో వెళ్లడంపై సీఎం అసహనం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): "కొంతమంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీతో సత్సంబంధాలు కలిగి ఉండాలనుకుంటున్నట్లు నాకు సమాచారం వస్తోంది. అలా ఉంటే వచ్చే ఎన్నికల్లో మీపై ఆ పార్టీ పోటీ పెట్టదని అనుకుంటున్నారా? అలా ఉండడం వల్ల తాత్కాలికంగా ఇబ్బంది ఉండకపోవచ్చేమో గానీ.. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అది మీ గెలుపోటములపైనా ప్రభావం చూపుతుంది" అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీతో రాజకీయంగా ప్రత్యర్థులమనే భావనతో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ వ్యవహారశైలి మార్చుకోవాలంటూ సున్నితంగా

మిగతా 13వ పేజీలో...


దివ్యాంగ అభ్యర్థికి నియామకపత్రం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి పొన్నం

మారకపోతే మార్చురీకే

- ఇప్పటికే స్ట్రేచర్ నుంచి స్ట్రెచర్‌కు వచ్చావు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్ ఇచ్చావు
- పదేళ్లలో 7 లక్షల కోట్ల అప్పులు చేశావు
- నేనెందుకు దిగాలి? నీ ఫాంహౌస్ గుంజుకున్నానా?.. కేసీఆర్‌పై సీఎం ధ్వజం
- కొత్త లెక్చరర్లకు నియామక పత్రాలు

13

పిచ్చికుక్క హద్దు మీరి ప్రవర్తిస్తోంది

2

- పరిణతి లేకే మార్చురీ వ్యాఖ్యలు
- సీఎంను మానసిక వైద్యునికి చూపాలి
- మేం అధికారంలోకి రాగానే 'ఆ విగ్రహాలను' గాంధీభవన్‌కు పంపుతాం
- కాంగ్రెస్ కార్యకర్త ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం: కేటీఆర్, హరీశ్

ఆరు గ్యారెంటీల అమల్లో సర్కారు విఫలం

2

- బీజేఎల్పీ ఫైర్.. ప్రభుత్వ వైఫల్యాలపై సభలో నిలదీయాలని నిర్ణయం

దమ్ముంటే విగ్రహాలపై చెయ్యేసి చూడు

- మా కార్యకర్తలు బట్టలూడదీసి కొడ్తరు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్‌గౌడ్

13

స్మార్ట్ రేషన్ కార్డులు!

ఏటీఎం కార్డు తరహాలో రూపకల్పన

- పీవీసీ కార్డుపై క్యూ ఆర్ కోడ్, రాష్ట్ర ప్రభుత్వ లోగో సహా కుటుంబ పెద్ద పేరు
- 1.20 కోట్ల కార్డుల ముద్రణకు టెండర్లు ఆహ్వానించిన పౌర సరఫరాల శాఖ
- 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి రంగం సిద్ధమవుతోంది. కొత్త కార్డులతో పాటు, ఇప్పటికే ఉన్న కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డులను అందించేందుకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు కొత్త కార్డుల ముద్రణ కోసం మంగళవారమే టెండర్లను ఆహ్వానించగా.. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల దాకా టెండర్ల దాఖలుకు అవకాశం

మిగతా 3వ పేజీలో...


తిమ్మాయిపల్లిలో ప్రభుత్వం సేకరించనున్న భూములు

1500 ఎకరాలు

- ఫ్యూచర్ సిటీ కోసం మరిన్ని భూములు.. సేకరణకు సర్కారు సన్నాహాలు
- తిమ్మాయిపల్లిలో 366, కొంగరకుర్దులో 277 ఎకరాల కోసం నోటిఫికేషన్
- త్వరలో తిమ్మాపూర్, పంజాగూడలోనూ భూ సేకరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/కందుకూరు/ మహేశ్వరం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ కోసం మరిన్ని భూములు సేకరించాలని నిర్ణయించింది. రాజధాని శివారులో ఏడు మండలాల్లోని 74 గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు ఇటీవలే క్యాబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇప్పటికే సేకరించిన భూమితో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ పరిధిలో మరో 1500ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం రెండు గ్రామాల్లో పారిశ్రామిక పార్కుల

మిగతా 13వ పేజీలో...

టెక్స్‌టైల్ పార్కు భూములపై విచారణకు ఆదేశం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ప్రభుత్వం
- వివరాలు సేకరించి నివేదిక రూపొందిస్తున్న అధికారులు
- నిషేధిత భూముల జాబితాలో, రికార్డుల్లో తేడాల గుర్తింపు!
- పార్కు ఏర్పాటు చేయకుంటే భూములు తిరిగివ్వాలి: రైతులు

10

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్షం

- రాష్ట్రానికి జరిగే నష్టంపై చర్చ
- అన్ని పార్టీలూ హాజరు కావాలి
- త్వరలో తేదీ, వేదిక ప్రకటిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి సంయుక్త బహిరంగ లేఖ

2

కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సై

- సౌదీలో ఫలించిన అమెరికా చర్చలు
- ఉక్రెయిన్‌కు సైనిక సాయం పునరుద్ధరణ
- ఇక మిగిలింది పుతిన్ అంగీకారమే..
- వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు
- అమెరికా మద్యంపై భారత్ 150% పన్ను
- వ్యవసాయ ఉత్పత్తుల మీద 100%
- అందుకే ఆ దేశంపై ప్రతీకార సుంకాలు
- వైట్‌హౌస్ ప్రతినిధి వెల్లడి

14



నడకలో రెండేళ్ల బుడతడి రికార్డు

- 47 నిమిషాల్లో 3.23 కిలోమీటర్లు నడిచిన రుద్రాన్ష్‌రెడ్డి
- పటాన్‌చెరు బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు

10

హామీల అమల్లో కాంగ్రెస్ సర్కారు విఫలం

- చేయని పనులను కూడా చేసినట్లు గొప్పలు: బీజేఎల్పీ
- ప్రభుత్వ వైఫల్యాలపై సభలో నిలదీయాలని నిర్ణయం

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను నిలదీయాలని బీజేపీ శాసనసభాపక్షం (బీజేఎల్పీ) నిర్ణయించింది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్నీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేయలేదని విమర్శించింది. చేయని పనులను కూడా చేసినట్లు గొప్పలు చెప్పుకొంటోందని మండిపడింది. బుధవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఎల్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైంది. గడిచిన 15 నెలల్లో పరిపాలన గాలికొదిలేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే ప్రయత్నం ముఖ్యమంత్రి, మంత్రులు చేస్తున్నారు' అని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కారు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

కేటీఆర్‌ను అసెంబ్లీకి రానివ్వొద్దు

- ఢిల్లీలో మీడియాతో కాంగ్రెస్ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ, ముఖ్యమంత్రిని కించపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను అసెంబ్లీ సమావేశాలకు రాకుండా శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ మీడియా సమావేశం నిర్వహించారు. తొలుత మల్లు రవి మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగాన్ని అవమానించేలా కేటీఆర్ మాట్లాడారని తప్పుబట్టారు. కేటీఆర్ ప్రజాస్వామ్య విధానాలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. 14 నెలలుగా అసెంబ్లీకి రాని వ్యక్తి దిశానిర్దేశం చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చామల అన్నారు. తెలంగాణను అప్పుల కుప్పగా చేసినందుకు కేసీఆర్ ప్రజలకు అసెంబ్లీ వేదికగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీకి వచ్చే జర్నలిస్టులకు కొత్త పాస్‌లు

- అసెంబ్లీ కార్యదర్శికి సూచించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వార్తల సేకరణ కోసం వచ్చే జర్నలిస్టులకు కొత్త పాసులు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్.. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులుకు సూచించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో విలేకరులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతున్న సమయంలో.. ఇప్పటికీ గ్యాలరీ, లాబీల్లోకి వెళ్లడానికి జర్నలిస్టులు గత ప్రభుత్వం జారీ చేసిన గడువు ముగిసిన పాస్‌లను వినియోగిస్తున్నట్లు తెలుసుకున్నారు. అదే సమయంలో అటువైపుగా వెళుతున్న అసెంబ్లీ కార్యదర్శిని పిలిచి ఎందుకు కొత్త పాస్‌లను జారీ చేయడంలేదని అడిగారు. ఈ విషయంలో నర్సింహాచార్యులు ఏదో చెప్పబోతుండగా.. ఇప్పటికే జాప్యం జరిగిందని, జర్నలిస్టులకు కొత్త పాస్‌లు జారీ చేయాలని మంత్రి సూచించారు.

కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నీరా కేఫ్

పర్యాటక అభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో నెక్లెస్ రోడ్‌లో పనిచేసిన నీరా కేఫ్‌ను ఇక నుంచి తెలంగాణ కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన ఒప్పందం పత్రంపై మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్ సంతకాలు చేశారు.

రెండేళ్లలో వరంగల్‌లో ఫ్లైట్: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో వరంగల్‌లో ఫ్లైట్ (విమానం) ఎగురుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీ లాబీలో మంత్రి విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 18 నెలల్లో ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణపనులు పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. రామగుండం, ఆదిలాబాద్, ఎయిర్‌పోర్టుల గురించి కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించినట్టు తెలిపారు. వరంగల్ మామునూరులో రెండేళ్లలో విమాన రాకపోకలు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు. కాగా, తెలంగాణలోని 42% జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న తనకు మంత్రివర్గ విస్తరణలో తప్పనిసరిగా అవకాశం లభిస్తుందని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను మంత్రి వర్గంలోకి తీసుకునేందుకు అంగీకరించినప్పటికీ అధిష్ఠానం ఆదేశాల కోసం నిరీక్షించవలిసి వస్తోందన్నారు.

పకడ్బందీగా జేహెచ్ఎస్: దామోదర

రాష్ట్రంలోని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకుగాను త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ హామీ ఇచ్చారు. బుధవారం టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలోని జర్నలిస్టుల ప్రతినిధుల బృందం అసెంబ్లీలోని చాంబర్‌లో మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. ෆ దీనిపై స్పందించిన మంత్రి దామోదర మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి శ్రీధర్‌బాబుతో అక్బరుద్దీన్ భేటీ

సీఎల్పీ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబుతో మజ్లిస్ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరువురు దాదాపు గంట సేపు మాట్లాడుకున్నారు. ఒక మ్యాపును మంత్రి టేబుల్ పై ఉంచి అక్బర్ మాట్లాడారు. ఆ సమయంలో పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితి ఉన్నారు. పాతబస్తీకి సంబంధించిన కీలక విషయంపై అక్బర్..మంత్రితో చర్చించినట్టు తెలిసింది. కాగా, గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ ఇలంబరితిపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు జనంతో కలవాలి. అలా కలవకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి" అంటూ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

శ్రీధర్‌బాబు చెవిలో డిప్యూటీ సీఎం భట్టి గుసగుస

సీఎల్పీ సమావేశం ముగిసిన తర్వాత అటుగా వెళుతున్న డిప్యూటీ సీఎం భట్టి అక్కడే ఉన్న అక్బర్‌ను చూసి, ఆగి మాట్లాడారు. ఆ వెంటనే అక్బర్‌ను వెంటపెట్టుకుని మంత్రి శ్రీధర్‌బాబు ఛాంబర్‌కు వెళ్లారు. ఆ సమయంలో భట్టి.. మంత్రి శ్రీధర్‌బాబు చెవిలో గుసగుసలాడారు.




అసెంబ్లీకి వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; సమావేశాలకు హాజరైన వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



అందరూ పాల్గొనాలి!

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. బుధవారం శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. 33 నిమిషాలపాటు 66 అంశాలపై బడ్జెట్ ప్రసంగం కొనసాగింది. గవర్నర్ ప్రసంగిస్తూ.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు మరింత ఉజ్వలం కాబోతోందన్నారు. ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ పరిపుష్టి, సాంకేతిక విజ్ఞానం, సామాజిక న్యాయంలో రాష్ట్రం అగ్రగామిగా నిలవనుందని పేర్కొన్నారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిలా ఉండే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ అభివృద్ధి ఫలాలు అందేలా భవిష్యత్తును రూపొందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. యువ, డైనమిక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వ సంకల్పం దృఢమైనదని అన్నారు.

ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాది కాలంలోనే 55 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని గవర్నర్ అన్నారు. క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా రాష్ట్రానికి హోదా కల్పించడానికి, ప్రపంచ స్థాయి అథ్లెట్లను తయారు చేయడానికి యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీని, యువతకు సాధికారత కల్పించడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

సివిల్ సర్వీసు ఆశావహులకు రూ.లక్ష సాయం అందిస్తున్నామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా సాధించడానికి ట్రిబ్యునల్‌లో బలమైన వాదలను వినిపిస్తున్నామని తెలిపారు. రైతులకు ఆసరాగా ఉండేందుకు వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ కింద మొత్తం రూ.1,206.44 కోట్లను అందించామన్నారు. రూ.2 లక్షల దాకా పంట రుణమాఫీ కింద 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616.89 కోట్లు అందించామని చెప్పారు. ఇక ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా మార్చడానికి 7 మండలాలు, 56 గ్రామాల్లోని 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో అథారిటీని ఏర్పాటు చేశామని ప్రకటించారు. 2029-30 నాటికి రాష్ట్రంలో 6 వేల ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. జౌళి పరిశ్రమను పటిష్ఠపరచడానికి మరమగ్గాలు, నేతకార్మికుల అభ్యున్నతి కోసం వేములవాడలో రూ.50 కోట్లతో యార్న్ డిపోను ఏర్పాటు చేశామని తెలిపారు. స్వయంసహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు..

ఎస్సీ కులాల వర్గీకరణ కోసం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు గవర్నర్ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకూ బిల్లును ప్రతిపాదిస్తున్నామన్నారు. 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షలకు పెంపు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలను గవర్నర్ వివరిస్తున్నప్పుడు.. సమర్థనగా సీఎం రేవంత్‌రెడ్డి బల్లను చరచగా.. అధికార పార్టీ సభ్యులు చప్పట్లతో స్వాగతించారు. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు గవర్నర్ ప్రసంగం ఆసాంతం వ్యతిరేక నినాదాలు చేశారు. సభలో కేసీఆర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా పలకరించారు. అంతకుముందు గవర్నర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తోడ్కొని వచ్చారు. కాగా, గవర్నర్ ప్రసంగం సకలజనుల సంక్షేమాన్ని, సమస్త రంగాల అభివృద్ధిని నిజాయితీగా, నిష్పాక్షికంగా ప్రజాకోణంలో వెల్లడించిందని సీఎం రేవంత్‌రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.

45 నిమిషాల ముందే అసెంబ్లీకి కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ 45 నిమిషాల ముందే అసెంబ్లీకి వచ్చారు. ఉదయం 10.15 గంటలకు అసెంబ్లీ మెయిన్ గేటు వద్దకు చేరుకోగా, పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కాగా, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. బీఆర్ఎస్ఎల్పీ చాంబర్‌లో కేసీఆర్‌ను కలుసుకున్నారు. తన సోదరుడి కుటుంబంలో జరిగే పెళ్లికి హాజరు కావాలంటూ ఆహ్వాన పత్రిక అందజేశారు. అయితే ఇప్పటికే నియోజకవర్గంలో మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆయన కేసీఆర్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.



రైతాంగానికి వెన్నుదన్నుగా ఉన్నాం

- గవర్నర్ ప్రసంగం ఇదే చెప్పింది: ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలబడిందనే విషయం గవర్నర్ ప్రసంగంలో స్పష్టం అయ్యిందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వ్యవసాయ, నీటిపారుదల రంగంలో సాధించిన విజయాలను ప్రతిబింబించిందన్నారు. గవర్నర్ ప్రసంగంపై మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ.. దేశంలో ముందెన్నడూ లేనివిధంగా ఏక కాలంలో రూ.2లక్షల దాకా రుణమాఫీ చేయడం ప్రభుత్వం సాధించిన విజయంగా అభివర్ణించారు. 25.35 లక్షల మంది రైతులకు 20,616.89 కోట్ల రుణాలను మాఫీ చేయడం చరిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. రైతుభరోసా పథకం కింద ఏడాదికి ఎకరాకు రూ.12 వేలకు పెంచడం, రికార్డు స్థాయిలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సంవత్సరం వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలను గవర్నర్ తన ప్రసంగంలో ఉటంకించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ముఖ్యమైన నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి, చివరి ఆయకట్టు రైతులకూ నీటిని అందించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు.

నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ

- అన్ని పార్టీలు హాజరుకావాలని భట్టి-జానారెడ్డి సంయుక్త లేఖ

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రానికి సీట్లు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో దీనిపై అన్ని పార్టీలతో చర్చించడానికి సమావేశాన్ని నిర్వహించనుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరు కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సంయుక్తంగా బుధవారం బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని ఆ లేఖలో తెలిపారు. త్వరలోనే తేదీ, వేదిక ప్రకటిస్తామని పేర్కొన్నారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, భట్టి, శ్రీధర్‌బాబు, పొన్నం, హరీశ్, ప్రశాంత్‌రెడ్డి, ఏలేటి, కూనంనేని, అక్బరుద్దీన్

27 వరకు అసెంబ్లీ

13, 15 తేదీల్లో.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం, చర్చ

- 19న సభలో వార్షిక బడ్జెట్
- శాసన సభలో ప్రవేశపెట్టనున్న భట్టి

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభా బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27 వరకు.. 12 రోజులపాటు జరగనున్నాయి. చివరి రోజు ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించి, సమావేశాలను ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసన సభా వ్యవహారాల కమిటీ(బీఏసీ) సమావేశం బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సభావ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, విపక్ష పార్టీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆ వెంటనే.. మధ్యాహ్నం బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సమావేశాలను ఈ నెల 27 వరకు నిర్వహిస్తామని ప్రకటించారు. అంటే... బుధవారం గవర్నర్ ప్రసంగంతో కలుపుకొని సభ 12 రోజుల పాటు పని చేసినట్లవుతుంది. తేదీల వారీగా సభలో కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ నెల 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 14న హోలీ పండుగ సందర్భంగా సభకు సెలవు ఉంటుంది. తిరిగి 15న సభ సమావేశమవుతుంది. ఆ రోజు కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. రెండ్రోజులు జరిగే ఈ చర్చలో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు విపక్ష సభ్యులకు కూడా మాట్లాడే అవకాశం కల్పిస్తారు. అనంతరం గవర్నర్ ప్రసంగంపై జరిగిన చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిస్తారు. ఆయన అదే రోజు ఢిల్లీకి వెళ్తారు. 16న ఆదివారం సభకు సెలవు. 17న ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీలకు స్థానిక సంస్థల్లో.. విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లకు సంబంధించిన మరో రెండు బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెడుతుంది. అదే రోజు ఈ బిల్లులపై చర్చను ప్రారంభిస్తారు. 18న కూడా ఈ బిల్లులపై చర్చను జరిపి.. అదే రోజు ఆమోదిస్తారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2025-26) సంబంధించి బడ్జెట్‌ను 19వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెడతారు. మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెడతారు. ఆ తర్వాత ఉభయ సభలు ఆ రోజుకు వాయిదా పడతాయి. 21, 22 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది. 24, 25, 26 తేదీల్లో వివిధ శాఖల బడ్జెట్ పద్దులపై చర్చ జరుగుతుంది. 27న తెలంగాణ ద్రవ్య వినిమయ బిల్లును సభ ఆమోదిస్తుంది. ఆ రోజుతో సమావేశాలు ముగుస్తాయి.

బడ్జెట్‌పై 5 రోజులేనా?

- మహేశ్వర్‌రెడ్డి

బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సభలో చర్చించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. బడ్జెట్, పద్దులపై చర్చించడానికి కేవలం ఐదు రోజులే కేటాయించారని, అలాగైతే బడ్జెట్‌పై కూలంకషంగా మాట్లాడే అవకాశం సభ్యులకు రాదని అభిప్రాయపడ్డారు. సభను అధికారపక్షం పూర్తిగా బుల్డోజ్ చేస్తోందని, బడ్జెట్ సమావేశాలను కనీసం 15 రోజుల పాటైనా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎక్కువ రోజులు నిర్వహించండి: హరీశ్

సమావేశాలను కేవలం 12 రోజుల పాటే కాకుండా.. మరో 4 రోజుల పాటు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. "సభలో ఎప్పుడెప్పుడు ఏయే కార్యక్రమాలు జరుగుతాయనే వివరాలు పత్రికల ద్వారా బయటకు వచ్చాయి. ఇంకా బీఏసీలో చర్చించాల్సిందేముంది?" అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రజలు తాగునీరు, సాగునీరు వంటి చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటన్నింటిపై సభలో చర్చించాల్సి ఉందన్నారు. ప్రజా సమస్యలపైనే రెండు రోజుల పాటు సభను నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు బదులిస్తూ.. బీఆర్ఎస్ పాలనలో కూడా తక్కువ రోజుల పాటే బడ్జెట్ సమావేశాలను నిర్వహించారని గుర్తుచేశారు.

అసెంబ్లీలో సభ్యులు నిద్రపోతున్నారు: అక్బరుద్దీన్

బడ్జెట్ సమావేశాలను కనీసం నెల రోజుల పాటైనా నిర్వహించాలని మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. శ్రీధర్‌బాబు కల్పించుకుని, తాము తక్కువ రోజుల పాటు సభను నిర్వహించినా.. ఎక్కువ గంటల పాటు నడుపుతున్నామని వివరించారు. దానికి అక్బరుద్దీన్ స్పందిస్తూ.. ఉమ్మడి రాష్ట్రంలో 294 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు 42 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎక్కువ పని గంటలు చూపిస్తున్నా.. సభలో సభ్యులు నిద్ర పోతున్నారని చెప్పారు. ప్రశ్నలు అడిగిన సభ్యులు కూడా.. మంత్రులు చెప్పే సమాధానాలు వినకుండా నిద్రపోతున్నారన్నారు. అందుకే పని గంటలు పెంచడం కాదని, ఎక్కువ రోజులపాటు సభను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పిచ్చికుక్క హద్దుమీరి ప్రవర్తిస్తోంది

రాజకీయ పరిపక్వత లేకే మార్చురీ వ్యాఖ్యలు..కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలకు కేటీఆర్, హరీశ్, కవిత ఫైర్

కాంగ్రెస్ కార్యకర్త ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శ


హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ ప్రస్తుతం స్ట్రెచర్‌పై ఉన్నారని, తొందర్లోనే మార్చురీకి వెళ్తారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పిచ్చికుక్క హద్దుమీరి మర్యాద లేకుండా ప్రవర్తిస్తోందని, ఆలస్యం చేస్తే.. నైరాశ్యంతో చుట్టుపక్కల వారిని కొరికే ప్రమాదం ఉందంటూ సీఎంను ఉద్దేశిస్తూ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డిని ఆయన కుటుంబసభ్యులు వీలైనంత త్వరగా ఏదైనా మానసిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని కోరారు. రాజకీయ పరిపక్వత లేక సీఎం మార్చురీ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సీఎంకు క్యాన్సిల్ జబ్బు సోకిందని, ఎన్నికలపుడు తాను చెప్పినవన్నీ క్యాన్సిల్ అంటున్నారన్నారు. తానొక ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకుని రేవంత్ రెడ్డి చిల్లరవేషాలు మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలిస్తూ.. ఇంకెంత కాలం డప్పుకొట్టుకుంటావని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తి కేసీఆర్‌పై చిల్లర విషయాలు చెబితే నమ్మడానికి ఉద్యోగాలు పొందిన వారు అమాయకులు కాదని కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాగా, మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రకటన చేశారు.

అన్నీ అబద్ధాలు, అసత్యాలు..

బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేసిన ప్రసంగం కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించి ఆయన స్థాయిని దిగజార్చిందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ ఆయా కుటుంబాలకు భరోసానిచ్చే ఒక్క మాట కూడా గవర్నర్ ప్రసంగంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి విజన్ లేదు, 20 శాతం కమీషన్ మాత్రమే ఉందని ఎద్దేవా చేస్తూ.. ఉపముఖ్యమంత్రి కార్యాలయం వద్ద కాంట్రాక్టర్లు ధర్నా చేసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. 83 మంది విద్యార్థుల మరణాలపై గవర్నర్ ప్రసంగంలో ఒక్క సానుభూతి మాట కూడా లేదని విచారం వ్యక్తం చేశారు. దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కులగణన పేరుతో బీసీలను మోసం చేసి, రిజర్వేషన్లపై దగా చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీని సస్పెండ్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ తల్లి(సచివాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహం)ని, రాహుల్ తండ్రి(రాజీవ్ గాంధీ విగ్రహం)ని తిరిగి గాంధీ భవన్‌కు పంపిస్తామని స్పష్టం చేశారు. ఇక, రాష్ట్రంలో గవర్నర్లు మారినా ప్రసంగాలు మాత్రం మారలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలో గతేడాది గవర్నర్ ప్రసంగానికి.. ఈసారి గవర్నర్ ప్రసంగానికి తేడా లేదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారాన్ని నమ్మించేందుకు గవర్నర్‌ను వాడుకోవడం సిగ్గుచేటని అన్నారు. రేవంత్‌రెడ్డి అత్యుత్తమ మార్గం ఢిల్లీ అని, చంద్రబాబు సేవలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు గాంధీ కుటుంబం బాధ్యత వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబానికి కేవలం ఎన్నికల సమయంలోనే తెలంగాణ గుర్తొస్తుందా? అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబం సంతకాలు చేసిన గ్యారెంటీలు చూసే ప్రజలు ఓట్లు వేశారని, అందుకు వారే తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలన్నారు.



లోకం తీరు



మానవ రవాణా కేసులో ఇద్దరు ఏజెంట్ల గుర్తింపు

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'మయన్మార్‌కు మానవ అక్రమ రవాణా' కేసులో దర్యాప్తు జరుగుతోందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మానకొండూరు కేసుకు సంబంధించి ఇద్దరు ఏజెంట్లను గుర్తించినట్లు చెప్పారు. వారిని పట్టుకోవడం కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేశామని వివరించారు.

మట్టిని తవ్వేందుకు టన్నెల్‌లోకి రోబో

- మట్టి, బురదను పీల్చుకొని కన్వేయర్ బెల్టుపైకి... బండరాళ్లు వచ్చినా తవ్వడం ఈ రోబో ప్రత్యేకత
- డీ1 వద్ద మెటల్ ప్లేట్ కటింగ్.. ఖాళీ స్థలంలో మిగతా ఏడుగురి ఆచూకీ దొరికే అవకాశం


టన్నెల్ లోపలికి తీసుకువెళుతున్న రోబోట్


మహబూబ్‌నగర్/దోమలపెంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో జరిగిన ప్రమాదంలో 8 మంది చిక్కుకోగా ఇప్పటి వరకు ఒకరి మృతదేహం మాత్రమే లభించింది. మిగతా ఏడుగురి కోసం అన్వేషణ సాగుతోంది. క్యాడవర్ జాగిలాలు, జీపీఆర్ ఆధారంగా గుర్తించిన రెండు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. వాసన వస్తున్నట్లు చెబుతున్న డీ1 ప్రాంతం షీర్ జోన్‌లో ఉండడంతో దాదాపు 20 మీటర్ల మేర తవ్వకాలకు రోబోలను వినియోగించాలని నిర్ణయించారు. ఆల్ ఇండియా రోబోటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మదర్ రోబోను తీసుకొచ్చి కమ్యూనికేషన్, నావిగేషన్ సిద్ధం చేయగా బుధవారం 'అటానమస్ స్లడ్జ్ రిమూవల్ రోబో'ను టన్నెల్ లోపలికి పంపించారు. ఇందులోని హైడ్రాలిక్ సిస్టం బండలను పగులగొడుతుంది. ముందు ఉన్న గ్రైండర్‌లాంటిది మట్టిదిబ్బలను వదులుగా చేస్తుంది. పైపు ద్వారా మట్టి, బురదను పీల్చుకొని పైప్ ద్వారా కన్వేయర్ బెల్టుపై వేస్తుంది. దీనివల్ల డేంజర్ జోన్‌లో కూడా పని సులభం కానుంది. గంటకు వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించడం ఈ రోబో ప్రత్యేకత. దీనికి అవసరమైన రెండు చిన్న సైజ్ సూపర్ సక్కర్‌లను అన్వి రోబోటిక్స్ జాన్వి టెక్నాలజీస్ ఆధ్వర్యంలో తయారుచేసి తీసుకురానున్నారు. పూణే నుంచి మరో రెండు రోబోలను కూడా రప్పించనున్నారు. డీ1 ప్రాంతంలో టీబీఎం ఐరన్ షీట్‌ను కత్తిరిస్తున్నారు. దానికింద ఉన్న ఖాళీ స్థలంలో మిగిలిన కార్మికుల ఆచూకీ దొరకవచ్చని సహాయక బృందాలు అంచనా వేస్తున్నాయి. సహాయక చర్యలను స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్ పర్యవేక్షిస్తున్నారు.

స్వగ్రామంలో ముగిసిన గురుప్రీత్ సింగ్ అంత్యక్రియలు

నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన టన్నెల్ బోరు మిషన్ ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం పంజాబ్ రాష్ట్రంలోని తర్న్ తరన్ జిల్లా చీమకలాన్‌లో పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రకటించిన రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఆర్ఐ వెంకటేశ్వర్లు.. మృతుడి భార్యకు అందజేశారు. పంజాబ్ ప్రభుత్వం కూడా రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించి చెక్కు అందజేసింది.

స్మార్ట్ రేషన్ కార్డులు!

(మొదటి పేజీ తరువాయి)



కల్పించింది. ఈ నెల 26న సాంకేతిక, ఆర్థిక బిడ్‌లను తెరిచి, అర్హత సాధించిన వారికి కార్డుల ముద్రణ బాధ్యతలు అప్పగించనుంది. ఇందుకోసం 56 పేజీలతో కూడిన రిక్వస్ట్ ఫర్ ప్రపోజల్‌ను (ఆర్ఎఫ్‌పీ) టెండర్ నోటీసుతోపాటు జత చేసింది. కొత్తగా అందించనున్న రేషన్ కార్డులు గతంలో కంటే భిన్నంగా ఉండనున్నాయి. సైజు, కార్డుపై ముద్రించే వివరాల్లోనూ పౌరసరఫరాల శాఖ పలు మార్పులు చేసింది. ఈ మేరకు కొత్త కార్డుల ముద్రణ కోసం ఇచ్చిన టెండర్ నోటీసులో ఆ వివరాలను పేర్కొంది. కొత్త కార్డులపై కుటుంబ పెద్ద పేరు మినహా ఎవరి ఫొటోలనూ పెట్టడం లేదు. 760 మైక్రాన్స్ మందం, 85.4మి.మీ పొడవు, 54మి.మీ వెడల్పు ఉండే పీవీసీ కార్డుపై రేషన్ కార్డు వివరాలను పొందుపర్చనున్నారు. దీని ప్రకారం కొత్త రేషన్‌కార్డు ఏటీఎమ్ కార్డు సైజులో ఉండనుంది. కార్డుకు ఒకవైపు ప్రభుత్వ లోగో, కుటుంబ పెద్ద వివరాలు, హోలోగ్రామ్, మరో వైపు కార్డుదారుడి పూర్తి చిరునామా, క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి కోటి, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారికి 20లక్షల చొప్పున మొత్తం 1.20కోట్ల రేషన్ కార్డుల ముద్రణకు పౌరసరఫరాల శాఖ టెండర్లు పిలిచింది. కార్డుల సరఫరా పూర్తయ్యే వరకు లేదా రెండేళ్ల పాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. కొత్త కార్డుల ముద్రణకు అయ్యే ఖర్చును పూర్తిగా తామే చెల్లిస్తామని టెండరు నోటీసులో పౌరసరఫరాల శాఖ తెలిపింది. బోగస్, నకిలీ కార్డులకు చెక్ పెట్టేందుకే క్యూ ఆర్ కోడ్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు తెలిసింది. క్యూఆర్ కోడ్‌తో ఇచ్చే కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలన్నా, తొలగించాలన్నా పెద్దగా ఇబ్బందేమీ ఉండదని, మార్పులు చేసిన వెంటనే కొత్త క్యూఆర్ కోడ్‌ను జనరేట్ చేసి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అధికారిక వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 89,95,282 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో కేంద్రం ఇచ్చినవి (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు) 48,51,075, రాష్ట్రం ఇచ్చినవి (స్టేట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డు) 41,44,207 ఉన్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం, ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చడం కోసం దాదాపుగా 18 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి వచ్చాయి. వీటిలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులను ఇవ్వడంతోపాటు, కార్డుల్లో కొత్త కుటుంబ సభ్యుల పేర్లు చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సర్కారు నిర్ణయించింది.

కొత్త స్మార్ట్ కార్డు ఇలా..

ముందువైపు: తెలంగాణ ప్రభుత్వ లోగో, రేషన్‌కార్డు నంబర్, కుటుంబ పెద్ద పేరు, రేషన్ షాపు నంబర్, హోలోగ్రామ్, సంబంధిత అధికారి సంతకం

వెనుక వైపు: జిల్లా పేరు, మండలం, గ్రామం, క్యూ ఆర్ కోడ్, రేషన్ కార్డుదారుడి చిరునామా


బీసీ మేధావుల సదస్సులో తెలుగు రాష్ట్రాల ఎంపీలు

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాల్సిందే

- బీసీ మేధావుల సదస్సులో తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లపై క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కేంద్ర విద్యా, ఉద్యోగాలలో బీసీల రిజర్వేషన్లను జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బుధవారం, ఏపీ/తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓబీసీ డిమాండ్లపై జరిగిన బీసీ మేధావుల సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఆర్.కృష్ణయ్య, కలిశెట్టి అప్పలనాయుడు, బీద మస్తాన్‌రావు, అంబికా లక్ష్మీనారాయణ, బస్తీపాటి నాగరాజు, వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, ప్రైవేటు రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అప్పలనాయుడు అభిప్రాయపడ్డారు. బీసీ ఉద్యమం కీలక దశకు చేరుకుందని, పార్లమెంటులో బీసీ బిల్లుకు కట్టుబడి ఉన్నామని, ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి పార్లమెంట్‌లో బీసీ బిల్లులకు మద్దతు కూడగడతామని మస్తాన్‌రావు, లక్ష్మీనారాయణ తెలిపారు. 50 శాతం రిజర్వేషన్లు దక్కినప్పుడు మాత్రమే బీసీలకు నిజమైన స్వతంత్రం వస్తుందని బస్తీపాటి నాగరాజు తెలిపారు. బీసీ వాదానికి తమ బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు.

భానుడి భగభగ.. బేలలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత

- నేటి నుంచి 40 డిగ్రీలపైనే.. పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి తీవ్రత పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. గురువారం నుంచి రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గురు, శుక్రవారాలు కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ కూడా జారీ చేసింది. గురువారం ములుగు, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో 40 డిగ్రీలు దాటే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యధికంగా 39.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది.



అభివాదం చేస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్, మొట్టమొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు

మంద కృష్ణ మా నాయకుడు కాదు

- ఆయనను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నాం
- మంద కృష్ణ దీక్షల వెనుక బీజేపీ
- మొట్టమొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు

పంజాగుట్ట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మాదిగలను మోసం చేసిన మంద కృష్ణ మాదిగ తమ నాయకుడు కాదని, ఆయనను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నామని మొట్టమొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవని సతీష్ మాదిగ అధ్యక్షతన మొట్టమొదటి ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉద్యమకారులు, నాయకులు తమ అనుభవాలను పంచుకున్నారు. కొంత మంది కుహనా ఉద్యమ నాయకులు అమాయకులైన మాదిగ నిరుద్యోగ యువకులను రెచ్చగొట్టి వారిని ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నారని వారు ఆరోపించారు. రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకోవడానికి మంద కృష్ణ మాదిగ అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను బదనాం చేయడానికే మంద కృష్ణ దీక్షలు చేస్తున్నారని, ఆ దీక్షల వెనుక బీజేపీ ఉందని అన్నారు. ఈ సమ్మేళనంలో మాజీమంత్రి ఏ. చంద్రశేఖర్, కృపాకర్ మాదిగ, మేరీ మాదిగ, చిట్టిబాబు మాదిగ, ప్రకాష్ మాదిగ, రాయికంటి రామదాస్, పిడమర్తి రవి, పాలడుగు శ్రీనివాస్, జన్ను జయరాజ్, కొంగ్రు శంకర్, ముంజుగల్ల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బలూచ్ హెచ్చరిక!

బలూచిస్థాన్ వేర్పాటువాదులు ఒక రైలును హైజాక్ చేసిన ఉదంతం పాకిస్థాన్‌కు అత్యంత అవమానకరం. కథ సుఖాంతమైందని, ముప్పైమూడుమంది ఉగ్రవాదులను కాల్చిపారేశామని పాకిస్థాన్ ప్రభుత్వం చెబుతోంది. ఈ ఆపరేషన్‌లో మరణించిన సైనికుల, సామాన్యుల సంఖ్యకు సంబంధించి వేర్వేరు ప్రకటనల్లో తేడాలున్నప్పటికీ, సామాన్యులు బయటపడినందుకు సంతోషించాల్సిందే. మానవబాంబులుగా మారిన బలూచ్ తిరుగుబాటుదారుల గుప్పిట్లో ఐదువందల మందికి పైగా ప్రయాణికుల ప్రాణాలు ఉన్నందున, తక్కువ ప్రాణనష్టంతో ఎక్కువమందిని ఆదుకోవడం సులువేమీకాదు. ఈ అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్‌లో ప్రస్తుతానికి పాకిస్థాన్ పైచేయి సాధించినప్పటికీ, ఇంతకాలమూ మూడు చీలికలుగా ఒకే లక్ష్యంకోసం పోరాడుతున్న శక్తులు ఇటీవలే ఒక్కటైన తరువాత బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఎంత బలంగా తయారైందో ఈ ఘటన తెలియచెబుతోంది.

ఈ మార్గంలో ఎంతోకాలంగా నిలిచిపోయిన క్వెట్టా–పెషావర్ రైలు సర్వీసును ఇటీవలే తిరిగి ఆరంభించి, ఉగ్రవాదులకు భయపడేది లేదని పాకిస్థాన్ ప్రభుత్వం గొప్పలకు పోతున్న తరుణంలో ఈ ఘటన జరిగింది. 17 సొరంగాలున్న ఈ మార్గంలో, సాధారణ ప్రయాణికులతో పాటు నిరాయుధులైన సైనికులు కూడా పెద్దసంఖ్యలో ఆ రైలులో ప్రయాణిస్తున్నందున అది ఈ తరహా ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. క్వెట్టాకు 150 కిలోమీటర్ల దూరంలోని మెష్కాఫ్ సొరంగంలో ఆ రైలు వందమంది సాయుధుల చేతికి చిక్కింది. బీఎల్ఏ హెచ్చరికలను, డిమాండ్లను పాకిస్థాన్ సైన్యం ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా డ్రోన్లు, హెలికాప్టర్లతో అతివేగంగా ప్రతిస్పందించిందని, ఒక దశలో కాస్తంత తగ్గినా, తిరిగి విరుచుకుపడిందని వార్తలు వచ్చాయి. ఇప్పటివరకూ బీఎల్ఏ అనేక విధ్వంసాలు, ఆత్మాహుతిదాడులతో పాకిస్థాన్‌మీద కక్షతీర్చుకుంటున్నప్పటికీ, ఏకంగా ఒకరైలును హైజాక్ చేయడం, ఇలా సామాన్యులను బందీలుగా ఉంచుకోవడం ఎన్నడూ లేదు. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్ ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా, మరణాలను బీఎల్ఏ ఖాతాలో వేయవచ్చునన్న మొండిధైర్యంతో వ్యవహరించిందన్న ఆరోపణలు లేకపోలేదు. అలాగే, తిరుగుబాటుదారులు తమకు తాముగా విడుదల చేసిన మహిళలు, పిల్లల సంఖ్యలోనూ, సైనిక చర్య కారణంగా విడుదలైనవారి సంఖ్యలోనూ కొంత కలగాపులగం జరగవచ్చును. కొన్ని నిజాలు ఎన్నటికీ వెలుగుచూడని ఉదంతం ఇది.

పొరుగుదేశం ఆర్థిక, ఆయుధ సాయంతో బీఎల్ఏ రెచ్చిపోతున్నదంటూ పాకిస్థాన్ హోంశాఖ సహాయమంత్రి ఆఫ్ఘానిస్థాన్‌మీద విమర్శలు చేశారు. తెహ్రీక్ ఎ తాలిబాన్ పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావిస్తూ, తమ దేశం చల్లగా చక్కగా ఎదుగుతూంటే చూడలేని శక్తులన్నీ కలసికుట్రచేస్తున్నాయన్నారు. వీటికి మన శత్రువు భారతదేశం మద్దతు కూడా ఉన్నదని వ్యాఖ్యానించి కక్షతీర్చుకున్నారు. పాకిస్థాన్ సైన్యానికీ, బీఎల్ఏకీ మధ్య దశాబ్దాలుగా యుద్ధం సాగుతూనే ఉంది. దీనికితోడు, 2021లో తాలిబాన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆఫ్ఘానిస్థాన్‌తో వ్యవహారం మరీ చెడింది. పాక్ పశ్చిమ, నైరుతిప్రాంతాలు మండుతూనే ఉన్నాయి.


బలూచిస్థాన్ స్వాతంత్ర్యకాంక్షను అణచివేసేందుకు ఏడున్నర దశాబ్దాలుగా పాకిస్థాన్ అత్యంత అమానుషంగా వ్యవహరిస్తూ వస్తోంది. ఒక స్వతంత్ర సంస్థానంగా దాని విలీనం కూడా స్థానిక నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా జిన్నా కుట్రలూ, కుతంత్రాల మధ్యన జరిగిందని అంటారు. అత్యంత విలువైన ఖనిజనిక్షేపాలున్న ఈ ప్రాంతం చేజారిపోకుండా ఉండటానికి పాకిస్థాన్ పాలకులు ఈ ప్రావిన్సులో బూటకపు ఎన్నికలు నిర్వహిస్తూ, కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠిస్తుంటే, స్థానిక తెగలమధ్య చిచ్చు పెడుతూ బలూచ్‌లు బలపడకుండా సైన్యం జాగ్రత్తపడుతూంటుంది. సహజవనరులన్నా, నిరుపేదగా మిగిలిపోయిన ఈ ప్రావిన్సులో చైనా ఆరంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) మరింత అశాంతిని రగిలించింది. స్వాతంత్ర్యం కోసం, వనరుల దోపిడీకి వ్యతిరేకంగానూ పోరాడుతున్న బలూచ్‌లను ఊచకోత కోయడం కాక, సయోధ్యతో దారికి తెచ్చుకున్నప్పుడే పాక్ పశ్చిమప్రాంతంలో హింస కాస్తంతైనా తగ్గుముఖం పడుతుంది. బలూచ్‌లను దేశ భద్రతకు ప్రమాదకారులుగా భావిస్తున్నంతకాలం వారి ఆవేదన అర్థంకాదు, సమస్య పరిష్కారం కాదు. బిఎల్ఏ ఇటీవలి కాలంలో జరిపిన దాడులను బట్టి అది మరింత శక్తిమంతంగా తయారైన విషయం అర్థమవుతూనే ఉంది. రైలు హైజాక్ ఘటన పాకిస్థాన్‌కే కాదు, చైనాకు కూడా ఓ బలమైన హెచ్చరిక.

నియోజకవర్గాల పునర్విభజన అవసరమా?

భారత్‌కు ఇప్పుడు అవసరమైనది ఏమిటి? లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన. ఎంత మాత్రం కాదు. ప్రభుత్వమూ, ప్రజలు ఆలోచించాల్సిన విషయాలలో అది ఆఖరిది అవడం మంచిది. ఆ పునర్విభజన ప్రక్రియను మరో 30 సంవత్సరాల పాటు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేవలం ఒక రాష్ట్రం లేదా ఒక ప్రాంత ప్రయోజనాలను కాపాడుకునే నిమిత్తం ఆమోదించిన తీర్మానం కాదు అది. జాతీయ సమైక్యతను మరింత పటిష్ఠం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. లోక్‌సభా సీట్ల పునః కేటాయింపును శాశ్వతంగా నిలిపివేయడమే భారత్ సమైక్యతను కాపాడుతుంది. దేశ సమైక్యతకు ఎదురయ్యే సవాళ్లనన్నిటినీ సమర్థంగా ఎదుర్కొనేందుకు పునర్విభజన నిలిపివేత దోహదం చేస్తుంది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడమే; రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన అధికార –భాగస్వామ్య ఒప్పందాన్ని అనుల్లంఘనీయమైనదిగా పరిగణించాలి. దానిపై పునరాలోచన ఎంతమాత్రం అవసరం లేదు. పునర్విభజనను వ్యతిరేకిస్తున్నవారు ఆ ప్రక్రియను శాశ్వతంగా నిలిపివేయాలని కోరడం లేదు. వారు ఒక పరిమిత, లోపభూయిష్ఠ వాదన చేస్తున్నారు. 'జనాభా నియంత్రణ'లో కొన్ని రాష్ట్రాల సంపూర్ణ విజయాలు, మరికొన్ని రాష్ట్రాల వైఫల్యాల ప్రాతిపదికన చేస్తున్న వాదన అది. రాజ్యాంగంలో అంత స్పష్టంగా సూచితమైన, అయితే అనుల్లంఘనీయమైన 'సమాఖ్య ఒప్పందం' భావన భారతీయుల చర్చల్లో ప్రస్తావనకే రావడం లేదు. మన గణతంత్ర రాజ్యం ఏర్పాటై 75 సంవత్సరాలు గడచిన తరువాత ఇప్పుడు సమాఖ్య ఒప్పందం గురించి ఆలోచించడమెందుకు?

సమస్యను స్పష్టంగా అర్థం చేసుకుందాం. వర్తమాన చర్చ, ప్రస్తుత వాదన నియోజకవర్గాల తాజా పునర్విభజనకు సంబంధించిన రెండు అంశాలలో ఒకదానికే పరిమితమయింది. నియమానుసారం పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చి వేయడంపై ఎవరికీ ఆక్షేపణ లేదు. ఒక రాష్ట్ర పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చివేయడం లేదా అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచడం సమాఖ్య సమతౌల్యతను ప్రభావితం చేయవు. అసలు సమస్యేమిటంటే వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టడమే. యాభై సంవత్సరాల క్రితం రాష్ట్రాలకు కేటాయించే నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించారు. ఆ సంఖ్యను కొనసాగించాలా? లేక మార్చాలా? లేక ఎప్పటికీ యథాతథంగా కొనసాగించాలా? ఈ అంశాలపై నిశిత, నిష్పాక్షిక చర్చ జరగాలి.

జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజకవర్గాల పునర్విభజన 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ' అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న



రాష్ట్రాలకు లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించాలి. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు అదే ఉత్తమ మార్గం.

నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు యూపీలో 32 లక్షల మంది ప్రజలకు లోక్‌సభలో ఒక ఎంపీ ఉండగా కేరళలో 18 లక్షల కంటే తక్కువ మందికి లోక్‌సభలో ఒక ఎంపీ ఉన్నాడు. దీనివల్ల కేరళలో ఒక ఓటరుకు, యూపీలోని ఒక ఓటర్ కంటే రెట్టింపు ప్రాధాన్యముంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. మరి అలా ఉన్నదా? లేదు. కనుక ఈ అసంబద్ధతను తొలగించాల్సి ఉన్నది. అయితే చిన్న రాష్ట్రాల విషయంలో రాజ్యాంగం ప్రకారమే ఈ సూత్రం వర్తించదు. ఇందుకు రాజ్యాంగమే వెసులుబాటు కల్పించింది జనాభాలో తమ వాటా కంటే లోక్‌సభలో ఎక్కువ మంది ప్రతినిధులను కలిగి ఉండే హక్కు చిన్న రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. ఇటువంటి పరిస్థితులలో 'అసౌష్ఠవ సమాఖ్య విధానం' అమలులో ఉండేందుకు సమాఖ్యలోని వివిధ రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగ విహిత రక్షణలు కల్పించారు.



■ యోగేంద్ర యాదవ్

జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలన్న నిబంధనకు (కొన్ని రాష్ట్రాల విషయంలో) ఇచ్చిన మినహాయింపును ఇప్పుడు ఒక సాధారణ సూత్రంగా పాటించాలి, రాజ్యాంగ నిర్మాతలు చూడలేకపోయిన, ఊహించలేకపోయిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే ఆ 'సాధారణీకరణ' ఆవశ్యకత అర్థమవుతుంది. ఇదేమీ జనాభా నియంత్రణ విధాన సాఫల్య వైఫల్యాలకు సంబంధించినది కాదు. జననాల, మరణాల రేట్లు జనసంఖ్యా సంబంధి మార్పులకు అనుగుణంగా ఉంటాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు లేదా సామాజిక సమూహాలు జనాభా పెరుగుదల శీఘ్రగతిన నిలిచిపోవడం కద్దు. అదొక సహజ పరిణామం.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత జాతి జీవనంలో విభేదాలు, అనైక్యతలు తీవ్రమయ్యాయి. సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలు మూడింటిలోనూ ఈ విపరిణామాలు చోటుచేసుకున్నాయి, సంలీనమవుతున్నాయి. ఈ పతన ప్రక్రియ గత మూడు దశాబ్దాలలో మరింత వేగవంతమయింది. ఈ నేపథ్యంలో తాజా నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లోక్‌సభ సీట్ల పునఃకేటాయింపు ఆ విభేదాలు, అనైక్యతలకు దోహదం చేసే మరొక ప్రమాదకర అంశమవుతుంది. ఇది జాతీయ సమైక్యతా స్ఫూర్తిని మరింతగా బలహీనపరుస్తుంది. భారతదేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ఉన్న సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంతరాలు, అనైక్యతలను తొలగించేందుకు తక్షణ కృషి జరగాలి. ఈ దృష్ట్యా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలి.

హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలు, హిందీయేతర, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు నెలకొనివున్నాయి. ఈ తేడాలు మొదటి నుంచీ ఉన్నప్పటికీ దేశ విభజన అనంతరం బాగా పెరిగిపోయాయి. అయితే తొలి నాటి రాజకీయ నాయకులు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, హిందీని ఏకైక అధికార భాషగా ఉండకూడదన్న డిమాండ్‌ను అంగీకరించడం ద్వారా హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సమైక్యతను సంరక్షించారు. గత మూడు దశాబ్దాలుగా దేశ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు దక్షిణ–పశ్చిమ భారత రాష్ట్రాలు, ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలను సృష్టించాయి. దేశ రాజకీయాలలో ఒక ప్రధాన శక్తిగా బీజేపీ ప్రభవించడం ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల సంబంధాలను ప్రభావితం చేస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఒక తిరుగులేని శక్తిగా ఉండగా ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా దక్షిణాదిన దాని ఉనికికి తీవ్ర పోటీ ఎదురవుతోంది.

హిందీ, హిందీయేతర రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు, ఆర్థిక అసమానతలు, రాజకీయ అంతరాలను తొలగించని పక్షంలో దేశ సమైక్యతకు ముప్పు ఏర్పడుతుందనడంలో సందేహం లేదు.

నియోజకవర్గాల పునర్విభజనతో వ్యత్యాసాలు, అసమానతలు, అంతరాలు మరింత తీవ్రమయ్యే అవకాశమున్నది. 2026 జనాభా గణన అనంతరం జనాభా ప్రాతిపదికన ప్రతి రాష్ట్రానికి లోక్‌సభ సీట్ల కేటాయింపు పర్యవసానాలు ఎలా ఉంటాయో మిలన్ వైష్ణవ్, జమియె హింట్సన్‌లు విశ్లేషించారు. ఈ విశ్లేషణ ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు భారీగా నష్టపోతాయి. లోక్‌సభలో కేరళ, తమిళనాడు చెరొక ఎనిమిది సీట్లను కోల్పోతాయి; తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు కలిసికట్టుగా ఎనిమిది సీట్లను నష్టపోతాయి; కర్ణాటక రెండు సీట్లను కోల్పోతుంది. ఇతర హిందీయేతర రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్ నాలుగు సీట్లను, ఒడిషా మూడు సీట్లను, పంజాబ్ ఒక స్థానాన్ని కోల్పోతాయి. ఉత్తరాదిలో హిమాచల్, ఉత్తరాఖండ్‌లు ఒక్కొక్క సీటును కోల్పోతాయి. అయితే యూపీ అదనంగా 11 సీట్లను పొందుతుంది. బిహార్‌కు అదనంగా పది సీట్లు, రాజస్థాన్‌కు అదనంగా ఆరు సీట్లు, మధ్యప్రదేశ్‌కు అదనంగా నాలుగు సీట్లు లభిస్తాయి.

ఆయా రాష్ట్రాలకు ఈ లాభనష్టాల వల్ల హిందీ, హిందీయేతర భాషా రాష్ట్రాల మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యత మరింతగా దెబ్బతింటుంది. ప్రస్తుతం లోక్‌సభలోని 543 స్థానాలలో 226 హిందీ భాషా రాష్ట్రాల్లో ఉన్నాయి. పునర్విభజన తరువాత వాటి సంఖ్య 259కి పెరుగుతుంది. ప్రస్తుతం 132 స్థానాలు ఉన్న దక్షిణాది రాష్ట్రాలు తూర్పు, పశ్చిమ రాష్ట్రాలతో కలిసి ఏదైనా కీలక రాజ్యాంగ సవరణను వీటో చేయగలిగే స్థితిలో ఉన్నాయి. పునర్విభజన అనంతరం వాటికి ఇటువంటి వెసులు బాటు ఉండదు. ఇది భారత గణతంత్ర రాజ్య సంస్థాపక సూత్రాల స్ఫూర్తికి విరుద్ధమైనది. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు తీవ్ర విఘాత మేర్పడుతుంది. ఈ ప్రాథమిక సూత్రాలను గౌరవించడం అంటే మన రాజ్యాంగంలో అంతర్గతంగా ఉన్న ఒక సమాఖ్య ఒప్పందానికి ఒక ప్రాతిపదికను ఏర్పరచుకోవడమే అవుతుంది. మన సమాఖ్య, స్వతంత్ర రాష్ట్రాలు ఒక విశాల దేశాన్ని ఏర్పాటు చేయడానికి స్వచ్ఛందంగా కలిసిన రాజకీయ వ్యవస్థ కాదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో అధికారంలో భాగస్వాములుగా ఉన్న సమాఖ్య రాజకీయ వ్యవస్థ మనది. ఈ కారణంగానే మన సమాఖ్య ఒప్పందం లిఖితపూర్వకంగా లేదు. అది రాజ్యాంగంలో సూచనప్రాయంగా మాత్రమే ఉన్నది. అయితే అదొక మౌలిక సూత్రం.


ఈ సమాఖ్య ఒప్పందాన్ని అంగీకరించడమంటే రెండు వాదనలకు శాశ్వతంగా ముగింపు పలకడమే. అవి: జనాభా ఆధారిత రాజకీయ ప్రాతినిధ్యం; పన్నుల రాబడి ప్రాతిపదికన ఆర్థిక వనరులలో వాటా. హిందీ భాషా రాష్ట్రాలు, హిందీయేతర భాషా రాష్ట్రాలు ఈ రెండు అంశాలలో ఒకదానితో లబ్ధి పొందగా మరొకదాని విషయంలో నష్టపోతాయి. ఎన్నికల ప్రయోజనాలను పక్కన పెట్టి ఈ సమాఖ్య ఒప్పందంపై జాతీయ ఏకాభిప్రాయాన్ని సాధించడం, భారత గణతంత్ర రాజ్యసంస్థాపక సూత్రమైన 'జస్ట్ రిపబ్లిక్' (న్యాయమైన గణతంత్రం) దిశగా ముందంజవేయడమే అవుతుంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

స్త్రీ ఔన్నత్యాన్ని ఆవిష్కరించిన రాయప్రోలు

మాతృ హృదయంతో పురుష రూపంలో జన్మించిన మొట్టమొదటి విమర్శకుడు, కవి ఎవరు? అంటే ఈ శతాబ్దంలో రాయప్రోలు సుబ్బారావు గారనే చెప్పాలి! కవిత్వంలోను సాహిత్య విమర్శలోను ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలకు భూమిక 'స్త్రీ'. కవిగా తృణకంకణాది కావ్యాలతోపాటు విమర్శకుడిగా స్త్రీవాద భావనను ఆలంబనగా చేసికొని రమ్యాలోకాది విమర్శ గ్రంథాలను రాశాడు. తన కాలంలోను, తన కాలానికి ముందున్న సాహిత్యంలోను స్త్రీ వర్ణన రాయప్రోలు మనసు కలచివేసింది. స్త్రీని భోగ, విలాస వస్తువుగా చూసే ఈ సమాజానికి తరుణోపాయం కనిపెట్టాలని తపించాడు. చిన్నతనంలో పిన్నమ్మ రామడుగు నరసమ్మ వద్ద పొందిన సంస్కారం ఈ తపనకు ప్రాణం పోసింది.

ఒకనాడు రాయప్రోలు 'అనసూయ చరిత్ర' చదువుతుండగా విన్న పిన్నమ్మ, "నాన్నా చూచావురా! త్రిమూర్తులు కూడా ఎలా తల్లికంటితో చూస్తే చంటిపిల్లలయినారో! ఇలాంటి భావం మన కథా కలాపాలలో ఇంకా అధికంగా ఉంటే ప్రేమ భాండం తొణికేదా! ఏ గ్రంథంలో విన్నా ఆడవాళ్ళను గురించి ఏమేమో రాస్తారు మగవాళ్ళు" అని అన్నది. కవిగా విమర్శకుడిగా రాయప్రోలుకు ప్రేరణను ఇచ్చిన ఈ మాటలు తక్షణ కర్తవ్య బోధకాలై సాహిత్య విమర్శలోను, కవితా రచనలోను ఒక అభినవ ఆదర్శాన్ని, దర్శనాన్ని కలిగించినవి. పిన్నమ్మ నరసమ్మ మాటలే రాయప్రోలు సాహిత్య విమర్శలో మూడు గ్రంథాలుగా రూపుదిద్దుకున్నవి. అవి: 'రమ్యాలోకం', 'మాధురీ దర్శనం', 'రూపనవనీతం'. ఈ మూడు విమర్శ గ్రంథాలు స్త్రీ ఔన్నత్యాన్నీ, స్త్రీ శక్తినీ, స్త్రీ వ్యక్తిత్వాన్నీ విస్తృత ప్రాతిపదికపై చర్చించి విశ్లేషించినవి. సామాజిక సాంస్కృతిక సంబంధాల దృష్టితో కుటుంబ నిర్వహణలో పురుషుని కంటే స్త్రీ ఉన్నతమైన భూమికను ధరిస్తున్నదని రాయప్రోలు ఈ గ్రంథాలలో నిరూపించినాడు.



ఆధునిక విద్యా సౌకర్యాల వలన స్త్రీ పురుషులు కలిసి చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన సామాజిక అవసర నేపథ్యంలో మగవాడి మోసానికి బలైపోతున్న స్త్రీల జీవితాలను, ఆత్మత్యాగాలను చూసిన రాయప్రోలు వాటికి పరిష్కార మార్గంగా అమలిన శృంగార సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టినాడు. 'తృణకంకణ' కావ్య పీఠికలో– సంభోగ పరిణామం పొందని కేవల భావాత్మకమైన స్నేహయోగంగా నవీన ప్రేమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించానని చెప్పాడు రాయప్రోలు. ఆ రోజుల్లో తెలుగు కవిత్వానికి ఇది ఒక నూతన లక్ష్యంగా గుర్తింపబడింది.

"నా అమలిన శృంగార విషయంలో శబ్దౌచిత్యమును పాటించాను. చక్రస్తనీ, రంభోరూ, లలనా ఇత్యాదులు కేవల స్త్రీ వాచకములుగా వాడక జాగ్రత్తపడ్డాను" అంటూ తన కావ్యాలలో వీలైనంతవరకు ఎక్కడా స్త్రీని తక్కువ దృష్టితో చూసే పదాలను రాయప్రోలు ఉపయోగించలేదు. దాదాపు స్త్రీని సంబోధిస్తూ వాడిన పదాలన్నీ లలితా సహస్రనామాలలోనో, లేక మరే స్తోత్రంలోనో దేవీపరంగా ఉన్నటువంటివే కావడం రాయప్రోలు స్త్రీభావనా దృక్పథంలోని విశిష్టతను వెల్లడిస్తుంది.

'రమ్యాలోకమ్', 'మాధురీదర్శనమ్' గ్రంథాలలో రాయప్రోలు స్త్రీ దృష్టితో వ్యాఖ్యానించిన అంశం 'నరనారీ సంబంధం'. మానవులందరూ స్త్రీ పురుష భేదం చేత మౌలికంగా రెండే రెండు వర్గాలు. ఈ రెండు వర్గాల పరస్పర సంబంధం మీదనే మానవ జీవితం, మానవ సమాజం అభివృద్ధి మార్గంలో విస్తరిస్తున్నది. రాయప్రోలు ఈ సంబంధాలను నాలుగు రూపాలుగా స్త్రీ యందు ఇట్లు చూపినాడు: "నరనారీ సంబంధము/ పరిభావింపుము దిశా విభాగము వరుసన్/ ధర జననీ, భగినీ, సహ/చరీ కుమారీ క్రమము నిజంబగుట సుధీ!" అన్నాడు. జననీ, భగినీ, సహచరీ, కుమారీ అని నాలుగు రూపాలలో స్త్రీ పురుషుని జీవితాన్ని నాలుగు దిక్కులుగా, ఆవరించి ఉంటుందని దీని తాత్పర్యం. పురుషునికి జన్మించిన వెంటనే ఒక్క స్త్రీతో కలిగే మొట్టమొదటి సంబంధం జనని, ఆ తరువాత అతని పెరుగుదలలో స్త్రీతో కలిగే తరువాత సంబంధం భగిని (సోదరి), యౌవన దశకు వచ్చేసరికి స్త్రీతో ఏర్పడే సంబంధం సహచరి, ఆ తరువాతది కుమారి. ఈ విధంగా పురుషుని జీవితంలో స్త్రీ నాలుగు రూపాలతో ఆవరించి ఉంటుందని రాయప్రోలు వ్యాఖ్యానించడం మానవ జీవితంలో స్త్రీ ప్రాముఖ్యాన్ని వెల్లడించడమే!

రాయప్రోలు తన 'నవకవిత' వ్యాసంలో స్త్రీ పురుషుల సంబంధాన్ని విశ్లేషిస్తూ రామాయణకాలం కంటే ముందు స్త్రీ పురుషుల సంబంధం పశుపక్ష్యాదులలో వలె అవ్యవస్థితంగా ఉండేది అంటూ సత్యకామ జాబాలి కథను ఉదాహరిస్తాడు. దశరథుడికి ముగ్గురు భార్యలు ఉండటం కూడా ఈ అవ్యవస్థకి ఉదాహరణ అనీ, అందుకే వాల్మీకి రామాయణాన్ని రాసి సీతారాముల ద్వారా ఒక్క స్త్రీకి ఒక్క పురుషుడు, ఒక్క పురుషుడికి ఒకే స్త్రీ అని సమాజ ధర్మంగా ప్రకటించినాడని అంటాడు. సూత్రభాష్యం రాసి తత్త్వోపదేశం చేసిన శంకరాచార్యులు సారసత్వాన్ని దేవీస్తన్యంగా వర్ణించడం స్త్రీ భావనలోని విశిష్టతగా పేర్కొంటాడు.

"నా అమలిన శృంగార విషయంలో శబ్దౌచిత్యమును పాటించాను. చక్రస్తనీ, రంభోరూ, లలనా ఇత్యాదులు కేవల స్త్రీ వాచకములుగా వాడక జాగ్రత్తపడ్డాను" అంటూ తన కావ్యాలలో వీలైనంతవరకు ఎక్కడా స్త్రీని తక్కువ దృష్టితో చూసే పదాలను రాయప్రోలు ఉపయోగించలేదు. దాదాపు స్త్రీని సంబోధిస్తూ వాడిన పదాలన్నీ లలితా సహస్రనామాలలోనో, లేక మరే స్తోత్రంలోనో దేవీపరంగా ఉన్నటువంటివే కావడం రాయప్రోలు స్త్రీభావనా దృక్పథంలోని విశిష్టతను వెల్లడిస్తుంది. ఈ విధంగా 'స్త్రీ భావన' కేంద్రంగా సాగిన రాయప్రోలు సాహిత్య విమర్శ గత శతాబ్దంలో ఆధునిక కవులకు ఒక సిద్ధాంతంగా ఒక తత్త్వోపదేశంగా ఎంతో ఉపకరించింది.

• ఆచార్య కె. యాదగిరి
పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమి

(నేడు రాయప్రోలు సుబ్బారావు జయంతి)

వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని వ్యతిరేకిద్దాం!

తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి వుందని జనవరి మొదటి వారంలో ప్రకటించిన నరేంద్ర మోదీ అంతకు ముందే రైతులను తీవ్రంగా నష్టపరిచే, వ్యవసాయం మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే 'జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం' ముసాయిదాను 2024 నవంబర్ 24న తీసుకువచ్చారు. "మార్కెట్ సౌకర్యం" పేరుతో వ్యవసాయోత్పత్తులను కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చే వాతావరణం కోసమే మోదీ ప్రభుత్వం ఈ ముసాయిదాను తెచ్చిందని స్పష్టమవుతున్నది. ఇది రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు మరో రూపమే తప్ప మరొకటి కాదు.

ఎన్నో దుష్ఫలితాలను తెచ్చిపెట్టే ఈ 'జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం' ముసాయిదాను ఉపసంహరించుకోవాలి. రైతుల, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానం తేవాలి. ఈ సమగ్ర విధానంలో భాగంగా కనీస మద్దతు ధరకు (ఎం.ఎస్.పి.) చట్టబద్ధత కల్పించాలి. మద్దతు ధరల నిర్ణయం స్వామినాథన్ సిఫారసుల ప్రకారం నిర్ణయించి ప్రభుత్వ సంస్థలే కొనాలి. మార్కెట్ కమిటీల వ్యవస్థలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న గిడ్డంగులను ఆధునీకరణ చేయాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలి. ఈ డిమాండ్లతో నేడు (మార్చి 13న) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎమ్) ఆధ్వర్యంలో ధర్నా జరుగుతున్నది. కార్పొరేట్ అనుకూల పాలక విధానాలపై రైతాంగం చైతన్యంతో, సమైక్యంగా పోరాడుదాం!

– కెచ్చెల రంగారెడ్డి
ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు

అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు 'ప్రతిపక్షనేత' ఎందుకు?

అధికారం ఉన్నా లేకున్నా అంతే బాధ్యతలేని నాయకునిగా మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత కేసీఆర్ చరిత్రలో మిగిలిపోతారు. అధికారం ఉన్నప్పుడు బంధువులు, వంధిమాగధులతో రాజభోగాలు అనుభవించారు. అధికారం పోగానే ప్రజా బాహుళ్యాన్ని పట్టించుకోకుండా అజ్ఞాతంలో ఉండిపోయారు. అధికారం ఉన్నా, లేకపోయినా నాయకుడు ప్రజల మధ్యనే ఉండాలి. ప్రతిపక్షంలో ఉన్నా ప్రభుత్వానికి విలువైన సూచనలు చేయాలి. కేసీఆర్ అధికారంలో ఉండగా సెక్రటేరియట్‌కు గానీ, నేడు ప్రతిపక్షంలో ఉండగా అసెంబ్లీకి గానీ వచ్చింది లేదు. ఫామ్‌హౌస్ లోనో, ప్రగతిభవన్ లోనో రెస్ట్ తీసుకుంటుంటారు.

గతంలో ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నలు వేసి ఎక్కడ ఇరుకున పెడతారోనని అధికార పక్షం భయపడేది. కానీ నేడు దానికి భిన్నంగా అధికారపక్షమే ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రావాలని కోరినా, రాననే పరిస్థితిని చూస్తున్నాం. ముఖ్యమైన బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు సైతం కేసీఆర్ అసెంబ్లీకి రావటానికి విముఖత చూపుతున్నారు. గత సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు అసెంబ్లీకి చుట్టపుచూపుగా వచ్చి కాసేపు అసెంబ్లీలో కూర్చొని వెళ్లిపోయారు. అసెంబ్లీకి రావటం లేదు కానీ జీత భత్యాలు మాత్రం ఠంచన్‌గా తీసుకుంటున్నారు. ప్రతిపక్ష నాయకునిగా కేసీఆర్ డిసెంబర్ 2023 నుంచి ఇప్పటిదాకా 58.8లక్షల రూపాయలు జీతంగా తీసుకోగా, జూలై 25, 2024న ఒకే ఒక్కరోజు శాసనసభకు హాజరు అయ్యారు, అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయారు. మళ్ళీ మార్చి 12, 2025న బడ్జెట్ సమావేశాల ఆరంభంనాడు కనిపించారు. సామాన్య ప్రజల కష్టాన్ని జీతభత్యాల రూపంలో తీసుకుంటున్న కేసీఆర్ ఒక్కరోజు కూడా ప్రజల కోసం పని చేయనప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉండదగునా?

ఇటీవల ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై చర్చించడానికి ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది. ఈ సమావేశం ఒక చారిత్రాత్మకమైనది. ఈ సమావేశానికి హాజరై ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తన అమూల్యమైన సలహాలను, సూచనలను అందిస్తారని అందరూ భావించారు. కానీ ఆయన ఈ సమావేశాలకు హాజరుకాలేదు. చదువుపై శ్రద్ధలేని జులాయిలు స్కూల్ ఎగ్గొట్టినట్లు కేసీఆర్ అసెంబ్లీ ఎగ్గొడుతున్నారు.

మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త, దేశానికి దశ దిశ నిర్దేశం చేసిన మహనీయుడు మన్మోహన్‌సింగ్ మరణం సందర్భంగా పార్టీలకు అతీతంగా అందరు నాయకులు వెళ్లి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్ర క్యాబినెట్, దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీల నేతలందరూ వారి అంత్యక్రియలకు హాజరయ్యారు. కేసీఆర్ మాత్రం ఫామ్‌హౌస్‌ను దాటి బయటకు రాలేదు. తెలంగాణ బిడ్డ, తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు మరణించిన సందర్భంలో సైతం కేసీఆర్ ఇదేవిధంగా వ్యవహరించారు. అప్పుడు కేంద్రమంత్రి అయిన కేసీఆర్, పీవీ అంత్యక్రియలకు హాజరుకాలేదు. ఢిల్లీలోనే ఉన్నారు తప్ప కనీసం వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించలేదు. రాజకీయాలకు మాత్రం పీవీ పేరును వాడుకుంటారు. ఇది కేసీఆర్ నీతి, రీతి.

ప్రతిపక్ష నాయకునిగా కేసీఆర్ డిసెంబర్ 2023 నుంచి ఇప్పటిదాకా 58.8 లక్షల రూపాయలు జీతంగా తీసుకోగా, జూలై 25, 2024న ఒకే ఒక్కరోజు శాసనసభ అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి వెళ్లిపోయారు. మళ్ళీ మార్చి 12, 2025న బడ్జెట్ సమావేశాల ఆరంభంనాడు కనిపించారు. సామాన్య ప్రజల కష్టాన్ని జీతభత్యాల రూపంలో తీసుకుంటున్న కేసీఆర్ ఒక్కరోజు కూడా ఆ ప్రజలకోసం పని చేయనప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉండదగునా?



2004లో కేసీఆర్ కేంద్ర కార్మికమంత్రిగా పనిచేశారు. మంత్రులు తప్పనిసరిగా సభకు హాజరై సభ్యులు అడిగిన ప్రశ్నలకు స్వయంగా సమాధానాలివ్వాల్సి ఉండగా, కేసీఆర్ పార్లమెంట్‌కు వెళ్ళేవారు కాదు. సభ్యుల ప్రశ్నలకు కేబినెట్ మంత్రి కేసీఆర్‌కు బదులుగా, సహాయమంత్రి సమాధానాలివ్వడంపై స్పీకర్ సోమనాథ్ చటర్జీ అప్పట్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ మీ మంత్రి కేసీఆర్‌కు బదులుగా మీరు సమాధానాలు ఎందుకు చెబుతున్నారని, మీ మంత్రి సభకు ఎందుకు రావడం లేదని సభా వేదికగా ప్రశ్నించినా, కేసీఆర్‌లో ఎటువంటి చలనం రాలేదు. క్యాబినెట్ హోదాలో కేంద్రమంత్రిగా ఉండి కూడా సభకు హాజరు కాకుండా బాధ్యతారహితంగా వ్యవహరించడం కేసీఆర్‌కే చెల్లింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఏ ప్రారంభోత్సవాలకూ వెళ్లేవారు కాదు. ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు రారనే విషయం తెలిసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆశ్చర్యపోయారు. కోట్లు ఖర్చు పెట్టి ప్రజల సొమ్ముతో ప్రగతి భవన్‌ను నిర్మించుకొని అందులో ఉండి అక్కడి నుంచే పాలన చేసేవారు.

అధికారులు సెక్రటేరియట్ నుంచి ప్రతిరోజూ ఫైళ్లు మోసుకొని సంతకాల కోసం ప్రగతిభవన్‌కు వెళ్లి పడిగాపులు పడేవారు. ఐనా రోజుల తరబడి వారికి ముఖ్యమంత్రి కేసీఆర్ దర్శనం లభించేది కాదు. ఆయన సంతకాల కోసం వేల ఫైళ్లు పెండింగ్‌లో పడి ఉండేవి. చివరకు మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా నెలల తరబడి దర్శనం లభించేది కాదు. మంత్రులు ప్రగతి భవన్‌కు వెళితే అపాయింట్‌మెంట్ లేదని గేటు దగ్గర నుంచి సెక్యూరిటీ వాళ్లు వెనక్కి పంపించేవారంటే కేసీఆర్ దొరతనం ఎంతటిదో తెలుస్తుంది. మంత్రులకే రోజులు వారాల తరబడి కేసీఆర్ దర్శనం దొరకలేదంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటో ఆలోచించవచ్చు. రాష్ట్రాధినేత అయిన ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు? ఎక్కడ ఉన్నారు? అనే విషయం ప్రతిరోజూ మీడియా ద్వారా ప్రజలకు తెలుస్తుండాలి. కానీ, వారాల తరబడి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఏం చేస్తున్నారనేది ప్రజలకు తెలిసేది కాదు. అమాస పున్నానికన్నట్టు ఎప్పుడో ఒకరోజు మేల్కొని దర్శనమిచ్చేవారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు దేశంలోని నాయకులందరూ హాజరైనా ముఖ్యమంత్రిగా ఉండి కేసీఆర్ మాత్రం హాజరయ్యేవారు కాదు. దీనిని అహంకారం అనుకోవాలా? బలహీనవర్గాల వారిపట్ల చిన్నచూపు అనుకోవాలా?

ముఖ్యమంత్రి అయిన ఏడాదిలో రేవంత్‌రెడ్డి రెండుసార్లు దావోస్, సింగపూర్‌లో సదస్సులకు హాజరై రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చారు. కానీ కేసీఆర్ ఒక్కసారి కూడా ఇలాంటి సదస్సులకు హాజరు కాలేదు. రాష్ట్రంలో జరిగే ఎగ్జిబిషన్లు, పారిశ్రామిక సమ్మిట్లకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎప్పుడూ హాజరుకాలేదు. తన కొడుకును వీటికి పంపించేవారు. రాష్ట్రాన్ని తమ స్వంత ప్రైవేట్ కంపెనీగా భావించి తండ్రికి బదులుగా ప్రతిదానికీ కొడుకు ప్రారంభోత్సవాలు నిర్వహించేవారు.

అహంకారపు ఆనవాళ్లు మిగులొద్దని, నిరంకుశ పాలన మాకొద్దని ప్రజలు కేసీఆర్‌ను తిరస్కరించారు. కానీ అహంకారమే తన ఓటమికి కారణమని కేసీఆర్ నేటికీ గ్రహించలేదు. తన శైలిని మార్చుకుని ప్రజల మన్ననలను తిరిగి పొందడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయటం లేదు. తమను ఓడించి ప్రజలు తప్పు చేశారనే భావనలోనే కేసీఆర్, ఆయన బృందం ఇంకా ఉందని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తూనే ఉన్నాయి. ఆ భ్రమలో ఉన్నందునే మళ్లీ కేసీఆరే రావాలని జనం కోరుకుంటున్నారని కేటీఆర్ అంటున్నారు. కానీ ప్రజలు తెలివైనవారు. ఎవరినీ ఎక్కడ ఉంచాలో వారికి బాగా తెలుసు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే ఉంటానంటే ప్రజలకేమీ అభ్యంతరం ఉండదు. ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేసి ఫామ్‌హౌస్‌కే పరిమితమై అక్కడే శేష జీవితం గడిపితే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదు.

■ బోరెడ్డి అయోధ్యరెడ్డి
సీపీఆర్ఓ, తెలంగాణ ముఖ్యమంత్రి

దేవాదుల పంప్ హౌస్ సందర్శనకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదల ఈఎన్‌సీ వాహనాన్ని అడ్డుకుంటున్న చలివాగు పరివాహక ప్రాంత రైతులు (ఫైల్)



పంటలకు సాగునీరు అందించాలని దేవాదుల పంప్‌హౌస్ వద్ద ఇటీవల రైతులతో కలిసి ధర్నా చేసిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర



చలివాగులో.. నీళ్ల కొట్లాట!

- నీటిమట్టం తగ్గినా ధర్మసాగర్ మండలానికి తరలింపుపై అభ్యంతరం
- రైతులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర ధర్నా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి వివాదం
- నీటిమట్టాల పెంపునకు నీటిపారుదల శాఖ అధికారుల ప్రయత్నాలు



చలివాగు

ఆయకట్టుకు నీరదండం లేదని శాయంపేట రైతుల ఆందోళన బాట

శాయంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చలివాగు సాగునీటి సరఫరా వివాదం చిలికి చిలికి గాలివానలా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చలివాగు నుంచి సరఫరా అయ్యే సాగు నీళ్లు ఆయకట్టుకు అందడం లేదని శాయంపేట మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. తమకు నీళ్లు ఇవ్వకుండా పంపింగ్ ద్వారా ధర్మసాగర్ మండలానికి నీటి తరలింపు ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల పంప్‌హౌస్ సందర్శనకు వచ్చిన ఈఎన్‌సీ వాహనాన్ని రైతులు చుట్టుముట్టారు. ఇది చివరకు రాజకీయ వివాదంగా మారే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిదాకా వెళ్లడంతో పరిస్థితి తీవ్రస్థాయికి చేరుకున్నది. మంత్రి సైతం జోక్యం చేసుకోవలసి వచ్చింది.

తగ్గిన నీటిమట్టం

భూపాలపల్లి, భీంఘనపూర్ రిజర్వాయర్ల నుంచి శాయంపేట మండలంలోని చలివాగు, దామెర మండలం పులుకుర్తిలోకి మోటార్ల ద్వారా సాగు నీరు ఎత్తిపోతలు జరుగుతాయి. చలివాగులోని రెండు మోటార్లద్వారా ఇక్కడి నుంచి నీరు ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి లిఫ్టు అవుతుంది. కాగా, కొద్ది రోజులుగా చలివాగులో నీటిమట్టం పడిపోయింది. దీంతో మోటార్లు, సైఫన్ల ద్వారా నీటిని వాడుకునే కాలువ కింద ఆయకట్టుదారులకు సాగునీరు అందడం లేదు. తమ పంట పొలాలు ఎండిపోతున్నందు వల్ల ధర్మసాగర్‌కు నీటిని పంపు చేసే రెండు మోటార్లను నిలిపివేయాలని రైతులు పంప్‌హౌస్ వద్ద ఆందోళనకు దిగారు వీరికి మద్దతుగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కూడా ధర్నా చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు నీటిపారుదల శాఖ అధికారులు అక్కడికి రాగా, రైతులు వారి వాహనాలను సైతం ముట్టడించారు. రైతుల డిమాండ్ మేరకు చలివాగులో ప్రస్తుతం నడుస్తున్న రెండు మోటార్లలో ఒక మోటారును నిలిపివేశారు. నాలుగైదు రోజుల్లో చలివాగులో నీటి మట్టాలు గరిష్టస్థాయికి వస్తాయని రైతులకు నచ్చచెప్పి శాంతింప చేశారు. అయితే పులుకుర్తి రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద పనిచేసే ఉద్యోగులకు జీతాలు, కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకోవడం వల్లనే వారు నీటి ఎత్తిపోతలను నిలిపివేశారన్నది రైతులు ఆరోపణ. దీంతో చలివాగులో నీటి మట్టం తగ్గిందని అంటున్నారు. అయితే అలాంటిదేమీ లేదని, పులుకుర్తి లిఫ్ట్ వద్ద ఏర్పడిన సాంకేతికతే చలివాగు నీటిమట్టంపై పడిందనేది నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇదిలా వుండగా, ఒక మోటారును నిలిపి వేయడంతో చలివాగు నుంచి పంపింగ్ తగ్గి ధర్మసాగర్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడిందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చినట్టు తెలిసింది. దీంతో రెండు రోజుల కిందట అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శాయంపేటకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు మంత్రి ఫోన్ చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో ఎమ్మెల్యే గండ్ర తన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని హుటాహుటిన మంత్రిని కలవడానికి హైదారాబాద్‌కు బయలు దేరారు.

మరోవైపు ఈ సమస్యను పరిష్కరించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చలివాగు కింది ఆయకట్టుదారులకు సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పులుకుర్తి పంపులోని సాంకేతిక సమస్యను తొలగిస్తూ చలివాగులో నీటి మట్టాలను పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నారు. మూడు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారం అయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి చలివాగు నీటి పంపింగ్ వ్యవహారం ముదిరి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక మాజీ ఎమ్మెల్యే మధ్య కేంద్రీకృతం అయింది.

సైబర్ నేరాలపై అవగాహనకు..



నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్

సందేహాలు నివృత్తి చేయనున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 87126 65552

వరంగల్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతికతతో పాటు ఆన్‌లైన్ మోసాలు, నేరాలు కూడా రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ మోసగాళ్లు మాయమాటలు చెబుతూ.. వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. యాప్‌లు, రుణాలు, ఆఫర్లు అంటూ ఫోన్లు చేసి.. వినియోగదారుల ఖాతాలను లూటీ చేస్తున్నారు. రోజూ ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు వయసు, చదువుతో సంబంధం లే కుండా సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుకుంటున్నారు. సొమ్ములు పోగొట్టుకుని మనోవేదనతో ప్రాణాలు కూడా తీసుకుంటున్న వారున్నారు. ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రజలు తమ సందే హాలను నివృత్తి చేసుకోవచ్చు.

గురుకులాల్లో వసతులపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధ వారం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో ఫుడ్‌సేఫ్టీ, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 110 గురుకులాలు ఉన్నాయని, భోజనం, ఇతర వసతులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్ ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యకు వివరించారు. గురుకులాల్లో తాగునీరు, టాయిలెట్స్, మెష్‌డోర్స్, కాంపౌండ్ వాల్స్ ఇతర మౌళిక వసతుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ గురుకులాల్లో సమస్యలు కలెక్టర్ తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గురుకులాల్లో కల్పిస్తున్న వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని వసతులు బాగుండే విధంగా చూడాలన్నారు. గురుకుల విద్యాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని, బియ్యం, పాలు, కూరగాయలు, ఇతర సరుకులు నాణ్యతగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు వేంకన్న జాతరకు వేళాయె..

- రేపటి నుంచి ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల బందోబస్తు

7



శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరిగే ఎర్రగట్టు గుట్ట

హనుమకొండను నువ్వేం నిర్మించలేదు..

- అతిగా ఊహించుకుని మాట్లాడకు..
- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై విమర్శలు చేసే స్థాయి లేదు
- ఎమ్మెల్యే నాయినిపై బీఆర్ఎస్ నేతలు పెద్ది, నన్నపునేని ధ్వజం



బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, తదితరులు

హనుమకొండ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నగరాన్ని తానే నిర్మించినట్లు పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్ ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులపై విమర్శలు చేసే స్థాయి ఆయనకు లేదని స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ వేదికగా 25 ఏళ్ల ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహిస్తున్న తరుణంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలుతున్నాడని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలను దొంగల ముఠాగా పేర్కొన్న రాజేందర్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేస్తున్న దోపిడీ గురించి ఏం మాట్లాడతాడని ప్రశ్నించారు. గతంలో ఇసుక టెండర్ల ద్వారా యేటా రూ.1,250 కోట్లు ఆదాయం వస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుల వాటాల వల్ల రూ.150 నుంచి 200 కోట్లు దాటడం లేదని విమర్శించారు. రైతులకు సాగు నీరు అందించక పంటలు ఎండుతున్నాయని, ముందు వాటిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సారి వచ్చేది బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వమేనని, ఇది రాసి పెట్టుకో.. అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ కేంద్రంగా 25 ఏళ్ల పార్టీ పండుగను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి నాయకులందరం కలిసికట్టుగా పనిచేసి సభను విజయవంతం చేస్తామన్నారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. ఎంతో పాలనానుభవం హరీష్‌రావుపై విమర్శలు చేసే స్థాయి 16 నెలల ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి లేదన్నారు. అంతా నాకే తెలుసని మాట్లాడుతున్నాడని, ఎక్కువగా ఊహించుకోవద్దని నాయినికి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి అధికారులు ఉన్నారని ఆయనే ఒప్పుకున్నారని అన్నారు. నగరంలో కనీస అవసరాలు గురించి అధికారులతో సమీక్షలు నిర్వహించలేని రాజేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ నేతలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవినీతి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన నయీంనగర్ బ్రిడ్జి, కాళోజీ కళాక్షేత్రం, ఆస్పత్రి భవనాలను తానే నిర్మించినట్లు రాజేందర్‌రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. త్యాగాలు చేసిన కేసీఆర్, హరీష్‌రావులను విమర్శిస్తే ఉద్యమకారులు, ప్రజలు సహించరని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫాతిమామాత మహారథ ప్రదక్షిణ

వివరాలు 7లో..



కాకతీయుల వారసుడు చంద్రభాంజ్‌దేవ్‌తో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

దంతెవాడలోని ఆలయాల్లో దాస్యం పూజలు

కాకతీయుల వారసుడు చంద్రభాంజ్‌దేవ్ కలిసి సందర్శన

హనుమకొండ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల వారసుడు మహారాజ కమల్ చంద్రభాంజ్‌దేవ్ ఆహ్వానం మేరకు ఛత్తీస్‌గడ్‌లోని దంతెవాడ కేంద్రంగా జరిగే ప్రసిద్ధ ఫాగున్ మడాయి ఉత్సవానికి హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ బుధవారం హాజరై అక్కడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాకతీయ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసి అక్కడి పాలకులు నిర్మాణం చేసిన పలు ఆలయాలను కమల్ చంద్రభాంజ్‌దేవ్‌తో కలిసి వినయ్‌భాస్కర్ సందర్శించారు. దంతెవాడలోని శక్తి పీఠమైన శ్రీదంతేశ్వరి అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకొని అక్కడి పురాతన ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించినట్లు వినయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టీలో దరఖాస్తులకు ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)హైదరాబాద్‌లో మొదటి సంవత్సరం 2025-2026కుగాను 60సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని పూర్తి వివరాలకు 9030079242 నెంబర్‌లో సంప్రదించాలని విజయలక్ష్మీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సైగా విధులు నిర్వహిస్తూనే ...

గ్రూపు -2లో 25 ర్యాంకు సాధించిన తిర్మలగిరి వాసి



శివ

పాలకుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఎస్సైగా విధులు నిర్వహిస్తూనే మరోవైపు గ్రూపు 2 పరీక్షకు సన్నద్ధమై రాష్ట్రస్థాయిలో 414 మార్కులు రాగా, 25 ర్యాంకు సాధించాడు మండలానికి చెందిన శివ. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని తిర్మలగిరి గ్రామానికి చెందిన కూటికంటి వెంకన్న, లక్ష్మీ దంపతుల మొదటి సంతానమే శివ.. డిగ్రీ తర్వాత ఉద్యోగ వేట ప్రారంభించాడు. 2019లో ఎస్సైగా తొలి ఉద్యోగం సాధించాడు. శిక్షణానంత రం మంచిర్యాలలో తొలి పోస్టింగ్ సాధించగా ప్రస్తుతం మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా శివ పని చేస్తున్నాడు. అంతకు ముందు 2017లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో (ఎఫ్‌సీఐ) జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం, 2018లో ఆర్పీఎఫ్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆ ఉద్యోగాలపై ఆసక్తి లేకపోవడంతో పోలీస్ కొలువులో చేరాడు. తదనంతరం ఉద్యోగ స్థాయిని పెంచుకోవాలని ఉద్దేశ్యంతో 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి సన్నద్ధమయ్యాడు. డ్యూటీ ముగిసిన తర్వాత రోజుకు 7 గంటలు శ్రమించాడు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాల జోలికి వెళ్లలేదు.పక్కా ప్రణాళికతో ముందుకు సాగి విజయం సాధించాడు.

తండ్రి వెంకన్న కుల వృత్తితో పాటు వ్యవసాయం, తల్లి లక్ష్మీ గృహిణి తల్లి దండ్రుల కష్టాలను చిన్నప్పటి నుంచి చూసి పెరిగానని మంచి ఉద్యోగం సంపాదించాలనే కసితో చదివానని, వారి ప్రోత్సహంతోనే నాలుగు ఉద్యోగాలు సాధించానని శివ తెలిపారు.

కల్యాణం.. కమనీయం

వైభవంగా బుగులు వేంకటేశ్వరుడి పరిణయం



భక్తులతో కలిసి స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే కడియం

- పట్టు వస్త్రాలు సమర్పించిన దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ శ్రీధర్‌రావు
- వేడుకలకు హాజరైన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కనీవినీ ఎరుగని రీతిలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వెల్లడి
- పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికిన సిబ్బంది



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పోలీసు అధికారులు

చిలుపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రెండవ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన చిలుపూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు వెంకటేశ్వర స్వామి- పద్మావతి అమ్మవార్ల కల్యాణాన్ని గుట్ట దిగువన నూతనంగా నిర్మించిన రాతి కల్యాణ మండపంలో సోమవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దేవస్థానం దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుతో పాటు, ఈవో లక్ష్మీప్రసన్న ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన ఉత్సవమూర్తులను గుట్ట దిగువన ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు పట్టు వస్త్రాలతో పాటు, ముత్యాల తలంబ్రాలను చైర్మన్ శ్రీధర్‌రావు -శిరణ్మయి దంపతులు సమర్పించారు. అనంతరం పూజారులు అరుణ్‌కుమారా చార్యులు, రవీందర్ శర్మ, రంగాచార్యుల వేద మంత్రాల మధ్య స్వామివారి కల్యాణ తంతును పూర్తి చేశారు. కళ్యాణ వేడుకలకు హాజరైన భక్తులకు అర్చన అభిషేకంతో పాటు, శేషవస్త్రాలను అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. కడియం మాట్లాడుతూ, రాష్ట్రంలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. భక్తుల రద్దీకనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తానన్నారు. కాగా, స్వామివారి అలంకరణకు స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ రూ 40 వేలను వెచ్చించి ప్రత్యేక పుష్పాలను తెప్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. మల్కాపూర్ పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కుశాలి నేతృత్వంలోని వైద్యబృందం హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో ఈవో భాగం లక్ష్మీప్రసన్న, నాయకులు గజ్జెల దామోదర్, సురేశ్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, మామిడాల లింగారెడ్డి, ఏడవెళ్లి మల్లారెడ్డి, కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, శిరీష్‌రెడ్డి, తాళ్లపల్లి సంపత్, గాజుల రజిని, ధర్మకర్తలు గోలి రాజశేఖర్, రత్నాకర్‌రెడ్డి, చల్లా వెంకట రమణాదేవి -రాజ మహేందర్‌రెడ్డి, డీపీవో స్వరూపరాణి, తహసీల్దార్ సరస్వతి, ఎంపీవో మధుసూధన్, జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీంశర్మ, సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో వినియోగదారులకు లాభదాయకం

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- రెండు రోజుల కామర్స్ జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ వినియోగంతో వినియోగదారుడికి లాభదాయకమని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ కామర్స్ విభాగం సెమినార్ హాల్‌లో 'న్యూ హారిజోన్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21 సెంచరీ - చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్' అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ మేధస్సుతో అద్భుతాలు చేయవచ్చన్నారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులు వినియోగదారుడికి లాభకారిగా ఉండాలని సూచించారు. అయితే మోసగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని పేర్కొన్నారు. వినియోగదారుడి దృష్టిలో వస్తువు నాణ్యత, లభ్యతతో పాటు ధర కీలకమైందన్నారు. వినియోగదారులకు, వ్యాపారులకు, ఉద్యోగులకు టెక్నాలజీపై అవగాహన ఉండాలని అన్నారు. 21వ శతాబ్దంలో ఈ - కామర్స్ ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పారు.

ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ గణ్‌శ్యామ్ సోలాంకి మాట్లాడుతూ.. వినియోగదారులు టెక్నాలజీ పరంగా జాగ్రత్తతో మెలగాలని చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. వినియోగదారులకు అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో మార్పులు వస్తున్నాయని వివరించారు. గుంటూరు నాగార్జున వర్సిటీ కామర్స్ డీన్ కె.శివరామ్‌ప్రసాద్ కీలక ఉపన్యాసం చేశారు. కృత్రిమ మేధస్సుతో వ్యాపార రంగంలో విపరీత ధోరణులు, దుష్పరి మాణాలు కన్పిస్తున్నాయని తెలిపారు. దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన పెరుగాలన్నారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి. అప్పారావు, ఓయూ రిజిస్ట్రార్ జి.నరేశ్‌రెడ్డి, వరంగల్ జెన్‌ప్యాక్టు అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ విఘ్నేశ్ రమేశ్‌లు మాట్లాడారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజయ్ భయ్యని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సభ అధ్యక్షుత వ్యవహరించిన అమరవేణి.. రెండు రోజుల సదస్సు 4సెషన్లుగా జరుగుతోందని చెప్పారు. 70 రీసెర్చ్ పేపర్లు వచ్చాయన్నారు. ఈ సదస్సులో కట్ల రాజేందర్, పి.వరలక్ష్మి, ఎస్.నరసింహచారిలు పాల్గొన్నారు. సదస్సుకు ఫణీంద్ర స్వాగతం పలుకగా ప్రగతి వందన సమర్పణ చేశారు.

విద్యాసంస్థలు పరిశ్రమలు కలిసి పనిచేయాలి

- సైయింట్ వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన్ రెడ్డి పిలుపు
- వరంగల్ నిట్‌లో ఘనంగా ఇన్నోవేషన్ కాంక్లేవ్



జ్యోతి ప్రజ్వలన చేసి కాంక్లేవ్‌ను ప్రారంభిస్తున్న సైయింట్ వ్యవస్థాపకుడు మోహన్ రెడ్డి

హనుమకొండ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు పరిశ్రమలతో సన్నిహితంగా పని చేయాల్సిన అవసరం ఉందని సైయింట్ వ్యవస్థాకుడు పద్మశ్రీ గ్రహీత డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. వరంగల్ నిట్‌లో బుధవారం ఇండస్ట్రీ - అకాడెమియా ఇన్నో వేషన్ కాంక్లేవ్ ఘనంగా జరిగింది. ముఖ్య అతి థిగా హాజరైన మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కాంక్లేవ్‌ను ప్రారంభించారు. అనంతరం వరంగల్ నిట్‌తోపాటు వివిధ ఆవిష్కరణల ప్రదర్శనను కూడా రిబ్బన్ కట్ చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవడంలో పరిశ్రమల సహకా రం తీసుకోవాలన్నారు. కొత్త స్టార్టప్‌ల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్నవాటి అభివృద్ధి దేశ పురోగతికి అత్యవసరమన్నారు. ప్రస్తుతం అత్యంత ప్రాముఖ్యత కలిగిన కంప్యూటర్లు, కమ్యూనికేషన్, సెన్సార్లు, డేటా, కృత్రిమ మేధస్సు అంశాలపై మోహన్‌రెడ్డి ప్రసంగించారు. ఈ నాలుగింటిపై విద్యార్థులు ప్రధానంగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వరంగల్ నిట్ పరిశోధన, అభివృద్ధి (ఆర్ డీ) డీన్ ప్రొఫెసర్ శిరీష్ సోనావానే నిట్‌లో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. పరిశ్రమల సహకారంతో నిర్వహిస్తున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను వివరించారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. సమాజ సమస్యల పరిష్కారానికి తమ ఇన్‌స్టిట్యూట్ కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమల యజమానులు, విద్యార్థులు కలిసి పని చేయాలన్నారు. ఇండస్ట్రీ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్‌లో 47 సంస్థలకు చెందిన 80మంది పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. వివిధ అవిష్కరణలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. వరంగల్ నిట్‌లో జరుగుతున్న పరిశోధనలకు ఇది అద్దం పట్టింది. వివిధ విభాగాలు, ప్రతిభా కేంద్రాలు, స్టార్టప్‌లు, పరిశ్రమలు తమ పరిశోధనల అవిష్కరణలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. దీనితో వీటి మధ్య సహకార అవకాశాలు మెరుగుపడ్డాయి.

మటన్ వండలేదని.. భార్యను కొట్టి చంపిన భర్త

- మహబూబాబాద్ జిల్లా మాంజాతండాలో ఘటన
- పరారీలో నిందితుడు.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ



కళావతి (ఫైల్)



మాంజా తండాలో మాలోతు కళావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై నగేష్

సీరోలు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మటన్ కూర వండలేదని భార్యను కొట్టి చంపాడు ఓ వ్యక్తి ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం బూరుగుచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని మాంజాతండాలో మంగళవారం రాత్రి జరిగింది. మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాంజాతండాకు చెందిన మాలోతు బాలుకు అదే తండాకు చెందిన కళావతితో 17 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉండగా.. కుమారుడు వరంగల్ జిల్లాలోని అశోక్‌నగర్‌లో ఉన్న సైనిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కూతురు శ్రావణి సీరోల్ మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. ఇక బాలు, కళావతి(38) దంపతులు ఇంటి వద్ద ఉంటూ.. తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో తండాలో మంగళవారం ఓ వృద్ధురాలు మృతి చెందగా, ఆమె అంత్యక్రియలు రాత్రి 7 గంటల సమయంలో పూర్తి చేశారు. అనంతరం రాత్రి వేళ ఓ గొర్రెపోతును కోసి, తలా కొంచెం మాంసాన్ని వారివారి ఇళ్లకు తీసుకుపోయారు. రాత్రి 11గంటల సమయంలో ఆ మటన్‌ను ఇంటికి తీసుకువచ్చిన బాలు.. వండాలని భార్య కళావతిని కోరాడు.

అంత రాత్రి సమయంలో మటన్ వండే విషయంలో కళావతి అభ్యంతరం చెప్పగా.. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బాలు ఆమెతో గొడవపడ్డాడు. అది కాస్తా ఇద్దరి మధ్య ఘర్షణగా మారగా విషయం తెలుసుకున్న అదే తండాలోని కళావతి తల్లిదండ్రులు ఇస్లావత్ లక్ష్మీ-వెంకన్నకు వారి ఇంటికి వచ్చి సర్దిచెప్పి, గొడవను సద్దుమణిగేలా చేశారు. వారు వెళ్లిపోయాక బాలు భార్యతో మళ్లీ గొడవపడి, తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళావతి తల్లిదండ్రులు మరోమారు కూతురు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో కళావతి తల్లిదండ్రులు సీరోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఐ రాజ్‌కుమార్ గౌడ్, సీరోలు ఎస్సై నగేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. నిందితుడు బాలు పరారీలో ఉన్నాడు.

వితంతువుపై అత్యాచార యత్నం

- బాధితురాలి ఆత్మహత్యాయత్నం
- నిందితుడిపై కేసు నమోదు

చెన్నారావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వితంతువుపై ఓ వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడగా.. ఆ అవమానాన్ని భరించలేక బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో బుధవారం జరిగింది. బాధితురాలు, బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త యేడాది కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పాస్టర్‌గా, ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న వ్యక్తి ఆమెపై కన్నేశాడు. వారం రోజులుగా ఆమెకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఆ మహిళ ఇంట్లోకి వెళ్లి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు.

దాంతో ఆమె అతడిని ఇంటి నుంచి బయటకు నెట్టేయగా.. అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి అవమానభారంతో మహిళ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన చుట్టుపక్కల వారు, బంధువులు వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతోంది. ఈ విషయమై ఎస్సై రాజేష్‌రెడ్డిని సంప్రదించగా.. మహిళపై అత్యాచార యత్నం చేసింది వాస్తవమేనని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

20 ఫీచర్లతో అందుబాటులోకి ఎన్పీడీసీఎల్ యాప్

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు 20 ఫీచర్లతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ అందుబాటులో ఉందని వరంగల్ ఎస్ఈ గౌతంరెడ్డి అన్నారు. వినియోగదారులు విద్యుత్ సమాచారంతో పాటు సమస్యలను యాప్ ద్వారా పరిష్కరించే సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా వినియోగదారులు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసేందుకు 18004250028, 1912 టోల్ ఫ్రీ నంబర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కెనాల్ వద్ద లభించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హసన్‌పర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి గుండ్లసింగారం కెనాల్‌లో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానికులు కేయూ పోలీసులకు సమాచారంఅందించారు. కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ సిబ్బందితో గుండ్లసింగారం కెనాల్‌లో కొట్టుకుపోతున్న గుర్తు తెలియని మృతదేహాన్ని కార్పొరేషన్ సిబ్బంది సహాయంతో బయటికి తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి నలుపు రంగు టీ షర్టు, బ్రౌన్ కలర్ చెప్పులు ధరించి ఉన్నాడు. ఆచూకీ కోసం కేయూ ఇన్‌స్పెక్టర్ సెల్ 87126 85115, ఎస్సై సెల్ 87126 85088, కేయూ పోలీసు స్టేషన్ నెం.87126 85004 నెంబరును సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కోమటిపల్లి భద్రకాళి నగర్‌లో చోరీ

రూ.10 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరణ

హసన్‌పర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం కోమటిపల్లి భద్రకాళి నగర్‌కు చెందిన పాటి స్రవంతి ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. బాధితురాలు, కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం... హసన్‌పర్తి మండలం కోమటిపల్లి భద్రకాళి నగర్ కాలనీకి చెందిన పాటి స్రవంతి ఐనవోలు మండలంలో కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. భర్త ధర్మయ్య ఖమ్మం జిల్లాలో ఓ వివాహ వేడుకలకు వెళ్లాడు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తి ఇంటి వెనక నుంచి తలుపులు తెరిచి బీరువాలో ఉన్న బంగారు నెక్లెస్, చంద్రహారం, రెండు బంగారు గాజులు, నల్లపూసల గొలుసు, చెవి కమ్మలు, బుట్టాలు, ఉంగరాలు మొత్తం రూ.10 లక్షలు విలువ చేసే 207 గ్రాముల బంగారు నగలు దోచు కెళ్లినట్లు బాధితురాలు స్రవంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2243	2100
పల్లికాయ (సూక)	7300	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6656	5540
పెసళ్లు	7250	4645
పత్తి	6960	5800
పసుపు (కాడి)	7153	6522
పసుపు (గోల)	6219	6133
తేజ మిర్చి	13400	9000
డిడి	12500	12500
వండర్‌హాట్	16500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	13100	9500
దేశీ	32000	25500
సింగిల్ పట్టి	37500	35000
దీపిక	16500	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

- రోజురోజుకు పెరుగుతున్న కిడ్నీ సంబంధ సమస్యలు
- అవగాహన లోపమే అసలు సమస్య

నేడు వరల్డ్ కిడ్నీ డే

మూత్రపిండం.. మేలుకోకపోతే గండం!





వరంగల్ మెడికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలో మూత్రపిండాలదే కీలకపాత్ర అన్న విషయం అందరికీ తెలసిందే. కిడ్నీలకు రోజుకు 200 లీటర్ల నీటిని శుద్ధి చేసే శక్తి ఉంటుందట. అత్యాధునిక వాటర్ ఫిల్టర్ కూడా వీటి ముందు దిగదుడుపేనట. అలాంటి కీలకమైన మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా రోజురోజుకు మూత్రపిండ సంబంధ సమస్యల బారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తపోటు, మధుమేహం లాంటి సాధారణ వ్యాధుల జాబితాలోకి కిడ్నీ వ్యాధులు కూడా చేరే ప్రమాదం ఉంది. ఒకప్పుడు వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మాత్రమే కిడ్నీ సమస్యలు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఏ కారణం లేకుండానే.. ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే వయసుతో సంబంధం లేకుండా మూత్రపిండ సమస్యలు ఏర్పడుతున్నారు. వ్యాధి గురించి కళ్లు తెరిచేలోపే వ్యాధి ముదిరి డయాలసిస్, ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీస్తోంది. ఈ క్రమంలో మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో మేలుకోకపోతే ప్రాణాలకే గండమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కిడ్నీ సంబంధ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతీ ఏడాది మార్చి రెండో గురువారాన్ని వరల్డ్ కిడ్నీ డేగా పాటిస్తున్నారు.

కిడ్నీ వ్యాధులకు ఇవే కారణాలు

పిడికిలి పరిమాణంలో ఉండే మూత్రపిండాలు శరీర అవయవాలు ఆరోగ్యంగా ఉండేలా రక్తం నుంచి విషాన్ని, అదనపు నీటిని తొలగించడానికి, రక్తపోటును నియంత్రించడానికి, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు, ఎముకలను ఆరోగ్యంగా ఉంచేందుకు ఉపయోగపడతాయి. అదే విధంగా సోడియం, పొటాషియం లాంటి అనేక ఖనిజాలు, అణువుల రక్తప్రవాహ స్థాయిలను నియంత్రిస్తాయి. రక్తఆమ్లతను నియంత్రించడంలో సహాయ పడతాయి. శరీరం మొత్తంలో రసాయన సమతుల్యతను నియంత్రించడంలో కిడ్నీలు క్రియాశీలకంగా పని చేస్తాయి. ఇక కిడ్నీ సమస్యలకు మధుమేహం, అధిక రక్తపోటు, ఇన్ఫెక్షన్లతోపాటు వివిధ ఔషధాల ప్రభావం, శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు వాంతులు, విరోచనాలు లాంటివి ఇబ్బంది పెట్టినప్పుడు గుండె, కాలేయం, పనితీరు మందగించినప్పుడు, కిడ్నీలకు రక్త సరఫరా తగ్గినప్పుడు కూడా కిడ్నీ వ్యాధులు సంభవిస్తాయి. కిడ్నీలో రాళ్లు పడటం, బ్లాడర్‌లో రాళ్లు అడ్డుపడి మూత్ర ప్రసరణ తగ్గిపోవడం, మూత్రం వెనక్కి వెళ్లిపోయి ఒత్తిడి పెరగడం వల్ల ప్రోస్టేట్ సమస్యలు కూడా ఏర్పడి కిడ్నీలపై భారం పడుతుంది. మూత్రం తక్కువగా వస్తు కాళ్లలో, కాళ్ల చుట్టూ వాపు వస్తుంది. ఊపిరి తిత్తుల్లో నీరు చేరడం వల్ల ఆయాసం, దగ్గు ఇబ్బంది పెడతాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో ఫిట్స్ కూడా రావచ్చు. కొన్ని సందర్భాల్లో కోమాకు కూడా వెళుతూ ఉంటారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్న తర్వాత చివరి దశలో కొందరికి బయటపడుతుంది. ఇలాంటి వారిలో త్వరితగతిన వ్యాధిని గుర్తించడం కష్టసాధ్యం అవుతుంది.

ముందస్తు జాగ్రత్తలు

కిడ్నీ సంబంధిత వ్యాధి క్షణాలు సులభంగా బయటపడవు. కాబట్టి సంవత్సరానికి ఒక్కసారైనా కంప్లీట్ యూరిన్ ఎగ్జామిషన్, సీరం క్రియాటిన్, కిడ్నీ పనితీరును తెలియజేసే గ్లోమేరు లార్ ఫిల్టరేషన్ రేట్ పరీక్షలు విధిగా చేయించుకోవాలి. వీటికి తోడు బీపీ, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలి. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. పెయిన్ కిల్లర్స్ సప్లిమెంట్ వాటిని సాధ్యమైనంత మేర తగ్గించాలి. శరీర బరువును బట్టి నీరు తాగాలి. రోజుకు కనీసం 3లీటర్ల నీరు తాగాల్సి ఉంటుంది. నీరు మరీ ఎక్కువ తాగినా మూత్రపిండాలపై భారం పడి పనితీరు దెబ్బతింటుంది.

అప్పుడే డయాలసిస్

కిడ్నీ పనితీరు 10శాతం కంటే తక్కువగా పడిపోయినప్పుడు రోగికి డయాలసిస్ తప్పదు. అంతే కాకుండా హఠాత్తుగా మూత్రం నిలిచిపోయినప్పుడు, ఊపిరి తిత్తుల్లో నీరు చేరి ఆయాసం అనిపిస్తుంది. శరీంలో యాసిడ్స్, పొటాషియం స్థాయిలు పెరిగినప్పుడు కిడ్నీ పనితీరుతో సంబంధం లేకుండా రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి డయాలసిస్ మొదలైతే జీవితాంతం చేయించుకోఆల్సిన అవసరం ఉండదు. తాత్కాలిక రుగ్మతలు అయితే సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మాత్రమే డయాలసిస్ చేస్తే సరిపోతుంది. కిడ్నీ పనితీరు మెరుగయ్యాక డయాలసిస్ నిలిపివేస్తారు. అయితే దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల్లో జీవితాంతం చేయాల్సి ఉంటుంది.

సూపర్ స్పెషాలిటీలో కిడ్నీ వైద్య సేవలు

ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా కాకతీయ మెడికల్ కళాశాలలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధం వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, ముగ్గురు వైద్యులు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, యురాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, నలుగురు వైద్యులు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

డయాలసిస్ సెంటర్‌లో సౌకర్యాలు నిల్

కాకతీయ వైద్య కలాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో 2022 జూలై 7న ఇక్కడ నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించారు. వారానికి రెండుసార్లు ఓపీ సేవలు నిర్వర్తిస్తుండగా నెలలో 500 వరకు ఓపీ ఉంటుంది. వారిలో 200 మంది రోగులు ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు.

కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దు. సమస్య ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. ప్యాకెట్ ఫుడ్, జంక్‌ఫుడ్, సోడా, కొలెస్ట్రాల్ లాంటి వాటిని పూర్తిగా తగ్గించాలి. వేసవికాలంలో మూత్ర పిండాల్లో రాళ్లు, అక్యూట్ కిడ్నీ ఇంజరీ నివారించేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో డిహైడ్రేషన్ వల్ల మూత్రపిండ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. రోజుకు కనీసం 2.5లీటర్ల నుంచి మూడు లీటర్ల నీటిని తాగాలి. ఉష్ణోగ్రత పెరిగిన కొద్ది నీటిని కూడా మరింత తీసుకోవడం మంచిది. మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడకుండా సహకరిస్తాయి. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవలి. షుగర్ లెవెల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతిరోజు 30 నుంచి 45 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడం వల్ల మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని క్రమంగా పరీక్ష చేయించుకోవాలి.

- డాక్టర్ బచ్చు చందుకృష్ణ, ఎంఎస్, ఎంసీహెచ్, యురాలజిస్టు

అధికంగా పెయిన్ కిల్లర్స్ వాడొద్దు



ఈ మధ్యకాలంలో బీపీ, షుగర్, ఊబకాయం ఉన్న వారితో పాటు పెయిన్ కిల్లర్స్ వాడే వారిలో మూత్రపిండ వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయి. చెరుకు రసం, బార్లీ నీళ్ల, పుచ్చకాయ వంటి సహజ మూత్ర విసర్జ ఉత్ప్రేరకాల రకాలు తీసుకోవాలి. ఈ పానీయాలు మూత్రాన్ని అధికంగా ఉత్పత్తి చేయించి చిన్న చిన్న రాళ్లను విసర్జించడంలో సహాయ పడతాయి. కనీసం ఆరు నెలలకోసారి అయినా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ పూస కుమారస్వామి, నెఫ్రాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ , ఎంజీఎం



ర్యాలీని ప్రారంభించిన బిషప్..



చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్‌లు

వైభవంగా ఫాతిమామాత మహారథ ప్రదక్షిణ

భారీగా హాజరైన క్రైస్తవులు.. కొనసాగుతున్న ఉత్సవాలు

కాజీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమామాత ఉత్సవాలు బుధవారం రెండో రోజు వైభవంగా సాగాయి. బుధవారం సాయంత్రం కేథడ్రల్ చర్చిలో ఫాతిమామాత స్వరూపంతో మహా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని బిషప్ ఉడుమల బాల ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఫాతిమానగర్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీకి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ ర్యాలీ సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్ రోడ్, ఫాతిమా ఆస్పత్రి మీదుగా దర్గా వరకు సాగి తిరిగి ఫాతిమా కెథడ్రల్ చర్చి వరకు సాగింది. అనంతరం నూతనంగా నిర్మించిన ఫాతిమా ప్రధాన రహదారి తోరణం వద్ద ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థన జరిగింది. అనంతరం కెథడ్రల్ చర్చిలో జపమాల ఉద్యానవనం ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫాదర్‌లు స్వస్థత ప్రార్థనలు చేశారు. మేరీ మాత గుహవద్ద క్రైస్తవులు పెద్దఎత్తున మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు చర్చి ఆవరణలో మొక్కులు చెల్లించి నిద్ర చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఫాదర్ టి.జోసఫ్, ఫాదర్ డి.జోసఫ్, కర్నూల్ పీఠం బోధకులు ఏరువ జోజిరెడ్డి భక్తులకు స్వస్థత ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో ఫాతిమానగర్ జాతర వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చర్చి కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్ బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను తలెత్తకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి బృందం భారీ బందోబస్తు నిర్వహించారు. రాత్రి పునీత ఆంథోని కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఎర్రగట్టు వేంకన్న జాతరకు వేళాయే..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల బందోబస్తు


హసన్‌పర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి (ఎర్రగట్టు జాతర) బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి సమీపంలోని అంబాల క్రాస్‌రోడ్డు వద్ద గుట్టపై వెలిసిన ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి జాతర ఏటా మార్చిలో హోలీ ఫాల్గుణ పౌర్ణమి రోజు ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగుతాయి. జాతరకు కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

హోలీ పర్వదినం నుంచి జాతర

యేటా హోలీ పర్వదినం రోజు నుంచే ఎర్రగట్టు జాతర కొనసాగుతూ వస్తోంది. సాయంత్రం హసన్‌పర్తి, భీమారం గ్రామాల ఆలయాల నుంచి శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుల ఉత్సవ మూర్తుల విగ్రహ ప్రతిమలతో ఊరేగింపుగా ఎర్రగట్టుగుట్టకు చేరుకుంటాయి. జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్వక్‌సేనా సేవా సమితి కల్యాణ మండపంలో వేదపండితులు వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని నిర్వహించడంతో జాతర ప్రారంభమవుతుంది. 14వ తేదీ శుక్రవారం కల్యాణోత్సవం మొదటి రోజు రాత్రి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద రథచక్రాల బండ్లలో జాతర ప్రాంగణానికి చేరుకొని ధ్వజస్తంభం చుట్టూ ప్రదిక్షణలు చేసి స్వామివారి కల్యాణాన్ని చూసి తరించి మొక్కులు చెల్లించుకుంటారు. 15వ తేదీన రెండో రోజు శనివారం మేకలు, గొర్రెలు, పోతులు, ఏనుగులతో చిన్న రథచక్రాల బండ్లతో గుట్టకుచేరుకొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కుంటారు. 16వ తేదీ ఆదివారం స్వామివారి విశేషపూజ, కుంకుమార్చన, హారతి, ప్రసాద వినియోగం, 17వ తేదీ సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అర్చనలు, 18వ తేదీ మంగళవారం ఉత్సవమూర్తు ల ప్రతిమలు ఇరు గ్రామాలకు తిరుగుపయణం కావడంతో జాతర ముగుస్తుంది.



గుట్టపైకి వెళ్లే మెట్లకి ఇరువైపుల ఏర్పాటు చేసిన పైప్‌లైన్



ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి

పోలీసు బందోబస్తు

ఐదు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవ వేడుకల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటితో పాటు రాత్రి వేళలోగుట్టపైకి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. గుట్టపైకి మెట్లు ఎక్కే క్రమంలో భక్తులకు ఏవిధమైన ఆటంకాలు జరుగకుండా ప్రత్యేకంగా పోలీసు బం దోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో దొంగతనాల నివారణ తో పాటు పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీసు నిఘాను పెంచారు. మఫ్టీలో పోలీసు గస్తీని ఏర్పాటు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జాతర ప్రాంగణంలో ప్రత్యంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకట్రావ్ తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేకంగా ఆర్‌టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి నుంచి జాతర ప్రాంగణం వరకు ఆర్‌టీసీ వారు ప్రత్యేకంగా బస్సులను నడిపుస్తున్నారని తెలిపారు. దేవాలయం ప్రాంగణంలో టీటీడీ కల్యాణ మండపంతో పాటు నవగ్రహాలు, శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయం, గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేశఖండన కోసం ప్రత్యేక స్థలం, జాతర మొదటి రోజు నిర్వహించే కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల కోస ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావ్



మండిబజార్‌లో మసీద్ వద్ద సందడి

రంజాన్ రుచుల వేదిక మండిబజార్

- నోరూరిస్తున్న స్పెషల్ స్వీట్లు
- ఆస్వాదిస్తున్న నగర వాసులు
- పోషక విలువలతో కూడిన పదార్థాలకు డిమాండ్

మట్టెవాడ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలను అత్యంత నిష్ఠతో పాటిస్తున్నారు. అయితే ఈ ఆధ్యాత్మిక సౌరభాల రంజాన్ మాసంలో నెల రోజుల పాటు వారు దాన ధర్మాలు చేయడంతో పాటు.. విభిన్న రకాల వంటకాలు, రకారకాల స్వీట్లు, ఫలాలతో పండుగ జరుపుకొంటారు. ఈ క్రమంలో నగరంలోని మండిబజార్‌లో ఆధ్యాత్మిక సందడి కనిపిస్తుంది. రంజాన్ మాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు రోజంతా కొనుగోళ్ల జోష్ కనిపిస్తుంది. అర్ధరాత్రి వరకు వ్యాపార సమూదాయాలు తెరిచే ఉంటాయి. పోచమ్మమైదాన్, బండిబజార్ వరకు సుమారు కిలోమీటర్ మేరకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతాయి. అలంకరణ వస్తువులు, రోల్‌గోల్డ్ దుకాణాలు, కర్జూర పండ్లు వివిధ రకాల స్వీట్ల దుకాణాలు ఏర్పాటు చేశారు.

నోరూరించే రుచులు..

స్వీట్స్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. అందులోనూ ఏడాదిలో ఒక నెల మాత్రమే అందుబాటులో ఉండే స్పెషల్ స్వీట్లు అంటే ఇంకేలా ఉంటుంది. ప్రస్తుతం రంజాన్ స్పెషల్ స్వీట్ల మధురానుభూతిని అందిస్తున్నాయి. వరంగల్ పోచమ్మమైదాన్. మండిబజార్‌లో రుచి, పోషక విలువలు, శరీర ఆరోగ్యానికి సంభందించిన పలు పదర్థాఆలు మిళితమై ఉండటంతో చిన్న, పెద్ద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా ప్రజలంతీ తీసుకుంటున్నారు. దీంతో రంజాన్ స్పెషల్ స్వీట్లకు మంచి డిమాండ్ పెరిగింది. ఎన్నో రకాల వెరైటీ స్వీట్లు అందుబాటులో ఉండటంతో ఇళ్ళకు పార్శిల్ తీసుకెళ్ళి మరి రుచులు ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా డబుల్‌కా మీఠా, కద్దుకీ ఖీర్, మ్యాంగో ఖీర్, కుర్బానీ కా మీఠా, హల్వా, ఫెర్నీ, రబ్బి తదితర స్వీట్లకు డిమాండ్ ఉంది. నగరంలో అనేక చోట్ల అమ్మకాలు జరుగుతున్నా.. కేవలం మండిబజార్ ప్రాంతంలోనే సుమారు 20వరకు షాపులు ఉండటం విశేషం. ఇక్కడి వర్తకులు పోటీపడి మరీ ప్రజలకు ప్రత్యేక వంటకాలను పరిచయం చేస్తున్నారు.



పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

డబుల్ కా మీఠా....

రంజాన్ స్పెషల్ స్వీట్లలో డబుల్ కా మీఠాను ప్రతీ ఒక్కరు ఇష్టపడుతారు. బ్రెడ్, డాల్డా, నూనె , పాలు, నెయ్యి, చెక్కర, కస్టడ్ పౌడర్, కోవా, బాదాం, కిస్ విస్‌లతో డబుల్ కా మీఠాను తయారు చేస్తారు. ఇది ఎంతో తియ్యగా ఉండటంతో ప్రతి ఒక్కరు దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఇది మార్కెట్లో ఒక ప్లేటు రూ.30 ఉంది.

ఖద్దుకీ ఖీర్..

రంజాన్ పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఖద్దుకీ ఖీర్. దీనిని రంజాన్‌లో ప్రత్యేక వంటకంగా భావిస్తారు. దీనిని ఇష్టపడని వారు ఉండ రు. పాలు, సొరకాయ, కోవా, సాపుదాని బియ్యం, చెక్కర, పిస్తా, బాదం, ఇలాచీ, నెయ్యి, మిల్క్‌మ్యాట్ వినియోగించి దీనిని తయారు చేస్తారు. ఇది తాగితే శరీరంలోని వేడి పోతుందని, ఆరోగ్యకరమైన పానీయమని అమ్మకందారులు చెబుతున్నారు.

మ్యాంగో ఖీర్..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో బాగంగా తయారు చేసే మ్యాంగో ఖీర్ కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. మామిడి పండ్ల గుజ్జును తీసి పాలు, మిల్క్‌మ్యాట్, కోవ ఉపయోగించి దీనిని తయారు చేస్తారు.

హల్వా..

గుమ్మడికాయ, నెయ్యి, కాజు, పాలు, బాదం, చెక్కరతో హల్వాను తయారు చేస్తారు. దీనిని చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరు ఇష్టపడుతున్నారు.



రంజాన్ ప్రత్యేక రుచుల విక్రయాలు

కుర్బానీ కా మీఠా..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో కుర్బానీ కా మీఠా మరీ స్పెషల్‌గా చెప్పుకోవచ్చు. కుర్బానీ కా మీఠాను అఫ్ఘనిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే డ్రైఫ్రూట్లతో తయారు చేస్తారు. డ్రైఫ్రూట్స్‌ను నీటిలో నానాబెట్టి తరువాత గింజలు తీసివేసి పంచదార పాకంలో రోజ్‌బెర్రి, సిరప్‌లు వినియోగించి తయారు చేస్తారు. దీనికి మార్కెట్లో మంచి గిరాకి ఉంది. ఇది అరుదుగా లభించే స్వీటు.

ఫిర్నీ..

ఇది చాలా అరుదుగా లభించే వంటకం. బాస్మతి రైస్‌ను రవ్వగా చేసి ఉడకబెడుతారు. తరువాత చెక్కర, కోవ, మిల్క్‌మ్యాట్‌తో దీనిని మహా రుచిగా తయారు చేస్తారు.

రబ్బి..

పాలు, కస్టర్డ్ పౌడర్, చెక్కర, మిల్క్‌మ్యాట్ ఉపయోగించి రబ్బి స్వీట్‌ను తయారు చేస్తారు. ఇది కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. దీనికి మంచి డిమాండ్ ఉంది.

కేయూలో ఎంఎస్ఎఫ్ రెండో రోజు రిలే దీక్షలు

కేయూ క్యాంపస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పూర్తైన తర్వాతే ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్ఎఫ్ నేతృత్వంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కేయూలో బుధవారం రెండో రోజుకు చేరాయి. ఎస్డీఎల్‌సీఈ ఎదుట చేపట్టిన దీక్షలను కేయూ తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, బీవీఎస్ చైర్మన్ డాక్టర్ మంథని శంకర్‌లు విద్యార్థులకు పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదిగ జాతి నోటికాడి ముద్దను దూరం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రయత్నిస్తోందన్నారు. గ్రూప్స్‌తో పాటు ఇతర ఉద్యోగ భర్తీలను ఆపేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలయ్యే వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. దీక్షలను బుధవారం సాయంత్రం కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ విరమింపచేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, రాష్ట్ర నేతలు బొచ్చు తిరుపతి, మంద భాస్కర్, మాదాసి రమేశ్, మారపల్లి రాణాప్రతాప్, బోసికే నాగరాజు, రొడ్డ రాంబాబు, జన్నే భరత్, చరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం



రాంపూర్‌లో ఏర్పడిన డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హాక్ కమిటీ

మడికొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్ గ్రామాల మధ్య గల చెత్త డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని రాంపూర్ గ్రామస్తులు తీర్మానించుకున్నారు. ఈ మేరకు బుధవారం గ్రామస్తులు సమావేశమై డంపింగ్ యార్డు నిర్మూలన అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసుకొని పోరాటానికి తగిన కార్యాచరణ రూపొందించుకున్నామని తెలిపారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కళ్ల అద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ మానస రాంప్రసాద్

జూలైవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ బుధవారం రెవెన్యూ కాలనీలో ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ క్రాంతికుమారి, పార్మసిస్టు దీప్తి, ఏఎన్ఎం ఊర్మిళ, రాకేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి రూబీ జెస్ట్-2025 టెక్నికల్ ఫెస్ట్



రూబీజెస్ట్-2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నేతృత్వంలో మార్చి 19 నుంచి 22 వరకు రూబీ జెస్ట్-2025 టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలో రూబీ జెస్ట్-2025 టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్‌ను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఆవిష్కరించారు. రూబీ జెస్ట్-2025 టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా మార్చి 19న ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తారు. మార్చి 20-22 తేదీల్లో టెక్నికల్ ఈవెంట్లు, సెషన్లు నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ కె.బిక్షాలు, వేణుగోపాల్‌రెడ్డి, ఇతర అధ్యాపకులు, టెక్నికల్ ఈవెంట్ల బాధ్యులైన విద్యార్థులు, కళాశాల బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు న్యాయపరంగా ముందుండాలి



మాట్లాడుతున్న సెక్రటరీ క్షమాదేశ్ పాండే, ప్రిన్సిపాల్ సుదర్శన్

కేయూ క్యాంపస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు న్యాయపరంగా ముందుండాలని హనుమకొండ జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే పిలుపునిచ్చారు. బుధవారం సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ అధ్యక్షతన న్యాయ కళాశాల సెమినార్ హాల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. అయితే న్యాయ రంగంలో మహిళలు మరింత సమర్థవంతంగా ముందుకు రావాలని ఉద్బోధించారు. జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందని చెప్పారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. మహిళల ఎదుగుదలకు చట్టాలు దోహదం చేస్తాయని చెప్పారు. చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచేందుకు విస్తృత సదస్సులు, సమావేశాలు కళాశాలలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, శ్రీనివాస్, అడ్వకేట్లు, స్కాలర్లు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేయించాలి

వడ్డెపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్ ఊర చెరువు అభివృద్ధికి, సుందరీకరణకు నిధులు మంజూరు చేయించాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నాగరాజును హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద బుధవారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తుపాకుల దశరథం మాట్లాడుతూ.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గోపాల్‌పూర్ చెరువు అభివృద్ధి అంశాన్ని చర్చించి నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నాగరాజును కలిసి వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతలఫణి వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మీసాల రమేష్, ప్రోగ్రాం కన్వీనర్ పింగిళి అశోక్‌రెడ్డి, ప్రతినిధులు జనుప సారంగపాణి, గూడెం రమేష్ ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న భూములను రైతులకు ఇవ్వాలి

- అటవీశాఖ అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం
- ఇనుపరాతి గుట్ట భూములపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు పట్టాపాసు పుస్తకాలు ఉండి డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో లేని వారి భూములను అటవీ శాఖ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఆ పట్టా భూములను గుర్తించి రైతులకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూరు గ్రామాల్లో విస్తరించి ఉన్న ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్టు అధికారులు గుర్తించిన వ్యవసాయ పట్టా భూములపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల సర్వే, సంబంధిత రైతుల గుర్తింపు, తదితర వివరాలను సంబంధితశాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భూములను రైతులకు ఇచ్చే ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అటవీశాఖ అధికారులు పూర్తి చేయాలన్నారు. పట్టాపాసు పుస్తకాలు ఉన్న రైతులకు చెందిన 45 ఎకరాల వ్యవసాయ భూమిని వారి ఆధీనంలోనే ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ల్యాండ్ సర్వే విభాగం ఏడీ, కుడా పీవోతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వేరోస్ స్వయంకృషితో రాణించాలి

వడ్డెపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వేరోస్ అన్నిరంగాల్లో రాణించాలని స్వేరోస్ రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ దీక్ష వాల్ పోస్టర్‌ను స్వేరోస్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. జ్ఞానం కోసమే భీమ్ దీక్ష అని అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్థూపం వద్ద మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు జ్ఞానం కోసం నిర్వహించే భీమ్ దీక్షలలో స్వేరోస్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ



అంబేద్కర్ విగ్రహం వద్ద భీమ్ దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వేరోస్

కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర కోకన్వీనర్ పుల్లా కిషన్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు అమ్మఒడి సుభద్ర శ్యామల, మారపల్లి మనోజ్, ఒంటేరు చక్రి, శనిగరపు శ్రీనివాస్, బొల్లారం రమాకాంత్, శనిగరపు రాజేంద్రప్రసాద్, అమ్మఒడి శ్రీనివాస్, శనిగరపు సాజన్ పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్



వరంగల్ మెడికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) వైద్యాధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ గోపాలపురానికి చెందిన డాక్టర్ బిజిలి దుర్గాప్రసాద్ ఎన్నిక అయ్యారని కమిటీ చైర్మన్ డాక్టర్ గుండా రవీందర్ ప్రకటించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యాధికారుల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ వలబోజు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బిజిలి దుర్గాప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ బండిశ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15శాతం నిధులను కేటాయించాలని కేయూ ఏబీవీపీ అధ్యక్షుడు మెరుగు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో జరిగిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశంలో సాయికుమార్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీలకు బ్లాక్‌గ్రాంట్ ఇవ్వడం లేదని, నిరుద్యోగులను నట్టేట ముంచుతోందని ఆరోపించారు. ఏబీవీపీ నాయకులు పూజ, సంయుక్త, సాయిప్రియ, అభినయ్, ఫణీంద్ర, తరుణ్, సాగర్, ఉదయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

హనుమకొండ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని డీమార్ట్ షాపింగ్ మాల్‌లో ఈనెల 10న భూపాలపల్లి జిల్లాకు చెందిన సంగి నిశ్చిత మెడలో ఉన్న 6 గ్రాముల బంగారు గొలుసు అపహరణకు గురైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి గురైన ఆరు గ్రాముల బంగారం గొలుసును బుధవారం వెతికి బాధితురాలికి అప్పగించారు.



మహిళకు బంగారాన్ని అప్పగిస్తున్న సీఐ

సబ్‌స్టేషన్లను తనిఖీ చేసిన డైరెక్టర్ ఆపరేషన్



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ మధుసూదన్, డీఈ

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డివిజన్‌లోని నిట్, సుబేదారి సబ్‌స్టేషన్‌లను టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ బుధవారం తనిఖీ చేశారు. నిట్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయబోయే 8.0 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 11 కేవీ బ్రేకర్ పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా సుబేదారి సబ్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 160 ఈవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు తనిఖీ చేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్దేశించిన పనులను త్వరితగిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు సుబ్రమణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డీఆర్‌సీసీ కేంద్రం సామర్థ్యాన్ని పెంచాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బాలసముద్రంలోని కంపోస్ట్ యార్డ్ ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని డ్రైకంపోస్ట్ కలెక్షన్ సెంటర్(డీఆర్‌సీసీ) సామర్థ్యాన్ని పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం కమిషనర్ డీఆర్‌సీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంపోస్ట్ యూనిట్, వర్మీ కంపోస్ట్ కేంద్రం, కోకోపిట్ యూనిట్‌ను సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డీఆర్‌సీసీ కేంద్రానికి ప్రతీరోజు ఒక టన్ను పొడి చెత్త చేరే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తప్పకుండా పొడి చెత్తను ఇక్కడి సామర్థ్యానికి సరిపడా అందజేయాలని సూచించారు. ఇక్కడ తయారయ్యే కోకోపిట్ ద్వారా ప్రజలకు బాగా



డీఆర్‌సీసీ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, వావ్ ప్రతినిధులు పవణ్ తదితరులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

ప్రత్యక్షంగా చూశా.. సవాల్‌గా తీసుకున్నా..

మేరకు పరిష్కారం చూపాలని సవాల్‌గా తీసుకున్నా. ప్రధానంగా నాలాల్లో పేరుకు పోయిన చెత్త, పూడికనే. నయీంనగర్, రాజాజీ కాలనీ, జవహర్ కాలనీ, పెద్దమ్మగడ్డ వద్ద ఇరుకుగా ఉన్న నాలాలను విస్తరించటంతో పాటు వంతెనలు పూర్తిచేశాం. అప్పటికే వర్షాలు జోరుగా పడుతుండటంతో ముంపు తప్పినట్టేనా అని ఆందోళన మొదలైంది. రెండు రోజులు నిద్ర కూడా పట్టలేదు. మొత్తానికి గతేడాది వానలకు ఎలాంటి వరద ముంపు లేకపోవటం చాలా సంతోషంగా అనిపించింది.

ఆంధ్రజ్యోతి: నగర అభివృద్ధిలో ఎలాంటి పురోగతి సాధించారు?

కమిషనర్: కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాళోజీ కళాక్షేత్రం టాస్క్‌లా వచ్చింది. నిజంగా కళలకు, కళాకారులకు, జానపదాలకు వరంగల్ నిలయం. అలాంటి నగరంలో మహాకవి కాళోజీ నారాయణరావు స్మారకార్థం చేపట్టిన కళాక్షేత్రాన్ని పూర్తి చేయాలనే టాస్క్ రావటంతో దాదాపు రోజుకు రెండు, మూడు సార్లు విజిట్ చేసి పనులను వేగవంతం చేయించా. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధుల సహకారంతో అనుకున్న సమయానికి కళాక్షేత్రం సిద్ధం చేయటంతో పాటు 50ఏళ్లుగా అమలుకు నోచుకోని వరంగల్ మాస్టర్ ప్లాన్ అమల్లోకి తీసుకరావటం గొప్ప అనుభూతినే ఇచ్చింది. ప్రభుత్వం సూచనల మేరకు మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇవ్వటం, ఆమోదం పొందటం మరిచిపోలేను. మాస్టర్ ప్లాన్ అమల్లోకి రావటంతో నగరాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో అనే ఒక లక్ష్యం ఏర్పడింది.

ఆంధ్రజ్యోతి: భూగర్భ డ్రెయినేజీకి ప్రభుత్వం నిధులు కేటాయించింది కదా.. పనులు ఎప్పటి నుంచి మొదలవ్వొచ్చు?

కమిషనర్: నగరంలో భూగర్భ డ్రెయినేజీ కోసం రూ.4,170కోట్లను ప్రభుత్వం విడుదల చేయటం చాలా గొప్ప విషయం. ఈ మార్చి 31నాటికి డీపీఆర్‌ను సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. వానకాలం తరువాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఈలోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తారు. మూడు విడతల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ)కి నిధులు కేటాయిస్తారు. తొలివిడతలో రూ.3,087కోట్లతో పనులకు టెండర్లు నిర్వహించే అవకాశం ఉంది. యూడీసీ పూర్తయితే వరంగల్ నగరానికి వరద ముంపు సమస్య శాశ్వతంగా తొలిగిపోనుంది.

ఆంధ్రజ్యోతి: స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల పనులు నత్తనడకన సాగడానికి కారణాలేంటి?

కమిషనర్: ఓరుగల్లులో స్మార్ట్ సిటీ కింద 108 పనులు చేపట్టాం. వీటిలో 64పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి 31 నాటికి స్మార్ట్ సిటీ పథకం పూర్తవుతున్నా.. పనులు ఆగవు. అయితే గతేడాదిలో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు ఇలా వరుసగా ఎన్నికల కోడ్ రావటంతో టెండర్ల నిర్వహణలో జాప్యం జరిగింది. ప్రస్తుతం స్మార్ట్ సిటీ పనులు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. అలాగే అమృత్-1 పథకం కింద దాదాపు పనులు పూర్తి చేశాం. అయితే అమృత్-2 పథకం కోసం రూ.607 కోట్లతో



కేంద్రానికి ప్రతిపాదనలు పంపించటం జరిగింది. కేంద్రం నుంచి అమృత్-2 కింద నిధులు వస్తే పనులు చేపడుతాం. హృదయ్ పథకం ద్వారా భద్రకాళి, వెయ్యిస్తంభాల గుడి, కోట తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. ఈ పథకం కింద కూడా ఎలాంటి పనులు పెండింగ్‌లో లేవు. జీడబ్ల్యూఎంసీ ద్వారా వరంగల్ కోట మెట్లబావి రూ.55 లక్షల్లో అభివృద్ధి చేస్తున్నాం. కుడా ద్వారా ఎలుకుర్తి జంక్షన్, కలెక్టర్ బంగ్లా, మ్యూజికల్ గార్డెన్, ఏకశిల పార్కు తదితర పనులు చేపట్టాం. త్వరలోనే వాటిని కూడా పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: డంపింగ్ సమస్య తీవ్రంగా ఉంది. రాంపూర్‌లో ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. దీనికి పరిష్కారం చూశారా?

కమిషనర్: డంపింగ్ సమస్య పరిష్కారానికి అనేక కోణాల్లో వెతుకుతున్నాం. వేరే చోట డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలున్నాయి. అయితే ఇటీవల ప్రభుత్వం హుజూరాబాద్ వద్ద వరంగల్, కరీంనగర్‌తో పాటు తొమ్మిది మునిసిపాలిటీలకు సంబంధించిన చెత్తను తరలించేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో చాలా వరకు నగరంలోని చెత్తను హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డుకు పంపించే అవకాశం ఉంటుంది. ఇక రాంపూర్‌లోని డంపింగ్ యార్డు నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెప్పుతున్నారు. వారికి ఎలాంటి సమస్య రాకుండా పరిష్కారాలు చూస్తున్నాం. తాత్కాలికంగా అక్కడ చెత్తను కుప్పలు కుప్పలుగా కాకుండా, ఒకే లెవల్‌లో ఉండేలా చూస్తున్నాం. అలాగే చెత్త నుంచి పొగ రాకుండా అర్పి వేసేందుకు నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశాం. 12 ఎకరాల్లో మొక్కలు పెంచుతున్నాం. హుజురాబాద్‌లో డంపింగ్ యార్డు వస్తే రాంపూర్‌లో కొంతవరకు సమస్య తగ్గే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు పనులు ఎంత వరకు వచ్చాయి? భూ నిర్వాసితులకు పరిహారం ఇస్తున్నారా?

కమిషనర్: ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను కుడా ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నాం. భూనిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం రూ.107కోట్లు మంజూరు చేసింది. కలెక్టర్ నుంచి జాబితా వస్తే, అర్హులైన రైతులకు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇన్నర్ రోడ్డు పనులు కూడా జరుగుతున్నాయి. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేస్తాం. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పనులను జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎల్ఆర్ఎస్‌కు ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

కమిషనర్: లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం 25 శాతం రాయితీతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. జీడబ్ల్యూఎంసీ పరిధిలో లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలఖారు వరకే సమయం ఉంది. జీడబ్ల్యూఎంసీలో 10 హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశాం. అయితే చాలా మంది ఎల్ఆర్ఎస్‌పై ఆసక్తి చూపటం లేదు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీ కాలనీలో ప్రచారం చేస్తున్నాం.

గంజాయి పట్టివేత

హసన్‌పర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి పెగడపల్లి డబ్బాలు, గుండ్లసింగారం ఓఆర్ఆర్ వద్ద కేయూ పోలీసులు బుధవారం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 3.200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ కథనం ప్రకారం.. దామెర మండలం పులుకుర్తికి చెందిన దుప్పటి ప్రవీణ్ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద ఒక మహిళ వద్ద గంజాయి కొనుక్కొని రైల్వే స్టేషన్, కాలేజీ ప్రాంతాలలో విక్రయిస్తుంటాడు. ఈక్రమంలోనే బుధవారం పెగడపల్లి డబ్బాలు, గుండ్లసింగారం ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓఆర్ఆర్ పెగడపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని అతడి వద్ద



నిందితుడి అరెస్టు చూపుతున్న కేయూ పోలీసులు

3.200 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

బాలసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద గురువారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాల్సిందిగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ముసాయిదాలో చిన్న కమతాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం లేదని పెద్ద కమతాల ఏర్పాటు అవసరమని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. దేశ వ్యవసాయ రంగాన్ని రక్షించుకునేందుకు నిర్వహించే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతాంగానికి బాలరాజు పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

రాంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలపై గురువారం మడికొండ సబ్‌స్టేషన్ ఆవరణలో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్.వి. వేణుగోపాలాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, వినియోగదారులుపాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

కేంద్రం నూతన విద్యావిధానం ముసాయిదాను అడ్డుకోవాలి

- పీడీఎస్‌యూ నేత మర్రి మహేశ్

కేయూ క్యాంపస్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ఇటీవల తెచ్చిన యూజీసీ నూతన ముసాయిదా బిల్లును అడ్డుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూలో పీడీఎస్‌యూ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడారు. యూజీసీ ముసాయిదా బిల్లును వ్యతిరేకించాలని, డిటెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముసాయిదా, డిటెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 15న కేయూ దూరవిద్య కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనికి ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బోగేశ్వర్, పీడీఎస్‌యూ జాతీయ నేతలు పి.మహేశ్, శ్రీకాంత్, నాగరాజు, రాచర్ల బాలరాజులు హాజరై మాట్లాడుతారని తెలిపారు. రౌండ్ టేబుల్ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా నేతలు పవన్, రాజేశ్, అనిల్, గణేశ్, రతీశ్, వినయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్



ఇంట్లోనే హోలీ రంగులు

రంగుల పండుగ హోలీని చిన్నా, పెద్దా అందరూ ఇష్టంగా జరుపుకుంటూ ఉంటారు. రంగులను ఇంట్లోనే తయారు చేసుకుని వాటితో హోలీ ఆడుకుంటే ఆనందం రెట్టింపు అవుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా మెరుస్తాయి కూడా! రసాయనాలు లేని హోలీ రంగులను ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం.

గులాబీ రంగు

పండుగకు ముందు రోజు రాత్రి స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బీట్‌రూట్‌ని చక్రాలుగా కోసి వేయాలి. అవి మునిగేవరకూ నీళ్లు పోసి మరిగించాలి. స్టవ్ మీద నుంచి దించి రాత్రంతా అలాగే ఉంచాలి. ఉదయాన్నే ఈ నీళ్లను వడబోసి అవసరమైతే మరికొన్ని నీళ్లు కలుపుకుని వాడుకోవచ్చు. ముదురు గులాబీ రంగులో ఉండే ఈ నీళ్లతో హోలీ ఆడుకోవచ్చు.

పసుపు రంగు

గిన్నెలో రెండు చెంచాల పసుపు, చెంచా శనగపిండి వేసి బాగా కలిపి జల్లెడ పట్టాలి. ఇందులో నీళ్ల చుక్కలు చిలకరిస్తూ పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. పసుపు రంగు సిద్ధం అవుతుంది. పసుపు రంగు బంతి పూల రెక్కలను నీళ్లలో వేసి ఉడికించి తరవాత వడబోసి అందులో చిటికెడు పసుపు కలిపినా కూడా పసుపు రంగు తయారవుతుంది.

ఎరుపు రంగు

హోలీకి ముందు రోజు రాత్రి స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో నీళ్లు, దానిమ్మ తొక్కలు వేసి బాగా మరిగించాలి. ఉదయాన్నే ఈ నీళ్ల వడబోసి మరికొన్ని నీళ్లు కలిపితే ఎరుపు రంగు తయారవుతుంది. బకెట్ నీళ్లలో రెండు చెంచాల ఎర్రని కుంకుమ, చిటికెడు కార్న్‌ఫ్లోర్ వేసి కలిపినా కూడా క్షణాల్లో ఎరుపు రంగు తయారవుతుంది. కొన్ని ఎర్ర మందారం పూలను మిక్సీ గిన్నెలో వేసి అరచెంచా బియ్యం పిండి, తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని బకెట్ నీళ్లలో వేసి బాగా కలిపి వడబోస్తే ఎరుపు రంగు సిద్ధం.

లేత ఆకుపచ్చ రంగు

కొన్ని ఉసిరి కాయలను మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ నీటిని వడబోసి అందులో చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి ఉండలు రాకుండా కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా అనిపిస్తే మరికొన్ని నీళ్లు కలపవచ్చు. లేత ఆకుపచ్చ రంగు వస్తుంది.

వంకాయ రంగు

వంకాయ రంగులో ఉండే క్యాబేజీని చిన్న ముక్కలుగా కోసి మిక్సీ గిన్నెలో వేయాలి. ఇందులోనే కొన్ని క్యారెట్ ముక్కలు వేయాలి. తగినన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి.. ఈ మిశ్రమాన్ని వడబోసి మరికొన్ని నీళ్లు, చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. చక్కని పర్పుల్ కలర్ తయారవుతుంది.

ముదురు గోధుమ రంగు

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు, నాలుగు చెంచాల టీ పొడి లేదా రెండు చెంచాల కాఫీ పొడి వేసి బాగా మరిగించాలి. ఈ డికాషన్‌ని వడబోసి అర బకెట్ నీళ్లలో కలిపితే ముదురు గోధుమ రంగు తయారవుతుంది. కొద్దిగా రోజ్‌వాటర్ కలిపితే సువాసన వెదజల్లుతుంది.

ఆకుపచ్చ రంగు

ఒక గిన్నెలో మూడు చెంచాల గోరింటాకు పొడి, ఒక చెంచా బియ్యప్పిండి వేసి బాగా కలపాలి. ఇందులో కొన్ని నీళ్లు పోసి పేస్టులా చేసి ఈ మిశ్రమాన్ని బకెట్ నీళ్లలో వేసి బాగా కలపాలి. చక్కని ఆకుపచ్చ రంగు తయారవుతుంది.

కాషాయం రంగు

ఒక బకెట్ నీళ్లలో నాలుగు చెంచాల తిరుచూర్ణం, చిటికెడ్ కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలిపితే కాషాయం రంగు సిద్ధం అవుతుంది.





మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నివసిస్తూ కూడా తెలుగుపై మమకారంతో భాషాసేవ చేసేవారందరో! అలాంటి వారిలో డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి ఒకరు. ఒడిశాలోని బరంపురంలో నివసిస్తున్న రాజేశ్వరి... జ్ఞానపీఠ పురస్కార గ్రహీత గోపీనాథ్ మహంతి ఒడియాలో రాసిన 'దాడి బుధా' అనే నవలను 'ఈతచెట్టు దేవుడు' పేరిట అనువదించారు. ఈ నవలకు తాజాగా కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ఈ నేపథ్యంలో రాజేశ్వరిని 'నవ్య' పలకరించింది.



అధ్యయనం చేయకుండానే రాసేస్తున్నారు

కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు లభించినందుకు అభినందనలు...

కృతజ్ఞతలు. ఈ అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను 50 ఏళ్ల నుంచి రాస్తున్నాను. అనేక అవార్డులు కూడా వచ్చాయి. అయితే జాతీయ స్థాయిలో గుర్తింపు రావటం చిన్న విషయం కాదు. ఈ నా ప్రయాణంలో నా కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారు.
ఈ అవార్డు రావటంలో పరోక్షంగా వారి సహకారం కూడా ఉంది.

మీరు కొన్ని స్వతంత్ర రచనలు చేశారు.. అనువాదాలూ చేశారు. వీటిలో ఏది కష్టం?

నా అనుభవంలో అనువాదమే కష్టమనిపిస్తుంది. ఎందుకంటే - కొన్ని ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాల సమాహారమే స్వతంత్ర రచన. వీటికి అనుగుణంగానే మన రచన సాగుతుంది. కానీ అనువాదంలో ఇంకో రచయిత ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాలను ఆవాహన చేసుకోవాలి. వాటిని మన భాషలోకి తీసుకురావాలి. మూల రచన భావం చెడకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే మూల రచనలో పూర్తిగా నిమగ్నమైపోవాలి. మూల రచయిత భావనలలోనే బతకాలి. చాలా సందర్భాలలో అనువాద రచన పూర్తయినా... ఆ పాత్రలు ఇంకా వెంటాడుతూ ఉంటాయి. ఇప్పుడు నాకు అవార్డు వచ్చిన 'ఈతచెట్టు దేవుడు'నే తీసుకుందాం. ఈ నవలలోని పాత్రలు చాలా లోతుగా ఉంటాయి. దీని రచన పూర్తయిన కాలం ఆ పాత్రలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. అందుకే మూల రచన ఒడియా పాఠకులకు అంత దగ్గరయింది.

తెలుగు, ఒడియా సాహిత్యాల మధ్య ఉన్న సామ్యమేమిటి?

తెలుగు, ఒడియాలు మాత్రమే కాదు. ఇతర భారతీయ భాషా సాహిత్యంలో కూడా చాలా పోలికలు ఉంటాయి. భాషపరంగా ఎటువంటి సంబంధం ఉండకపోవచ్చు. కానీ సామాజికంగా అనేక విషయాలు ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు మనం తెలుగు ఆధునిక సాహితీ యుగానికి గురజాడను యుగకర్తగా చెప్పుకుంటాం కదా! గురజాడ జీవించిన సమయంలో ఒడియాలో ఫకీర్ మోహన్ సేనాపతి అని ఒక రచయిత ఉండేవారు. ఆయనను ఒడియా సాహితీ దిగ్గజంగా చెప్పుకోవచ్చు. ఆయన 'రేవతి' అనే ఒక కథ రాశారు. ఈ కథలో చిన్న చిన్న అమ్మాయిలను ముసలివాళ్లకు ఇచ్చి పెళ్లిచేయటం, డబ్బుల కోసం అమ్మాయిలను అమ్ముకోవటం ప్రధానమైన అంశాలు. గురజాడ 'కన్యాశుల్కం'లోని పాత్రల లాంటివే దీనిలో కూడా ఉంటాయి. వాస్తవానికి భాషాపరంగా తెలుగుకు, ఒడియాకు ఎటువంటి సంబంధం లేదు. కానీ ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో ఒకే రకమైన దురాచారాలు ఉన్నాయి. వాటిపై రచయితలు స్పందించారు. కేవలం ఈ రెండు భాషల్లోనే కాదు. ఇతర భాషల్లో రచయితలు కూడా ఈ తరహా దురాచారాలపై స్పందించే ఉంటారు.

ప్రస్తుతం తెలుగు భాష వ్యాప్తి మీద మీ అభిప్రాయమేమిటి?

మంచి కృషి జరుగుతోంది. జరగటం లేదని చెప్పలేం. కానీ ఈ తరం వాళ్లు తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి దూరం అవుతున్నారనేది నా అభిప్రాయం. గత మూడు దశాబ్దాలుగా తెలుగు చదివేవారి సంఖ్య తగ్గుతోంది. చిన్నప్పటి నుంచి ఇంగ్లీషు కాన్వెంట్స్‌లో చదువుతున్నారు. దీని వల్ల తెలుగు చదివేవారి సంఖ్య, రాసేవారి సంఖ్య తగ్గిపోతోంది. నా ఉద్దేశంలో ప్రస్తుతం ఎక్కువగా తెలుగు చదివేవారు 50లు దాటినవారే! ఎక్కువ మంది చదవకపోవటం వల్ల మంచి సాహిత్యం రావటం లేదు. అదే సమయంలో సాహితీపరంగా లోతైన అధ్యయనం చేసేవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొద్దిమంది చేస్తున్నారు. కానీ అది ప్రభావవంతంగా, సంతృప్తికరంగా ఉండటం లేదు. నా ఉద్దేశంలో పాతను ఎప్పుడూ మనం గౌరవించాలి. పాత మన భవిష్యత్తుకు పునాదిలాంటి. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న రామాయణ, భారత, భాగవత గ్రంథాలతో పాటు ఇతర సాహిత్యాన్ని కూడా చదవాలి. ఆ గ్రంథాలలో ఉన్న మంచిని గ్రహించాలి. మంచిని గ్రహించాలంటే ముందు అధ్యయనం చేయాలి. అధ్యయనం చేయటానికి బాగా చదవాలి. ఇప్పుడు కొందరు అధ్యయనం చేయకుండా రాసేస్తున్నారు. ఈ విషయం తలుచుకున్నప్పుడు బాధగా అనిపిస్తుంది.

• సివిఎల్ఎన్ ప్రసాద్

రసాయన రంగుల నుంచి
రక్షణ ఇలా...

బజారు నుంచి తెచ్చే హోలీ రంగుల్లో రసాయనాలు కలిసి ఉంటాయి. వీటి వల్ల చర్మానికి, కురులకు హాని కలుగవచ్చు. హోలీ ఆడే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

- రంగులు చల్లుకున్న తరవాత రసాయనాల ప్రభావం వల్ల చర్మం పొడిబారి మంటగా అనిపించవచ్చు. కాబట్టి ముందుగానే ముఖం, చేతులు, కాళ్లకు మాయిశ్చరైజర్ రాసుకోవడం మంచిది. కొబ్బరి నూనె లేదా బాదం నూనె రాసుకున్నా ఫలితం ఉంటుంది. వీటిని రాసుకోవడం వల్ల రంగులు చర్మం లోపలి పొరల్లోకి ప్రవేశించలేవు.
- హోలీ ఆడే ముందు తలకు కొబ్బరినూనె లేదా ఆలివ్ నూనె రాసుకోవాలి. దీనివల్ల మాడు మీద రక్షణ పొర ఏర్పడి వెంట్రుకల కుదుళ్లలోకి రంగులు చొచ్చుకుని పోకుండా ఉంటాయి. నూనె రాయడం వల్ల శిరోజాలకు రంగులు అంతగా పట్టవు. తలస్నానం చేసిన వెంటనే తేలికగా రంగులు వదిలిపోయి వెంట్రుకలు మృదువుగా మెరుస్తాయి.
- రంగుల నుంచి శిరోజాలను కాపాడుకోవడానికి టోపీ, స్కార్ఫ్ ధరించవచ్చు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే తేలికపాటి నూలు బట్టలు వేసుకోవాలి. దుస్తులు మరీ బిగుతుగా కాకుండా కొద్దిగా వ దులుగా ఉన్నవి అయితే మంచిది. పాదాలకు షూస్ వేయడం ఉత్తమం.
- గోళ్లకు రంగులు అంటకుండా నెయిల్ పాలిష్ వేస్తే మంచిది
- హోలీ ఆడడానికి వెళ్లే ముందు పెదవులకు లిప్ బామ్ వేసుకోవాలి. లేదంటే రంగుల వల్ల పెదవులు తేమను కోల్పోతాయి. వాటిపై పగుళ్లు ఏర్పడి రక్తస్రావం కావచ్చు.
- హోలీ ఆడిన తరవాత ముఖాన్ని, చేతులను సబ్బుతో ఎక్కువగా రుద్దకూడదు. సున్నిపిండి లేదా శనగపిండిని ఉపయోగించడం మంచిది.



వాయిదా పడినా.. పట్టు వీడలేదు

గ్రూప్ 2 ర్యాంకర్ల మనోగతం

గ్రూప్ 2 ఫలితాలు వెలువడ్డాయి. విజేతలందరూ ఆనందంలో మునిగి తేలుతున్నారు. తొలి మూడు స్థానాలు సాధించిన ర్యాంకర్లు తమ ప్రయాణాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. నాలుగుసార్లు పరీక్ష వాయిదా పడ్డా పట్టువీడకుండా, తమ ప్రిపరేషన్ కొనసాగించి విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వీరికి భిన్న అనుభవాలు ఉన్నాయి. మొదటి ర్యాంకర్ హర్షవర్ధన్ రెడ్డి తొలి పరీక్షలోనే విజయం సాధించగా, రెండో ర్యాంకర్ సచిన్ పోటీ పరీక్షల్లో ఒకటి, రెండు పర్యాయాలు విఫలమైనా మూడో ప్రయత్నంలో విజయం సాధించాడు. మూడో ర్యాంకర్ మనోహర్ రావు రాసిన ప్రతీ పరీక్షలో దాదాపుగా విజయం సాధించాడు. అయితే విజేతలు ముగ్గురు కూడా ప్రస్తుతం ఉద్యోగంలో చేరినప్పటికీ సివిల్స్ లక్ష్యంగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సివిల్సే నా లక్ష్యం

మొదటి ర్యాంకర్ వెంకట హర్షవర్ధన్‌రెడ్డి



గ్రూప్స్‌తో ఆగిపోతారా? వేరే లక్ష్యం ఉందా?

పదో తరగతి ఖమ్మంలో, ఇంటర్ విజయవాడ, బీటెక్ తాడేపల్లిగూడెం ఎన్ఐటీలో పూర్తి చేశా. సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

పోటీ పరీక్షలకు స్ఫూర్తి ఎవరు?

నాన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్. అందుకే నాకు ప్రభుత్వ ఉద్యోగం పట్ల ఆసక్తి మొదలైంది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో ఉండే ఆదరణ, ప్రజాసేవ చేయడానికి వాళ్లకి ఉండే అవకాశాల గురించి నాన్న వివరించేవారు. దీంతో ప్రభుత్వ కొలువు సాధించాలని లక్ష్యం ఏర్పడింది. ఇప్పుడు మొదటి అడుగు పడింది. ఇక యూపీఎస్సీకి ప్రిపేర్ కావాలని నిర్ణయించుకున్నాను.

సివిల్స్ కోచింగ్ ఏమైనా తీసుకున్నారా?

బీటెక్ పూర్తికాగానే ఢిల్లీలోని 'వాజీరాం అండ్ రవి' ఇన్‌స్టిట్యూట్‌లో ఆన్‌లైన్‌లో సంవత్సరం పాటు కోచింగ్ తీసుకున్నాను. మూడు గంటలు కోచింగ్‌కు వెళ్లిన తర్వాత మిగిలిన సమయం ఇంటి వద్ద చదువుకునేవాడిని.

టీజీపీఎస్సీ వైపు ఎందుకు వచ్చారు?

ఏడాది నుంచి యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. ఇదే సమయంలో గ్రూప్స్ నోటిఫికేషన్ వెలువడింది. దీంతో తొందరగా జాబ్ సాధించవచ్చనే ఉద్దేశంతో గ్రూప్స్‌కు సిద్ధం అయ్యాను. మంచి ఫలితం వచ్చింది.

స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించారు.. ఏ ఉద్యోగం వస్తుందని అనుకుంటున్నారు?

డిప్యూటీ తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ పోస్టుల్లో ఏదో ఒకటి వస్తుందని భావిస్తున్నాను.

యూపీఎస్సీ లక్ష్యం అన్నారు కదా?

ఉద్యోగంలో చేరిన తరువాత కూడా నా ప్రిపరేషన్ ఆపను. యూపీఎస్సీపై దృష్టి సారిస్తాను.

సెల్ఫ్ మోటివేషన్‌తోనే సక్సెస్

రెండో ర్యాంకర్ సచిన్



మీ నేపథ్యం ఏమిటి? ఏమి చదువుకున్నారు?

మాది సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్ల. అయితే సిద్దిపేటలోనే స్థిరపడ్డాం. అమ్మ పేరు సుజాత, నాన్న శ్రీనివాస్ రెడ్డి. నాన్న సివిల్ కాంట్రాక్టర్. ఏడో తరగతి వరకు సిద్దిపేటలో చదువుకున్నా. టెన్త్, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లో పూర్తయింది. ఢిల్లీలోని బీఎంఎల్ యూనివర్సిటీ నుంచి బీటెక్ పూర్తిచేశాను.

ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి ఇటెలా వచ్చారు?

2019లో బీటెక్ పూర్తి కాగానే ఐటీ కంపెనీలో చేరి సంవత్సరం పనిచేశాను. కొవిడ్ లాక్‌డౌన్‌తో ఇంటి నుంచే పని చేశా. అప్పుడే పోటీ పరీక్షల వైపు ఆసక్తి కలిగింది. సివిల్స్ రాద్దామని నిర్ణయించుకుని సొంతంగా సిద్ధం కావడం మొదలు పెట్టా. 2021, 2022లో రెండుసార్లు సివిల్స్ అటెంప్ట్ చేసినా.. ఫలితం దక్కలేదు. అదే సమయంలో టీజీపీఎస్సీ నుంచి నోటిఫికేషన్లు రావడంతో గ్రూప్స్‌కు దరఖాస్తు చేశాను. ఈసారి మరింతగా సిద్ధం అవ్వాలని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నాను.

మధ్యలో ఎప్పుడైనా నిరుత్సాహానికి గురయ్యారా?

పరీక్ష చివరి వరకు వచ్చి, దాదాపు నాలుగుసార్లు వాయిదా పడింది. అప్పుడు అసహనంగా ఉండేది. కొన్నిసార్లు సమయం వృథా చేస్తున్నామా అనే అనుమానం కూడా వచ్చేది. ఎమోషనల్‌గా డిస్ట్రబ్ అయ్యేవాడిని. ఒక సందర్భంలో మళ్లీ ఐటీకి వెళ్లిపోదామని అనుకున్నా కూడా. కొన్ని కొత్త కోర్సులు నేర్చుకున్నా. ఉద్యోగాలకు అప్లై కూడా చేశాను. కానీ మళ్లీ ఒక్కసారి ఆలోచించాను. ఇన్ని రోజుల కష్టం వృథా అవుతుంది కదా.. కొద్దిరోజులు చూద్దామని నిర్ణయించుకున్న. అనుకున్నట్టే మంచి ఫలితం వచ్చింది. గ్రూప్-1లోనూ 461.5 మార్కులు వచ్చాయి.

ఉద్యోగ సాధనలో ఎవరైనా రోల్ మోడల్ ఉన్నారా?

ప్రత్యేకించి రోల్ మోడల్ అంటూ ఎవరు లేరు. సక్సెస్ అయిన వాళ్లవి, టాపర్స్ వీడియోలు చూస్తుంటాను. మా తాత సిరిసినగండ్ల వెంకట్‌రెడ్డి నాతో పాటు మా ఫ్యామిలిలో అందరినీ మోటివేట్ చేసేవారు. ఆయన రిటైర్డ్ టీచర్. బాగా చదువుకుని మంచి స్థాయిలో ఉండాలని చెబుతుండేవారు. ఆయన ప్రభావం నాపై ఉంది.

మీ నెక్ట్స్ టార్గెట్ ఏంటి?

గ్రూప్-2 ఫలితంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఫైనల్‌గా నా టార్గెట్ మాత్రం సివిల్స్. అదే లక్ష్యంతో ముందుకెళ్తాను. పోటీ పరీక్షలు అంటే కనీసం రెండు, మూడు సంవత్సరాలు ప్లాన్ చేసుకోవాలి. అప్పుడే ఫలితం వచ్చే అవకాశం ఉంది.

అమ్మ ప్రేరణతోనే వరుస ఉద్యోగాలు

గ్రూప్-2 మూడో ర్యాంకర్ మనోహర్‌రావు



వరుసగా ఉద్యోగాలు సాధించడానికి ప్రేరణ ఎవరు?

మాది మారుమూల వ్యవసాయం కుటుంబం. నాన్న పండరినాథ్‌రావు రైతు. అమ్మ కమలమ్మ అంగన్‌వాడీ కార్యకర్త. ముగ్గురు సోదరులం. అన్న వ్యవసాయం చేస్తుంటాడు. తమ్ముడు వ్యవసాయశాఖలో ఏఈవో. అమ్మ ఇచ్చిన ప్రేరణతోనే వరుసగా ఉద్యోగాలు సాధించా. మా ఆవిడ మనీష సహకారం కూడా ఉంది.

ప్రిపరేషన్‌లో ఎవరి సహాయమైనా ఉందా?

6 నెలల పాటు హైదరాబాద్‌లో శిక్షణ పొందాను. అక్కడి గైడెన్స్ బాగా ఉపయోగపడింది. రోజుకు పదిహేను, పద్దెనిమిది గంటలు చదువుపై దృష్టిపెట్టాను. పరీక్షల నిర్వహణలో జాప్యం కారణంగా నిరుత్సాహ పడ్డా. అయితే మళ్లీ పరీక్ష తేదీల ప్రకటన రావడంతో ఉత్తేజంతో చదువు మొదలు పెట్టేవాడిని.

ఇప్పటి వరకు ఏయే ఉద్యోగాలు సాధించారు?

నారాయణఖేడ్‌లోనే ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు చదివి, హైదరాబాద్‌లోని వీవీ కళాశాలలో ఆర్థిక శాస్త్రంలో పీజీ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించాను. మొదటగా 2017లో టీజీటీలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, పీజీటీలో మూడవ స్థానం వచ్చింది. అయినప్పటికీ పీజీటీ ఉద్యోగంలో చేరాను. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌గా కూడా ఎంపికయ్యాను. గతంలో కూడా గ్రూప్-2లో ర్యాంకు సాధించి, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డీటీగా విధులు నిర్వహించి, అనారోగ్యం వల్ల తిరిగి ఉపాధ్యాయుడిగా తిరిగి చేరాను. ప్రస్తుతం మెదక్ జిల్లా కొల్చారాం మండలం అన్‌సాన్‌పల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. జేఎల్‌గా కూడా అవకాశం వచ్చింది. గ్రూప్-1లో 430 మార్కులు వచ్చాయి.

మళ్లీ గ్రూప్-1 లేదా సివిల్స్‌కు ఏమైనా ప్రిపేర్ అయ్యే ఆలోచన ఉందా?

సివిల్స్ లేదా డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. అందుకోసం అవకాశం ఉన్నంత వరకు ప్రయత్నిస్తూనే ఉంటాను.

కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది?

అమ్మ, నాన్న, అన్నదమ్ములు అందరి సహకారం ఉంది. ప్రతీ విషయంలో నాకు కుటుంబం మద్దతుగా నిలబడింది. నా వివాహం 2014లో జరిగింది. భార్య పేరు మనీష మాకు ప్రస్తుతం ఒక పాప, బాబు ఉన్నారు.

కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో..
50% దాకా ఫీజుల పెంపు

▸▸ ప్రభుత్వానికి ప్రతిపాదించిన టీఏఎఫ్ఆర్‌సీ

హైదరాబాద్, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులు పెరగనున్నాయి. తెలంగాణ ప్రవేశాలు, ఫీజు నియంత్రణ కమిషన్(టీఏఎఫ్ఆర్‌సీ) ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు కొన్ని కళాశాలల్లో ఫీజులు 50% వరకు పెరగనున్నాయి. నిజానికి.. మూడేళ్లకోసారి ఇంజనీరింగ్ కళాశాలల ఫీజులను సవరిస్తారు. ఆయా కళాశాలల నిర్వహణ ఖర్చులు, ప్రొఫెసర్లకు ఇస్తున్న జీతాలు, అక్కడి సదుపాయాలను పరిశీలించి టీఏఎఫ్ఆర్‌సీ ఫీజుల పెంపును ప్రతిపాదిస్తుంది. ఈ సిఫార్సులను ప్రభుత్వం యథాతథంగా ఆమోదించవచ్చు. లేదంటే కొన్ని మార్పులుచేర్పులతో ఓకే చెప్పవచ్చు. గతంలో 2019లో, 2022లో ఫీజులను పెంచారు. 2022 కంటే ఈసారి కొన్ని కళాశాలలకు చాలా ఎక్కువ ఫీజుల పెంపును ప్రతిపాదించారు. ఉదాహరణకు సీబీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ ఫీజు 2019లో రూ.1.34లక్షలుండగా.. 2022లో 25శాతం పెంచుతూ.. రూ.1.65లక్షలుగా నిర్ణయించారు. ఇప్పుడు ఏకంగా.. 42.9% మేర పెంపును ప్రతిపాదిస్తూ.. రూ.2.23లక్షలుగా ప్రతిపాదించారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి గతంలో 9.2% ఫీజును పెంచగా.. ఈసారి 48.8% పెంపును ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

కాలేజీ పేరు	2019 ఫీజు	2022 ఫీజు	2025 ప్రతిపాదిత ఫీజు
సీబీఐటీ	1.34	1.65	2.23
వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి	1.31	1.35	2.20
వాసవి	1.30	1.40	2.15
ఎంజీఐటీ	1.08	1.60	2

(లక్షల్లో)

పీజీ ఈసెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీజీఈసెట్-2025 నోటిఫికేషన్‌ను జేఎన్‌టీయూ అధికారులు బుధవారం విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ అరుణకుమారి తెలిపారు. ఆపై ఆలస్య రుసుం 250తో మే 22 వరకు, రూ.1,000తో 30వరకు, రూ.5,000తో జూన్ 2 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. పీజీఈసెట్ పరీక్షలు జూన్ 16 నుంచి 19 వరకు జరుగుతాయని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను జూన్ 7వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ వెల్లడించారు. 19 కోర్సుల్లో ప్రవేశాలకు పీజీఈసెట్ నిర్వహిస్తుండగా, 10 కోర్సుల్లో సీట్ల సంఖ్యకంటే ప్రవేశపరీక్షకు వచ్చిన దరఖాస్తులే తక్కువగా ఉండడం గమనార్హం.

నడకలో రెండేళ్ల బుడతడి రికార్డు

- 47 నిమిషాల్లో 3.23 కిలోమీటర్లు నడిచిన రుద్రాన్ష్‌రెడ్డి
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నమోదు



పటాన్‌చెరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పసిప్రాయంలో బుడిబుడి అడుగులతో ఓ బుడతడు ఏకంగా రికార్డు సృష్టించాడు. పటాన్‌చెరుకు చెందిన అపురూప, సత్యనారాయణ దంపతుల కుమారుడు రుద్రాన్ష్‌రెడ్డి.. 22 నెలల 24 రోజుల వయసులో 47 నిమిషాల వ్యవధిలో ఎక్కడా విశ్రాంతి తీసుకోకుండా, ఏకబిగిన 3.23 కిలోమీటర్లు నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. చిన్నారి నడక వీడియోలను ఆన్‌లైన్ ద్వారా పోస్టు చేయడంతో రికార్డు నిర్వాహకులు రుద్రాన్ష్ ప్రతిభను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేశారు. ఈ మేరకు ప్రశంసా పత్రం, మెడల్‌ను పంపారు. సంగారెడ్డిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాత నరేందర్‌రెడ్డి తర్ఫీదుతోనే తమ చిన్నారి ఈ రికార్డు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. రుద్రాన్ష్ మరిన్ని రికార్డులు నమోదు చేసేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, అలసిపోకుండా ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో గిన్నిస్ రికార్డు నమోదు చేయడమే లక్ష్యంగా రుద్రాన్ష్‌కు శిక్షణ ఇప్పిస్తామని తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కోటరీ వల్లే జగన్‌కు దూరం

- వైసీపీలో అవమానాలు.. నా మనసు విరిగి పోయింది
- ఆయన మనసులో నాకు స్థానం లేదు
- ఎవరికీ భయపడను.. దేవుడంటేనే భయం: విజయసాయి

విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైసీసీ అధినేత జగన్ చుట్టూ ఉన్న కోటరీ వల్లే ఆ పార్టీని వదిలి బయటకు వచ్చానని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తెలిపారు. వైసీపీలోని ద్వితీయశ్రేణి నాయకులు తనకు, అధినేత జగన్‌కు మధ్య అభిప్రాయ భేదాలు సృష్టించారని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. జగన్ మనస్సు విరిచి ఆయననుంచి తనను దూరం చేయడంలో వారు విజయం సాధించారన్నారు. మూడున్నరేళ్లలో అవమానాలు ఎదుర్కొని తాను దిగిన ప్రతి మెట్టులోను చాలామంది పాత్రధారులు, సూత్రధారులు ఉన్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ నుంచి బయటకు రావడం వల్ల తాను ఏవిధంగాను నష్టపోలేదన్నారు. ఆ పార్టీలో ఉన్నంత కాలం చిత్తశుద్ధితో పనిచేశానని, అక్కడినుంచి బయటకు వచ్చినా జగన్ బాగుండాలని కోరుకుంటున్నానని తెలిపారు. అయితే, చుట్టూ ఉండే కోటరీ నుంచి బయటపడినప్పుడే జగన్‌కు భవిష్యత్తు ఉంటుందని, ఇంతకన్నా తాను చెప్పగలిగిందేమీ లేదన్నారు. "బయటినుంచి వెళ్లే సమాచారం తనకు అనుకూలంగా ఉంటున్నప్పుడు, ఆర్థికంగా, రాజకీయంగా తనకు లాభం ఉందనుకున్న వారిని మాత్రమే జగన్ వద్దకు కోటరీ పంపుతుంది. నాయకుడు చెప్పుడు మాటలను నమ్మకూడదు. వైసీపీలో ప్రస్తుతం అదే జరుగుతోంది." అని విజయసాయి వివరించారు. జగన్ మనస్సులో తనకు స్థానం లేదని తెలిసినప్పుడు మనస్సు విరిగిపోయిందని, ఇక వైసీపీలో కొనసాగాల్సిన అవసరం లేదని జగన్‌కు చెప్పి వచ్చేశానన్నారు. తిరిగి వైసీపీలో చేరే ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. సీఐడీ అధికారుల ఎదుట ఏ విషయాలు చెప్పానో, భవిష్యత్తులోను భగవంతుడి సాక్షిగా అవే విషయాలు చెబుతానని విజయసాయి వ్యాఖ్యానించారు. .

మద్యం స్కామ్ సూత్రధారి కసిరెడ్డే...

గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మద్యం కుంభకోణం సూత్రధారి అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని ఇంతకుముందు చెప్పానని, భవిష్యత్తులో మరిన్ని వివరాలు చెప్పాల్సివచ్చినా కచ్చితంగా చెబుతానన్నారు. "భయం అనేది నా రక్తంలో లేదు. జగన్ మీద ఇంతకుముందు భక్తి, ప్రేమ ఉండేవి. ప్రస్తుతం అవి దేవుడి మీద మాత్రమే ఉన్నాయి. జగన్ నాకు చాలా పదవులు ఇచ్చారు. కానీ, అక్కడ పొందిన అవమానాలు, ఇబ్బందులతో మనస్సు విరిగిపోయింది. నేను ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు. ఆత్మగౌరవం, విశ్వసనీయతను కోల్పోలేదు. జగన్‌లోనే మార్పు వచ్చింది." అని విజయసాయి అన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూములపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన సర్కారు.. వివరాలు సేకరించి నివేదిక రూపొందిస్తున్న అధికారులు

- నిషేధిత భూముల జాబితాలో, రికార్డుల్లో తేడాల గుర్తింపు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/షాద్‌నగర్/నందిగామ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు భూముల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన కథనం కలకలం రేకెత్తించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. భూసేకరణ ఎలా చేశారు? ఎంత భూమిని సేకరించారు? భూసేకరణ చేసే సమయంలో నిబంధనలు ఏం పెట్టారు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిధులు ఇచ్చాయి? ఎన్ని నిధులు దుర్వినియోగమయ్యాయి? కేంద్రం ఆదేశించిన తరువాత ఎంత భూమిని ధరణిలో నిషేధిత జాబితాలో పెట్టారు? ప్రస్తుతం ఆ జాబితాలో లేని భూమి ఎంత? వంటి వివరాలతో నివేదిక పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై రెవెన్యూ అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. హైదరాబాద్ టెక్స్‌టైల్ పార్కు కోసం రాజధాని శివార్లలోని నందిగామ మండలం చేగూర్‌లో 22 ఏళ్ల క్రితం సేకరించిన 142 ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నట్లు వారి పరిశీలనలో వెల్లడైంది. ధరణికి ముందు, తరువాత.. నిషేధిత జాబితాలో పెట్టిన భూముల వివరాల మధ్య కూడా వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కాగా.. దుర్వినియోగమైన రూ.కోట్ల నిధులను రాబట్టే విషయంలో బెంగుళూరు ఆర్బిట్రరీలో కేసు నడుస్తున్నట్లు ప్రభుత్వానికి వారు సమాచారం అందించారు.

మా భూములు మాకివ్వండి

టెక్స్‌టైల్ పార్కు కోసం తమ వద్ద సేకరించిన వ్యవసాయ భూములను తమకు అప్పగించాలని, లేదా టెక్స్‌టైల్ పార్కు అయినా నిర్మించి ఉద్యోగావకాశాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 'నిషేధిత భూమికి రెక్కలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అక్కడి రైతులు స్పందించారు. హైదరాబాద్ టెక్స్‌టైల్ పార్కు సొసైటీ పేరుతో కొందరు వ్యక్తులు తమవద్ద నుంచి భూములను తీసుకున్నారని తెలిపారు. తమ భూములు ఇవ్వడానికి నిరాకరిస్తే ఆర్డీవో చేత నోటీసులు జారీ చేయించి మరీ తమ భూములు లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము భూములు కోల్పోయినప్పటికీ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తే తమ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగంతో పాటు, తమ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్న ఆశతో భూములను విక్రయించామన్నారు. అప్పట్లో ఎకరాకు రూ.80వేల నుంచి రూ.3 లక్షల వరకూ ఇచ్చారని.. 20 ఏళ్లు గడుస్తున్నా నేటికీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయలేదని, ఇప్పుడా భూముల ధర రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల దాకా పలుకుతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఆ భూములే తమవద్ద ఉండి ఉంటే తమ కుటుంబాలు బాగుపడేవన్నారు. తమ భూములు తమకు అప్పగించాలని కోరుతూ తామంతా రెవెన్యూ అధికారుల చుట్టూ, టెక్స్‌టైల్ పార్కు సొసైటీ సభ్యులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండట్లేదని వాపోయారు. ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడాన్ని వారు అభినందించారు.

20 ఏళ్లుగా బాధపడుతున్నాం



భూముల కొనుగోలు కోసమే టెక్స్‌టైల్ పార్కు పేరుతో సొసైటీని ఏర్పాటు చేశారు. మమ్మల్ని భయపెట్టి మా భూములు కొన్నారు. ఇన్నేళ్లుగా ఆ పొలాలను పడావు పెట్టారు. భూములు ఇచ్చి తప్పు చేశామని 20 ఏళ్లుగా బాధపడుతున్నాం. ఇప్పుడా భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయో కూడా తెలియడం లేదు. దీనిపై మేం ఎవరిని సంప్రదించినా తమకు సంబంధం లేదని దాటవేస్తున్నారే తప్ప పరిష్కారం చూపట్లేదు. టెక్స్‌టైల్ పార్కు భూముల వివరాలను అధికారులు రైతులకు తెలపాలి. ఆ పార్కు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

\- ఎం.ప్రభాకర్, రైతు, చేగూర్

విక్రాంత్‌రెడ్డే చేశాడు

- కాకినాడ సీ పోర్టు 'డీల్'లో సూత్రధారి
- కేవీ రావు-శరత్‌చంద్రారెడ్డి షేర్ల బదిలీ
- వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ ఆయనే
- పోర్టు 'వ్యవహారం'లో నా ప్రమేయం లేదు
- సీఐడీ విచారణ తర్వాత విజయసాయి



విజయవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు ప్రైవేటు లిమిటెడ్ 'వ్యవహారం'లో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డే సూత్రధారని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి వెల్లడించారు. కేవీ రావు, అరబిందో కంపెనీ శరత్‌చంద్రారెడ్డి షేర్ల 'డీల్'లో విక్రాంత్‌రెడ్డి కర్త, కర్మ, క్రియగా వ్యవహరించారన్నారు. బుధవారం విజయవాడకు సమీపంలో కానూరులోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. అనంతరం బయటకు వచ్చిన తర్వాత విజయసాయి మీడియాతో మాట్లాడారు. సీ పోర్టు వాటాలు లాక్కోవడంలో ఆది నుంచి చివరి వరకు తన ప్రమేయం లేదని స్పష్టంగా చెబుతున్నానన్నారు. కేవీ రావు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై సీఐడీ అధికారులు విచారించారని తెలిపారు. "కేవీ రావు తెలుసా? అని అధికారులు ప్రశ్నించారు. ఆయనతో ముఖ పరిచయం ఉంది తప్ప, ఎలాంటి సామాజిక, రాజకీయ, ఆర్థిక సంబంధాలు లేవని అధికారులకు స్పష్టం చేశాను. అరబిందో కంపెనీ నుంచి సుమారుగా రూ.500 కోట్ల బదిలీ జరిగిన విషయంపై ప్రశ్నించారు. దాని గురించి ఎవరూ నాకు చెప్పలేదని, తెలియదని సమాధానం ఇచ్చాను. నా కుమార్తెను అరబిందోకు చెందిన కుటుంబంలో ఇచ్చానని, ఆ కంపెనీకి సంబంధించిన ఆర్థిక, వ్యాపార వ్యవహారాల్లో నేను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని తెలిపాను. విక్రాంత్‌రెడ్డి తెలుసా అని అధికారులు అడిగారు. వైవీ సుబ్బారెడ్డి కుమారుడిగా నాకు తెలుసునని చెప్పాను. సీ పోర్టు వ్యవహారాల్లో జరిగిన లావాదేవీలు నేను, విక్రాంత్‌రెడ్డి కలిసి చేశామా? అని అధికారులు ప్రశ్నించారు. ఈ విషయంలో నా ప్రమేయం ఏమాత్రం లేదని చెప్పాను. ఆరోపణలు వచ్చిన కేసులో నా పేరు ఎందుకు చేర్చారని కొంత మంది కామన్ స్నేహితుల ద్వారా అడిగించాను. ఒక అధికారి ఆదేశాలతో నా పేరు చేర్చానని కేవీ రావు కామన్ స్నేహితుడికి చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి, కేవీ రావు అత్యంత ఆప్త మిత్రులని సీఐడీకి వివరించాను. విక్రాంత్‌రెడ్డిని కేవీ రావుకు నేను పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సుబ్బారెడ్డి ఎప్పుడు కాలిఫోర్నియాకు వెళ్లినా కేవీ రావుకు చెందిన రాజభవనంలో నివసిస్తారు. సీ పోర్టు వ్యవహారాన్ని ఆది నుంచి అంతిమం వరకు విక్రాంత్‌రెడ్డి నడిపించారని కేవీ రావు కామన్ స్నేహితులకు చెప్పారు. ఇదే విషయాన్ని సీఐడీకి వివరించాను" అని వెల్లడించారు. ఈడీ పది కేసులతో పాటు సీబీఐ 11 కేసుల్లో అప్పటి జేడీ లక్ష్మీనారాయణ తనను ఏ2గా పెట్టారు కాబట్టి కాకినాడ సీ పోర్టు కేసులోను ఏ2గా చేర్చారని విజయసాయి అన్నారు. తనకు ఏ2ను స్థిరం చేశారని వ్యాఖ్యానించారు. కాకినాడ సీ పోర్టు వ్యవహారంలో జగన్ లబ్ధిదారుడని, ఆయనను పక్కకు తప్పించడానికి తాను, విక్రాంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నామని సీఐడీ అధికారులు ప్రశ్నించారని తెలిపారు. ఆ విషయాలు ఏవీ తనకు తెలియవని చెప్పానన్నారు.. జగన్‌కు ఈ డీల్‌లో సంబంధం ఉందా అని అధికారులు అడగ్గా, ఆయనకు సంబంధం లేదని చెప్పానని వివరించారు.

సీఎం రేవంత్‌పై తిట్ల దండకం

- తెలంగాణ భవన్‌లో రికార్డింగ్
- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- చంచల్‌గూడ జైలుకు జర్నలిస్టు రేవతి
- రిపోర్టర్ సంధ్యకు కూడా 14రోజుల రిమాండ్
- పరారీలో మరో ముగ్గురు: అదనపు సీపీ
- అరెస్టును ఖండించిన కేటీఆర్



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీతో కలిసి.. తెలంగాణ భవన్‌లో రికార్డింగ్ చేసి.. సీఎం రేవంత్ రెడ్డిపై తిట్ల దండకంతో వీడియోను విడుదల చేసిన జర్నలిస్టు రేవతి, ఆమెతో కలిసి పనిచేసే రిపోర్టర్ సంధ్యను హైదరాబాద్ సైబర్‌క్రైమ్స్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీసు అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ వివరాలను వెల్లడించారు. మాదాపూర్‌కు చెందిన పొగడదండ రేవతి నానక్‌రామ్‌గూడలో 'పల్స్' పేరుతో యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తున్నారు. ఈమె కొత్తూరుకు చెందిన బండి సంధ్య అలియాస్ తన్వీయాదవ్‌ను తన వద్ద రిపోర్టర్‌గా నియమించుకున్నారు. గత నెల తెలంగాణ భవన్‌లో ఓ వ్యక్తితో సీఎం రేవంత్‌పై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయిస్తూ రికార్డ్ చేసిన వీడియోను.. పల్స్ చానల్ ద్వారా వైరల్ చేయించారు. అమెరికా నుంచి 'నిప్పుకోడి' హ్యాండిల్‌తో ఓ వ్యక్తి ఈ వీడియోను పోస్టు చేసినట్లు విశ్వప్రసాద్ తెలిపారు. దీనిపై కాంగ్రెస్ సోషల్‌మీడియా సెల్ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ఐటీ చట్టంలోని సెక్షన్లు 111, 61(2), బీఎన్ఎస్‌లోని 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐదుగురిపై కేసు పెట్టారు. ప్రధాన నిందితురాలిగా రేవతి, ఏ2గా సంధ్య, ఏ3గా వీడియోలో సీఎం రేవంత్‌ను దుర్భాషలాడిన వృద్ధుడు, ఏ4గా కెమెరామన్, ఏ5గా అమెరికా నుంచి ఎక్స్‌లో పోస్టు చేసిన వ్యక్తిని నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. రేవతి, సంధ్యలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని, మిగతా నిందితులు పరారీలో ఉన్నారని, అమెరికాలో ఉన్న వ్యక్తిపై లుక్‌ఔట్ నోటీసు జారీ చేశామని విశ్వప్రసాద్ చెప్పారు. రేవతికి బీఆర్ఎస్ నాయకులతో సంబంధాలున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. ఈమెపై గతంలో రెండు కేసులున్నట్లు వివరించారు. రేవతి, సంధ్యను నాంపల్లి కోర్టులో హాజరుపరచగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్, నిందితుల తరఫు న్యాయవాది మధ్య వాదోపవాదాలు జరిగాయి. ప్రజా సమస్యలను ప్రసారం చేసే హక్కు మీడియాకు ఉంటుందని, ఓ రైతు ఆవేదనను ప్రసారం చేసినందుకు తమపై కేసులు పెట్టి, వేధిస్తున్నారని నిందితుల తరఫు న్యాయవాది వాదనలను వినిపించారు. ఈ వాదనలను పీపీ తప్పుబట్టారు. గత నెల బీఆర్ఎస్ భవన్‌లో ఓ వృద్ధుడితో ఉద్దేశపూర్వకంగా సీఎం రేవంత్ ప్రతిష్ఠ మసకబారేలా తిట్టించారని ఆరోపించారు. రేవంత్‌కు వ్యతిరేకంగా కుట్రపన్ని, ఈ నెల 10 నుంచి ఆ వీడియోను వ్యూహాత్మకంగా వైరల్ చేశారని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న జడ్జి.. రేవతి, సంధ్యకు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు వారిని చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. కాగా.. రేవతి అరెస్టును కేటీఆర్ ఖండించారు. యువ జర్నలిస్టు సంధ్య అరెస్టు దారుణమన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

విభిన్న కోణాలను స్పృశిస్తుంది



రామ్‌జగదీష్

నూతన దర్శకుడు రామ్‌జగదీష్ తెరకెక్కించిన చిత్రం 'కోర్ట్'. ప్రియదర్శి కథానాయకుడిగా నటించారు. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్ మీడియాతో ముచ్చటించారు.

"నా జీవితంలో చూసిన ఓ కేసు తాలూకా విషయాలు నన్ను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఆ ఇతివృత్తంతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. అలా, వాస్తవ సంఘటనలకు కొంత కల్పన జోడించి ఈ సినిమా కథను తయారుచేశాను. పోక్సో యాక్ట్ నేపథ్యంలో ఉంటుంది. నానికి ఈ కథను చెప్పడం కోసం ఎనిమిది నెలలు ఎదురుచూశాను. ఆయన సింగిల్ సిట్టింగ్‌లో ఓకే చేశారు. ఇది లవ్ స్టోరీతో కూడిన కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో ప్రియదర్శి పోషించిన లాయర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. ఆయన కెరీర్‌లో గొప్ప పాత్రగా నిలిచిపోతుంది. రోషన్, శ్రీదేవి తమ పాత్రలకు న్యాయం చేశారు. ఈ సినిమా మన జీవితాల్లోని పలు కోణాల్ని టచ్ చేస్తుంది. ఫైనల్ అవుట్‌పుట్ చూసిన నాని సినిమా చాలా బాగుందని మెచ్చుకున్నారు" అని చెప్పారు.

మీరు గర్వించే సినిమాలు చేస్తా

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రుబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి... సారెగమ సంస్థతో కలసి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "మీరు నాపై చూపే అభిమానానికి రుణపడి ఉంటాను. ఇకపై మీ అందరూ గర్వపడే సినిమాలు చేస్తానని మాటిస్తున్నా. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలనుకునే ఔత్సాహికులకు నా వంతు సాయం చేస్తా. ఈ సినిమా విజయంపై చాలా నమ్మకంతో ఉన్నాం. ఈ ఏడాది 'హోలీ'ని థియేటర్స్‌లో సెలబ్రేట్ చేసుకుందాం. సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఇదో క్లీన్ కమర్షియల్ సినిమా. సినిమా ఏ స్థాయి విజయం సాధిస్తుందో ఇప్పుడే చెప్పలేను కానీ మీరు కోరుకున్న వినోదం అయితే కచ్చితంగా ఉంటుంది" అని చెప్పారు. "ఈ సినిమాలోని ప్రతీ అంశం మీ అందర్నీ అలరిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని విశ్వకరుణ్ అన్నారు. "ఈ సినిమాలో అంజలి అనే పాత్రలో నటించా. ఇలాంటి విభిన్న షేడ్స్ ఉన్న రోల్ దొరకడం నా అదృష్టం" అని హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ తెలిపారు. "ఈ సినిమాతో టీమ్ అందరికీ సక్సెస్ పక్కా" అని చిత్రనిర్మాత రాకేష్ రెడ్డి అన్నారు.

ఆద్యంతం ఉత్కంఠభరితం



రుషికిరణ్, శివయాదవ్, శ్వేత, రూప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సస్పెక్ట్'. రాధాకృష్ణ దర్శకత్వంలో కిరణ్‌కుమార్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ "ఓ అమ్మాయి హత్య చుట్టూ సాగే కథ ఇది. హంతకులు ఎవరు?, వారిని పట్టుకొనేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది" అని చెప్పారు. "ఈ సినిమా మా అందరికీ మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది" అని చిత్రనిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: రాఘవేంద్ర, సంగీతం: ప్రజ్వల్ క్రిష్

ఏప్రిల్‌లో గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం



దిల్‌రాజు

వచ్చే నెలలో గద్దర్ తెలంగాణఫిల్మ్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్‌రాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం 2014నుంచి 2023 వరకు పదేళ్ల కాలంలో వచ్చిన చిత్రాలలో ప్రతి ఏడాది ఒక ఉత్తమ సినిమా ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. బుధవారం మాసాబ్‌టాంక్‌లోని సంస్థ కార్యాలయంలో దిల్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ ఉర్దూలో వచ్చిన సినిమాలకు ప్రత్యేకంగా 'ఉత్తమ సినిమాఉర్దూ' అవార్డు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ప్రముఖ సినీ దర్శకులు బి.నర్సింగ్ రావు అధ్యక్షతన రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన విధి విధానాల రూపకల్పన కమిటీ సిఫారసుల మేరకు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నంది అవార్డుల తరహాలోనే సినీ రంగంలోని వివిధ విభాగాల్లో ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు వివరించారు. గత ప్రభుత్వం సింహ పేరుతో ఫిల్మ్ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ప్రకటించడంతో పలువురు చలనచిత్ర పరిశ్రామిభివృద్ధి సంస్థకు దరఖాస్తులతో పాటు కట్టిన డబ్బులను తిరిగి వాపస్ ఇవ్వనున్నట్టు దిల్‌రాజు పేర్కొన్నారు. 2024లో తెలుగు చలన చిత్ర పరిశ్రమ రంగంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ఇవ్వనున్నట్లు వివరించారు. దరఖాస్తులు అందిన తర్వాత గద్దర్ అవార్డ్స్ కోసం ఏర్పాటైన జ్యూరీ కమిటీ ఒక వారం రోజుల్లో అవార్డు విజేతలను ఖరారు చేస్తుందన్నారు. డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి పేరిట ఉత్తమ ప్రజాదరణ చిత్రానికి అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అలాగే పైడిజయరాజు,కాంతారావుల పేరిట ప్రత్యేక అవార్డులు అందించనున్నట్టు తెలిపారు.

ముప్పై ఏళ్లలో మూడుసార్లు కిడ్నీ మార్పిడి

- మూత్రపిండ మార్పిడి తర్వాత స్టార్టప్‌తో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మరో వ్యక్తి
- 'వరల్డ్ కిడ్నీ డే' సందర్భంగా స్టార్ ఆస్పత్రిలో అలాంటివారితో ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లలో మూడుసార్లు కిడ్నీ మార్పిడి చేయించుకుని సాధారణ జీవితం సాగిస్తున్న వ్యక్తి ఒకరు. పాతికేళ్లయినా నిండక ముందే మూత్రపిండ మార్పిడి చేయించుకుని.. ఆ తర్వాత ఒక స్టార్టప్‌ను ప్రారంభించి ఎందరికో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి మరొకరు. గురువారం 'వరల్డ్ కిడ్నీ డే' సందర్భంగా.. ఇలాంటి స్ఫూర్తిదాయక జీవితాలను గడుపుతున్నవారితో నానక్‌రామ్ గూడలోని స్టార్ ఆస్పత్రి వైద్యులు బుధవారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆస్పత్రి ఎండీ మన్నం గోపీచంద్, నెఫ్రాలజీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ గందే శ్రీధర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 40 ఏళ్లు దాటినవారంతా తరచూ వైద్యపరీక్షలు చేయించుకుని ఎప్పటికప్పుడు తమ ఆరోగ్య పరిస్థితి గురించి తె లుసుకోవాలని డాక్టర్ మన్నం గోపీచంద్ సూచించారు. కిడ్నీ సమస్యలను సత్వరమే గుర్తించి చికిత్స చేయించుకుంటే.. పరిస్థితి మార్పిడి వరకూ రాకుండా జాగ్రత్తపడొచ్చని ఆయన పేర్కొన్నారు.


నానక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైద్యులు, కిడ్నీ మార్పిడి బాధితులు

ఎన్నో కష్టాలు..

ఎన్ఎండీసీలో పనిచేసిన సాహూ అనే వ్యక్తి 30 ఏళ్లలో మూడుసార్లు కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. మరో రెండు నుంచి మూడేళ్లపాటు ఆస్పత్రిలో డయాలసిస్ ఇచ్చారు. మొదట సోదరుడు, రెండోసారి తల్లి ఆయనకు కిడ్నీ దానం చేశారు. తల్లి ఇచ్చిన కిడ్నీతో దాదాపు 11ఏళ్ల పాటు జీవనం సాగించారు. అదీ పాడవడంతో మరో రెండున్నరేళ్లపాటు డయాలసిస్ చేయించుకుంటూ జీవనం గడిపారు. మూడోసారి బయటి దాత నుంచి సేకరించి మార్పిడి చేశారు. ఆ కిడ్నీని అమర్చి, రక్తనాళాలకు అనుసంధానం చేయడం వైద్యులకు సవాల్‌గా మారినా.. ఎట్టకేలకు విజయవంతమైంది.

సొంత స్టార్టప్‌తో ఆదర్శంగా

రవితేజ (30) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఎనిమిదేళ్ల క్రితం కిడ్నీలు విఫమయ్యాయి. రెండున్నరేళ్ల పాటు ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. ఆయన తల్లి కిడ్నీ దానానికి ముందుకొచ్చినప్పటికీ బ్లడ్ గ్రూపులు వేరు కావడంతో.. ఏబీవోఐ(ఏబీవో ఇన్‌కంపాటబుల్) పద్ధతిలో మార్పిడి చేశారు. ఎనిమిదేళ్లుగా ఆయన సాధారణ జీవితం గడుపుతున్నారు. మొదట్లో కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసి.. తర్వాత సొంతంగా స్టార్టప్‌ను ప్రారంభించి ఇప్పుడు అనేక మందికి వైద్యులు, ఇంజనీర్లకు సేవలు అందిస్తున్నారు. ఇక.. ఎస్‌వీసీ శ్రీతేజ (35) అనే మరో వ్యక్తి కిడ్నీ మార్పిడి తర్వాత.. ఎనిమిదేళ్లుగా మారథాన్లలో చురుగ్గా పాల్గొంటూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 'ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని అప్రమత్తంగా ఉంటే నా పరిస్థితి కిడ్నీ మార్పిడి దాకా వచ్చేది కాదు' అన్నారాయన.

భూముల రీ సర్వేకు సన్నద్ధం

- సర్వే నంబర్లు, హద్దుల నిర్ధారణకు చర్యలు

జగిత్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనేక దశాబ్దాల తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సర్వే అండ్ బౌండరీ యాక్ట్ 1923 ప్రకారం ప్రతి మూడు దశాబ్దాలకు ఈ సర్వేను నిర్వహించాల్సి ఉంటుంది. భూముల రీ సర్వే జరగకపోవడంతో తగాదాలు, భూ సమస్యలు పెరుగుతున్నాయి. భూములకు సంబంధించిన సరిహద్దు వివరాలు, సర్వే నంబర్లు, బై నంబర్లు సరిగా లేకపోవడం అధికారులకు తలనొప్పిగా మారింది. రికార్డుల్లో ఒక రకంగా, క్షేత్ర స్థాయిలో మరో రకంగా సరిహద్దులు ఉండటంతో వివాదాలు తలెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను అమల్లోకి తీసుకురావడానికి కాంగ్రెస్ సర్కారు ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా భూముల సరిహద్దులు, బై నంబర్లు, సర్వే నంబర్ల హద్దులను పక్కాగా నిర్ధారించనున్నారు. ఇందుకు సంబంధించి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లకు, సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

శాస్త్రీయ పద్ధతిలో రీ సర్వే..

మొదటగా రాష్ట్రంలోని ఒక్కో జిల్లాలో ఆరు గ్రామాలను ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా భూముల రీ సర్వే చేపట్టనున్నారు. ఆ గ్రామంలో ఏయే సర్వే నంబర్లలో ఎంత భూమి ఉంది..? ఎలాంటి భూమి ఉంది..? బై నంబర్లు ఎన్ని ఉన్నాయి..? ఒకే సర్వే నంబరుపై అసలు విస్తీర్ణం కంటే ఎక్కువగా రికార్డుల్లో నమోదై ఉందా..? సాగు యోగ్యం కాని భూముల వివరాలు, వివాదాస్పదంగా ఉన్న స్థలాల సమాచారం వంటి వివరాలతో సర్వే చేపట్టనున్నారు. భూముల రీ సర్వేను పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు శాటిలైట్ సహకారాన్ని తీసుకోవాలని యోచిస్తోంది. అన్ని జిల్లాలకు ఆధునిక సాంకేతికతతో కూడిన పరికరాలను ప్రభుత్వం అందించనుంది. ఇటీవల ఈ పరికరాలకు సంబంధించి టెండర్ ప్రక్రియను నిర్వ హించినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్న వెంటనే ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలకు సంబంధించిన భూముల పాత, కొత్త రికార్డులను అందుబాటులో ఉంచుకొని క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు.


జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలో సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల జిల్లాలో 6 గ్రామాల ఎంపిక..

జగిత్యాల జిల్లాలో భూ రీ సర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఆరు గ్రామాలను ఎంపిక చేశారు. కథలాపూర్ మండలంలోని పోసానిపేటలో 1,335.19 ఎకరాలు, బొమ్మెనలో 1,503.12, నాగమల్లప్పకుంటలో 136.06, ఊటుపల్లిలో 765.22, పెగ్గర్లలో 1,485, దూలూరులో 1,624, ఇప్పపల్లిలో 1,922 ఎకరాల భూమిని సర్వే చేయడానికి ఎంపిక చేశారు.

గ్రామాల ప్రతిపాదనలు పంపించాం



భూముల రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఆరు గ్రామాలను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయికి వెళ్లి భూముల రీ సర్వే చేపడతాం.

- వెంకట్‌రెడ్డి, ఏడీ.. సర్వే, ల్యాండ్ రికార్డ్స్, జగిత్యాల జిల్లా

మాంసం వండలేదని భార్యను కొట్టి చంపిన భర్త


కళావతి (ఫైల్)

సీరోలు (మహబూబాబాద్ జిల్లా), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాంసం వండలేదని కట్టుకున్న భార్యనే కొట్టి చంపాడో దుర్మార్గుడు. ఈ దారుణ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం బూరుగుచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాంజా తండాలో జరిగింది. మాంజాతండాకు చెందిన మాలోతు బాలుకు అదే తండాకు చెందిన కళావతి (38)తో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరు తండాలోనే నివాసముంటూ తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం తండాలో ఓ వృద్ధురాలు మృతి చెందగా, ఆమె అంత్యక్రియల అనంతరం ఓ గొర్రెపోతును కోసి, తలా కొంచెం మాంసాన్ని వారివారి ఇళ్లకు తీసుకుపోయారు. ఆ మాంసాన్ని ఇంటికి తీసుకువచ్చిన బాలు, వండాలని భార్య కళావతిని కోరాడు. అంత రాత్రి సమయంలో వంట విషయంలో కళావతి అభ్యంతరం చెప్పగా, అప్పటికే మద్యం మత్తులో ఉన్న బాలు ఆమెతో గొడవపడ్డాడు. అది కాస్తా తీవ్రంగా మారడంతో వారి ఇంటికి సమీపంలోనే ఉంటున్న కళావతి తల్లిదండ్రులు కలగజేసుకుని సర్దిచెప్పి, గొడవను సద్దుమణిగేలా చేశారు. వారు తిరిగి వెళ్లాక బాలు భార్యతో మళ్లీ గొడవపడి, తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళావతి తల్లిదండ్రులు కుమార్తె ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో కళావతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు బాలు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.



నరకొద్దు..
4,230 చెట్లను తరలిద్దాం


- సికింద్రాబాద్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లతో 9,194 చెట్లపై ప్రభావం
- వాటిల్లో కొన్ని చెట్ల ట్రాన్స్‌లొకేషన్‌కు హెచ్ఎండీఏ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉన్న చెట్లను నరికేస్తుంటారు. పర్యావరణానికి ముప్పు అని తెలిసినా అభివృద్ధికి ఆటంకంగా ఉందని చెట్లను తొలగిస్తుంటారు. అయితే, సికింద్రాబాద్‌లో ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఈ చెట్ల నరికివేత విషయంలో హెచ్ఎండీఏ కీలక నిర్ణయం తీసుకుంది. అవకాశం ఉన్న మేరకు వీలైనన్నీ చెట్లను వేరే ప్రాంతానికి తరలించి వాటిని బతికించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియనే ట్రాన్స్‌లొకేషన్ అంటారు. సికింద్రాబాద్‌లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణం వల్ల దాదాపు 9,194 చెట్లు ప్రభావితం అవుతున్నాయి. వీటిలో ట్రాన్స్‌లొకేషన్‌కు అనువుగా ఉన్న 4,230 చెట్లను మరో ప్రాంతానికి తరలించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. ఇందుకోసం రూ.7కోట్లు ఖర్చు చేయనుంది. ఈ స్థాయిలో ట్రాన్స్‌లొకేషన్ ప్రక్రియ చేపట్టడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. ఇక, అదే స్థానంలో ఉన్నా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణకు ఇబ్బంది లేని 2,314 చెట్లకు కొంత వరకు కొమ్మలు తొలగించనున్నారు. ఇక, ట్రాన్స్‌లొకేషన్‌కు అనువుగా లేని మరో 2,314 చెట్లను పూర్తిగా తొలగించనున్నారు. ట్రీ ప్రొటెక్షన్ కమిటీ చేసిన అధ్యయనం మేరకు ఆయా చెట్ల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయింది. మొత్తం 9,194 చెట్లలో హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు ఉన్న ప్రాంతంలోనే 8,357 చెట్లు ఉన్నాయి. హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల ఉన్న డైరీ ఫామ్ రోడ్డు వరకు మరో 837 చెట్లు ఉన్నాయి. కాగా, ట్రాన్స్‌లొకేషన్ ప్రక్రియలో భాగంగా ఎంపిక చేసిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రత్యేక యంత్రాల ద్వారా చెట్లను వేర్లతో సహా భూవిని పెకలించి వాహనంలో ఎక్కించి మరో ప్రాంతానికి తరలిస్తారు. ఆ సమయంలో వేర్లకు ప్రత్యేక రసాయనాలు పూసి చెట్టు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎంపిక చేసిన ప్రాంతంలో ముందుగా సిద్ధం చేసిన గొయ్యిలో ఆ చెట్టును పాతి అది బతికేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. సికింద్రాబాద్‌లో ట్రాన్స్‌లొకేషన్‌కు ఎంపిక చేసిన చెట్ల కోసం అనువైన ప్రాంతాలను కూడా ఇప్పటికే ఎంపిక చేశారు. ట్రాన్స్‌లొకేషన్ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా మొదలైంది. వర్షాకాలంలో ట్రాన్స్‌లొకేషన్ పనులు నిర్వహించాలని హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.


విలేజ్ మార్ట్‌ల పేరుతో 18 కోట్లకు టోకరా

- బోర్డు తిప్పేసిన ప్రకృతి ఎంటర్‌ప్రైజెస్
- జిల్లా, మండల డీలర్‌షిప్ పేరిట వసూళ్లు
- మేనేజర్ పోస్టుకు రూ.5 లక్షల డిపాజిట్
- నెలకు రూ.లక్ష జీతమిస్తామంటూ దగా
- తెలుగు రాష్ట్రాల్లో వందలమంది బాధితులు
- సీసీఎస్‌లో 250 మంది ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విలేజ్ మార్ట్‌లు, సేంద్రియ (ఆర్గానిక్) ఉత్పత్తుల పేరుతో కోట్ల రూపాయలు పెట్టుబడులు సేకరించిన ప్రకృతి ఎంటర్‌ప్రైజెస్ బోర్డు తిప్పేసింది. తెలుగు రాష్ట్రాల్లో వందల మందిని నట్టేట ముంచింది. సుమారు 250 మంది బాధితుల ఫిర్యాదుతో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫ్రాంచైజీ, డీలర్‌షిప్, సెక్యూరిటీ డిపాజిట్ల పేరుతో సంస్థ ప్రతినిధులు రూ.18 కోట్లు వసూలు చేసి, మోసగించారని బాధితులు పేర్కొన్నారు. సూలూరు రాంప్రసాద్ అనే వ్యక్తి నెల్లూరు కేంద్రంగా ప్రకృతి ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించాడు. దాని సీఈవోగా చెప్పుకుంటూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గ్రామానికి చేరువ కావడం, అధిక నాణ్యతగల వస్తువుల ఉత్పత్తి చేయడం లక్ష్యమంటూ వివిధ మాధ్యమాల ద్వారా ప్రాచుర్యం పొందాడు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక రాబడి, ఆర్థిక భద్రత ఉంటుందని నమ్మించాడు. ఈ సంస్థకు డైరెక్టర్లుగా షేక్ జాఫర్ సాదిక్, మనుబోలు సురేష్, రాజాపురం శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు. వీరితో పాటు పదుల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తూ పెట్టుబడులు రాబట్టారు. జిల్లా డీలర్‌షిప్‌కు రూ.5 లక్షల నుంచి 10 లక్షలు, మండల డీలర్‌షిప్‌కు రూ.2.5 లక్షలు, ప్రకృతి విలేజ్ సూపర్ మార్కెట్ స్కీం కింద సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున వసూలు చేశారు. ఫ్రాంచైజీ మోడల్ కోసం రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లిస్తే.. కంపెనీ టర్నోవర్‌పై 10% కమిషన్ ఇస్తామని, నెలకు రూ.2.5 నుంచి 3 లక్షల వరకు లాభాలు ఉంటాయని నమ్మించారు. బ్రాంచి మేనేజర్ పోస్టు కోసం రూ.5 లక్షల డిపాజిట్ చెల్లిస్తే నెలకు రూ.లక్ష వేతనంతో పాటు ఇతర ప్రయోజనాలు ఉంటాయని వల విసిరారు. ఆన్‌లైన్‌లో ప్రచారానికి తోడు రెండు వెబ్‌సైట్లు ప్రారంభించి, అందులో సీఈవోతో పాటు డైరెక్టర్లు, మేనేజర్, ఇతర పోస్టుల్లోని వ్యక్తుల ఫొటోలు పెట్టారు. 2023న హైదరాబాద్ అమీర్‌పేటలో సంస్థ కార్యాలయాన్ని సినీ నటుడు అలీ, నటి హిమజను అతిథులుగా పిలిచి ప్రారంభోత్సవం చేశారు. తీరా వ్యాపార కార్యకలాపాలు చేపట్టకుండానే సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



ప్రకృతి ఎంటర్‌ప్రైజెస్ సీఈవో సూలూరు రాంప్రసాద్, డైరెక్టర్లు షేక్ జాఫర్ సాదిక్, రాజాపురం శ్రీనాథ్‌రెడ్డి, మనుబోలు సురేశ్



ప్రకృతి విలేజ్ మార్ట్ వెబ్‌సైట్

యూట్యూబర్ బయ్య సన్నీయాదవ్‌పై కేసు

- బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడంతో చర్యలు
- సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో సుమోటోగా నమోదు

నూతనకల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యూట్యూబర్ బయ్య సన్నీయాదవ్‌పై సూర్యాపేట జిల్లా నూతనకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల కేంద్రానికి చెందిన బయ్య సన్నీయాదవ్ ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాడు. అతడికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా యూట్యూబ్‌లో 40 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. సన్నీయాదవ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టాలని, తనకు బెట్టింగ్ ద్వారా నగదు వచ్చిందని వీడియోలు పోస్ట్ చేశాడు. అతడు పోస్ట్ చేసిన యాప్‌లో పెట్టుబడి పెట్టిన పలువురు యువకులు లక్షలాది రూపాయలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. దీంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సన్నీయాదవ్‌పై సుమోటోగా ఈ నెల 5న కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా కాసులకు కక్కుర్తిపడి అమాయకుల ప్రాణాలను తీస్తామంటే నడవదని సజ్జనార్ హెచ్చరించారు. ఈమేరకు ఆయన తన 'ఎక్స్' ఖాతాలో స్పందిస్తూ.. చట్టప్రకారం అటువంటివారు శిక్ష అనుభవించాల్సిందేనని తెలిపారు.


యూట్యూబర్ బయ్య సన్నీయాదవ్

పరీక్ష రాస్తుండగా ఊడిపడిన ఫ్యాన్

- కరీంనగర్‌లో ఇంటర్ విద్యార్థినికి గాయాలు
- చికిత్స చేయించి పరీక్షలు రాయించిన అధికారులు


గాయపడిన విద్యార్థిని శివాన్విత

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్ష రాస్తుండగా తిరుగుతున్న ఫ్యాన్ ఊడి కింద పడడంతో ఇంటర్మీడియట్ విద్యార్థినికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం కరీంనగర్‌లో జరిగింది. విద్యార్థిని శివాన్విత ఇంటర్ రెండో ఏడాది పరీక్షలను కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కళాశాలలో రాస్తోంది. ఆమె పరీక్ష రాస్తున్న గదిలో కొక్కెం ఊడిపోయి తిరుగుతున్న ఫ్యాన్ కింద పడింది. ఆ సమయంలో కింద ఉన్న శివాన్వితకు ఫ్యాన్ రెక్కలు తగలడంతో ఆమె ముక్కు, కన్ను కింది భాగాల్లో గాయాలయ్యాయి. స్పందించిన సిబ్బంది వెంటనే విద్యార్థినిని పరీక్షా కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థినిని మరో గదిలో కూర్చోబెట్టి అరగంట సమయాన్ని అదనంగా కేటాయించి పరీక్ష రాయించారు.

హుస్నాబాద్ ఎల్లమ్మగుడి భూములపై సర్వే చేయించండి: కొండా సురేఖ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ గుడికి సంబంధించి అక్కడి అధికారుల వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదులపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఎల్లమ్మగుడి భూములకు సంబంధించి ఫిర్యాదుదారులతో కలిసి జాయింట్ సర్వే చేయించాలని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. హుస్నాబాద్‌కు చెందిన సయ్యద్ రఫీ కుటుంబం కొన్నేళ్ల క్రితం ఎల్లమ్మగుడి పోషణ నిమిత్తం నాలుగు ఎకరాల నాలుగు గుంటల భూమిని దానం చేసింది. ఇంకా గుడి సమీపంలో వీరి సొంత భూమి ఉంది. అయితే, ఇటీవల కొంతమంది తాము గుడికి దానంగా ఇచ్చిన భూమిని కబ్జా చేస్తున్నారని ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని సయ్యద్ రఫీ మంత్రి సురేఖకు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి సర్వేకు ఆదేశించారు.

డీసీఎంఎస్‌లకు ఇన్‌చార్జుల జీవోపై స్టే

రాష్ట్రంలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) పాలక మండళ్ల గడువు గత నెలాఖరున తీరడంతో అదనపు కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జులుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 75పై హైకోర్టు స్టే విధించింది. గడువు తీరిన పాలక మండళ్ల డైరెక్టర్లు లేదా మేనేజింగ్ డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా ఖమ్మం వినహా.. మిగతా 8 ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు వేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.

అలకనంద కిడ్నీ రాకెట్ కేసులో ఒకరికి బెయిల్

అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్ కేసులో 13వ నిందితుడిగా ఉన్న డాక్టర్ పి.రాజశేఖర్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. పిటిషనర్ జనవరి 27 నుంచి జైల్లో ఉన్నారని.. అభియోగాలన్నీ ఆస్పత్రి యజమానులైన ప్రధాన నిందితులపైనే ఉన్నాయని.. పిటిషనర్ దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు పేర్కొంది.

అనుమతి లేకుండా.. కేటీఆర్ డ్రోన్ ఎగురవేశారు: ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ నిషేధిత ప్రాంతంలో ఉందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకట రమణారెడ్డి తదితరులు అనుమతి లేకుండా మేడిగడ్డ బ్యారేజీ వద్దకు వెళ్లడమే కాకుండా.. డ్రోన్ ఎగరేశారని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టుకు నివేదించారు. మేడిగడ్డపై డ్రోన్ ఎగురవేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్, తదితరులు హైకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. కేటీఆర్, తదితరుల చర్య.. అధికార రహస్యాల చట్టంలోని సెక్షన్ 2(8) కింద వస్తుందని, పిటిషనర్లు చట్టవిరుద్ధంగా నిషేధిత ప్రాంతంలోకి వచ్చారని పల్లె నాగేశ్వర్‌రావు కోర్టుకు వివరించారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. ఎవరో డ్రోన్ ఎగురవేస్తే.. దాన్ని పిటిషనర్లకు ఆపాదించడం సరికాదన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

కేటీఆర్‌పై కేసు కొట్టివేత

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనుమతి లేకుండా బాణసంచా కాల్చారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌పై ముషీరాబాద్ ఠాణాలో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ అధికారుల ఫిర్యాదుతో నమోదైన ఈ కేసులో.. ఎలాంటి బలమైన ఆధారాలు లేకపోవడంతో.. కేసును కొట్టివేస్తున్నట్లు హైకోర్టు బుధవారం స్పష్టం చేసింది.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి: జేఏసీ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం జరిగిన జేఏసీ కార్యవర్గ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. క్యాబినెట్ సబ్ కమిటీ మీటింగ్ వెంటనే ఏర్పాటు చేసి ఉద్యోగుల అన్ని సమస్యలపై చర్చించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కోరింది. సమావేశంలో జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి జనరల్ ఏలూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ట్రైబ్యునల్‌కు బలగం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ట్రైబ్యునల్-2తో పాటు అంతరాష్ట్ర జల వివాదాలపై సుప్రీంకోర్టులో వాదించడానికి అవసరమైన బలగాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. ప్రస్తుతం సీనియర్ అడ్వకేట్ సి.ఎస్.వైద్యనాథన్, వి.రవీందర్‌రావు, హరీష్ వైద్యనాథన్, నిఖిల్‌స్వామిలు ఉండగా.. సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్‌తో హరీష్ వైద్యనాథన్, నిఖిల్‌స్వామిని కొనసాగిస్తూ.. అదనంగా కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్, న్యాయవాది కుశ్విందర్ వోహ్రా సేవలు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు.

ఏపీ ఎప్‌సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

- ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే ఎప్‌సెట్-2025కు తెలంగాణ అభ్యర్థుల కోసం ఇక్కడా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కన్వీనర్ వి.వి.సుబ్బారావు తెలిపారు. ఏపీ ఎప్‌సెట్-2025 నోటిఫికేషన్ బుధవారం విడుదల చేసిన నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామని, అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ తెలిపారు. ఏపీ ఎప్‌సెట్ పరీక్షలు మే నెల 19 నుంచి 27 వరకు జరగనున్నాయి.

ఢిల్లీ ప్రత్యర్థి ఎవరో?



గార్డ్‌నర్ హర్మన్

- నేటి ఎలిమినేటర్‌లో ముంబై X గుజరాత్
- నెగ్గిన జట్టుకు ఫైనల్లో చోటు

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో నాకౌట్ సమరానికి సర్వం సిద్ధమైంది. త్రుటిలో నేరుగా ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకొన్న మాజీ చాంప్ ముంబై ఇండియన్స్.. గురువారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు.. శనివారం జరిగే టైటిల్ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. లీగ్ దశలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు నెగ్గిన ముంబై.. చివరి పోరులో బెంగళూరు చేతిలో ఓడింది. ఇక కీలక మ్యాచ్‌కు ముంబై జట్టులో ఎటువంటి మార్పులూ చేయడం లేదని సమాచారం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దూకుడైన బ్యాటింగ్ జట్టుకు ప్లస్ కాగా.. ఆల్‌రౌండర్‌గా హేలీ మాథ్యూస్ అదరగొడుతోంది. నాట్ సీవర్ బ్రంట్ ఎక్కువగా బ్యాటింగ్ భారాన్ని మోస్తోంది. షబ్నిం ఇస్మాయిల్, అమేలియా కెర్‌తోపాటు బ్రంట్ బంతితో ఆదుకొంటున్నారు. మరోవైపు గుజరాత్ కూడా దీటుగానే కనిపిస్తోంది. ఆడిన ఎనిమిది మ్యాచ్‌లో నాలుగు నెగ్గిన జెయింట్స్ మూడో స్థానంతో నాకౌట్ బెర్త్ పట్టేసింది. బెత్ మూనీ, హర్లీన్, లిచ్‌ఫీల్డ్, ఫుల్‌మాలి.. జెయింట్స్‌కు వెన్నెముకగా నిలుస్తున్నారు. కెప్టెన్ గార్డ్‌నర్ కూడా బ్యాట్‌ను ఝుళిపిస్తుండడం విశేషం. బౌలింగ్‌లో మేఘన, ప్రియా మిశ్రా, కష్వీ గౌతమ్ రాణిస్తున్నారు. లీగ్ దశలో రెండుసార్లు గుజరాత్‌పై నెగ్గిన ముంబై ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే, జెయింట్స్ ఈసారి గట్టిగా బదులు తీర్చుకోవాలనుకొంటోంది.

భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్


అబిద్ అలీ కన్నుమూత

అరంగేట్ర టెస్ట్‌లో ఉత్తమ బౌలింగ్

బంతి, బ్యాటుతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఘనత

ఆ తరంలో అత్యుత్తమ ఫీల్డర్





హైదరాబాద్: భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అబిద్ అలీ (83) మరణించారు. ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఉంటున్న ఆయన గుండె సంబంధిత సమస్యతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు సంతానం. ఓ కుమారుడు, కుమార్తె. అలీ కుమారుడు..భారత జట్టు మాజీ కీపర్ సయ్యద్ కిర్మాణీ అల్లుడు. కాగా, కుమారుడు కాలిఫోర్నియాలో క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మరణించాడు. ఇక, 1941లో హైదరాబాద్‌లో జన్మించిన అబిద్ అలీ..1967లో బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాపై టెస్ట్ అరంగేట్రం చేశారు. కుడిచేతి వాటం పేస్ బౌలర్ అయిన అబిద్ తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన చేశారు. ఆ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకు 6 వికెట్లు పడగొట్టారు. అప్పట్లో అరంగేట్రంలో అత్యుత్తమ బౌలింగ్ చేసిన భారత బౌలర్‌గా రికార్డు నెలకొల్పారు. అలీ 29 టెస్ట్‌ల్లో 47 వికెట్లు పడగొట్టారు. ఈ టెస్ట్‌ల్లో ఏడు మ్యాచ్‌ల్లో అబిద్ అలీ బౌలింగ్‌తోపాటు, బ్యాటర్‌గా భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించడం అరుదైన విషయం. 1974లో వన్డేల్లోకి అడుగుపెట్టిన ఆయన 1975 ప్రపంచకప్ ఆడారు. మొత్తం 5 వన్డేల్లో 7 వికెట్లు తీశారు.

ధైర్యవంతుడైన క్రికెటర్..

అబిద్ అలీ ధైర్యవంతుడైన క్రికెటర్. ఆల్‌రౌండర్, మిడిలార్డర్ బ్యాటర్ అయినా..జట్టుకు అవసరమైన సందర్భాలలో ఓపెనర్‌గా దిగారు. లెగ్‌సైడ్‌లో కళ్లు చెదిరే క్యాచ్‌లు పట్టారు. టెస్ట్ మ్యాచ్‌లో తొలి బంతికే రెండుసార్లు వికెట్లు సాధించిన అరుదైన ఘనత ఆయన సొంతం.

- సునీల్ గవాస్కర్

అబిద్ కెరీర్ ఇలా..

బౌలర్‌గా: టెస్ట్‌లు-29, వికెట్లు-47, బెస్ట్-6/55. వన్డేలు- 5, వికెట్లు-7, ఉత్తమ బౌలింగ్-2/22.
బ్యాటర్‌గా: టెస్ట్‌లు-29, పరుగులు-1018. వన్డేలు-5, పరుగులు-93, అత్యధికం-70.

హైదరాబాద్ దిగ్గజం

1956లో హైదరాబాద్ స్కూల్స్‌కు ఆడడం ద్వారా అబిద్ క్రికెట్‌కు శ్రీకారం చుట్టారు. కేరళ జట్టుపై 82 పరుగులు చేసిన అలీ ఉత్తమ ఫీల్డర్ అవార్డును అందుకున్నారు. కొన్నేళ్ల తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో చేరారు. తొలుత వికెట్ కీపర్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఆయన తర్వాత బౌలర్‌గా మారారు. 1958-59లో హైదరాబాద్ జూనియర్ జట్టుకు ఆడిన అలీ మరుసటి ఏడాది రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో రంజీ ట్రోఫీలో సెంచరీ సాధించిన అలీకి ఆ ఏడాది ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించిన భారత జట్లలో చోటు దక్కింది. ఆసీస్ టూర్ తొలి టెస్ట్‌లో కెప్టెన్ ఎంఏకే పటౌడీ గాయంతో వైదొలగడంతో అలీకి తుది జట్టులో చోటు లభించింది. ఆ మ్యాచ్‌లో 6 వికెట్లతో ఉత్తమప్రదర్శన చేశాడు. మూడో టెస్ట్‌లో ఓపెనర్‌గా దిగిన అబిద్ 47 రన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆపై నాలుగో, చివరి టెస్ట్‌లో వరుసగా 81, 78 రన్స్ చేశారు.

చారిత్రక విజయాలలో..: 1971లో వెస్టిండీస్‌లో పర్యటన భారత జట్టు టెస్ట్ చరిత్రలో మైలురాయి. 5 మ్యాచ్‌ల ఆ సిరీస్‌ను భారత్ 1-0తో గెలిచింది. అప్పట్లో అత్యంత బలమైన విండీస్‌పై భారత్ నెగ్గిన తొలి టెస్ట్‌తోపాటు మొదటి టెస్ట్ సిరీస్ విజయం కావడం విశేషం. 1971లో ఇంగ్లండ్‌లో పర్యటన కూడా భారత్‌కు చరిత్రాత్మకం. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో నెగ్గింది. ఇంగ్లండ్‌పై మనకది తొలి టెస్ట్ సిరీస్ విజయం. భారత్ గెలిచిన ఓవల్ టెస్ట్‌లో విజయానికి అవసరమైన పరుగులను అబిద్ చేయడం విశేషం. ఈ రెండు సిరీస్ విజయాలు అందుకున్న భారత జట్టులో అబిద్ భాగమయ్యారు.

అద్భుత ఫీల్డర్: అబిద్ అలీ తన తరంలో గొప్ప ఫీల్డర్‌గా పేరు గాంచారు. ఫతే మైదాన్ క్లబ్‌లో గంటల కొద్దీ ప్రాక్టీస్‌లో ఫీల్డింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించేవారు. క్యాచ్‌లు పట్టడాన్నీ సుదీర్ఘంగా సాధన చేసేవారు. వికెట్ల మధ్య చిరుతలా పరిగెత్తేవారు.

కోచ్‌గా..: రిటైరైన తర్వాత అలీ కోచ్‌గా పని చేశారు. ఈ సమయంలో హైదరాబాద్ జూనియర్ జట్టు సేవలు అందించారు. మాల్దీవులు, యూఏఈ జట్లకూ కోచ్‌గా వ్యవహరించారు. 2001-02లో రంజీ ట్రోఫీ సౌత్‌జోన్ లీగ్ చాంపియన్‌షిప్ గెలిచిన ఆంధ్ర జట్టుకు అబిద్ శిక్షణ ఇచ్చారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ క్రికెట్ అకాడమీ కోచ్‌గా పలువురు ఆటగాళ్లను తీర్చిదిద్దారు.

సింధు ఇంటిదారి

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్



రెండో రౌండ్‌కు రుత్విక జంట



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఏస్ షట్లర్ పీవీ సింధు తొలి రౌండ్‌లోనే వెనుదిరగగా.. గాయత్రి జోడీ ప్రీక్వార్టర్స్‌కు చేరుకొంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నెం:16 సింధు 21-19, 13-21, 13-21తో కిమ్ గ వున్ (కొరియా) చేతిలో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో 20-12తో గేమ్ పాయింట్‌పై నిలిచిన సింధు.. తడబాటుతో ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం ఇచ్చింది. కానీ, చివర్లో ఎలాగోలా గేమ్‌ను దక్కించుకొంది. ఆ తర్వాతి రెండు గేముల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కిమ్ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన తర్వాత సింధు పేలవ ప్రదర్శనను కొనసాగిస్తోంది. జనవరిలో జరిగిన ఇండోనేసియా మాస్టర్స్ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన సింధు.. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్స్ దాటలేక పోయింది. కాగా, మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ 21-17, 21-13తో చైనీస్ తైపీకి చెందిన సంగ్ షు యున్-యు చెన్ హుయ్‌పై వరుస గేముల్లో నెగ్గింది. అయితే, శ్రుతి మిశ్రా-ప్రియా జంట 9-21, 4-21తో కొరియా టాప్ సీడ్ లి సో హి-బెక్ హ న ద్వయం చేతిలో చిత్తయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని జంట 21-10, 7-21, 24-22తో యి హోంగ్ వి-నికోల్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది.



గౌతీ..కొత్త ట్రెండ్?

'ఏ' జట్టు టూర్లకూ వెళ్లేందుకు సిద్ధం

న్యూఢిల్లీ: గతంలో భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌లుగా పనిచేసినవారికి భిన్న శైలిలో వెళ్లేందుకు గౌతమ్ గంభీర్ సిద్ధమవుతున్నాడట. ఇకనుంచి సీనియర్ జట్టు బాధ్యతలు లేనప్పుడు భారత 'ఏ' జట్టుతో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లాలని భావిస్తున్నాడు. భారత రిజర్వు బెంచ్ బలంపై అవగాహనకు వచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గతేడాది సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో, ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో వైఫల్యాల దరిమిలా టెస్టు క్రికెట్‌లో భారత్‌ను గాడిలో పెట్టే దిశగా గంభీర్ తన ప్రయత్నాలను తీవ్రతరం చేయనున్నాడట. అందుకే 'ఏ' జట్టు విదేశీ టూర్ల సంఖ్యను పెంచాలని బోర్డుకు గంభీర్ సూచించాడు. ప్రస్తుతం భారత 'ఏ' జట్టు చీఫ్ కోచ్‌గా సితాంశు కోటక్ వ్యవహరిస్తున్నాడు.



యూత్ అథ్లెటిక్స్‌లో వైశాలికి రజతం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ యూత్ అథ్లెటిక్స్‌లో ఖమ్మం యువ అథ్లెట్ వైశాలి రజత పతకం కొల్లగొట్టింది. బుధవారం పట్నాలో జరిగిన హెప్టాథ్లాన్ విభాగంలో వైశాలి 4,224 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. అనామిక (కేరళ) స్వర్ణం, హర్షిత (కర్ణాటక) కాంస్యం సాధించారు.



ఒలింపిక్స్‌లో 'తార' ప్రకాశిస్తుంది!

ఆనంద్ మహీంద్రా ఆకాంక్ష


ముంబై: ప్రఖ్యాత పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర సోషల్‌మీడియాలో చురుకుగా ఉంటారు. తన దృష్టికి వచ్చిన స్ఫూర్తిదాయక అంశాలను పంచుకుంటూ ప్రజలలో చైతన్యం కలిగిస్తుంటారు. ఈకోవలోనే భారత్-అమెరికా స్కేటర్, 24 ఏళ్ల తారా ప్రసాద్ గురించి ఆయన వెల్లడించారు. 'తారా ప్రసాద్ 2019లో అమెరికా పౌరసత్వం వదులుకొని భారత్ వచ్చి స్కేటింగ్‌లో రాణిస్తోంది. మూడుసార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచింది. గత వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనే చాన్సు కొద్దిలో మిస్సయిందని తెలిసింది. కానీ 2026 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆమె కచ్చితంగా అర్హత సాధిస్తుంది. ఆ క్రీడల్లో పతకంతో మెరుస్తుంది' అని ఆనంద్ మహీంద్రా తారా ప్రసాద్‌లో స్ఫూర్తి నింపారు. తార తల్లిదండ్రులది తమిళనాడు. అయితే వారు అమెరికా వలస వెళ్లి అక్కడ స్థిరపడ్డారు.

గిల్‌కు ఐసీసీ అవార్డు

దుబాయ్: సూపర్‌ఫామ్‌లో ఉన్న టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును గెలుచుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అదరగొట్టిన గిల్, అనంతరం చాంపియన్స్ ట్రోఫీలోనూ సత్తా చాటాడు. దీంతో ఫిబ్రవరి నెలకుగాను ఈ ఐసీసీ అవార్డు విజేతగా నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్, న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్‌లను వెనక్కి నెట్టి గిల్ ఈ పురస్కారం దక్కించుకోవడం విశేషం. కాగా, ఈ అవార్డు నెగ్గడం గిల్‌కు ఇది మూడోసారి. గతంలో 2023లో రెండుసార్లు దీన్ని అందుకున్నాడు.

మూడో స్థానానికి రోహిత్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అదరగొట్టిన రోహిత్ శర్మ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లాడు. తాజా ర్యాంకింగ్స్‌లో బ్యాటర్ల జాబితాలో రోహిత్ రెండు స్థానాలు ఎగబాకాడు. తద్వారా మూడో ర్యాంకులో నిలిచి టాప్-3లో చోటు దక్కించుకున్నాడు. విరాట్ కోహ్లీ ఓ స్థానం కోల్పోయి ఐదో ర్యాంక్‌కు చేరగా, శ్రేయాస్ అయ్యర్ 8వ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక, శుభ్‌మన్ గిల్ టాప్ ర్యాంక్‌ను పదిలం చేసుకొన్నాడు. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో మూడు స్థానాలు మెరుగై వరుసగా 3వ, 10వ ర్యాంకుల్లో నిలిచారు. న్యూజిలాండ్ కెప్టెన్ శాంట్నర్ ఏకంగా ఆరు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు.

క్రికెట్‌కు మహ్మదుల్లా గుడ్‌బై



ఢాకా: బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్, 39 ఏళ్ల మహ్మదుల్లా అంతర్జాతీయ క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. మహ్మదుల్లా తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 239 వన్డేలు, 50 టెస్ట్‌లు, 141 టీ20లు ఆడాడు. మూడు వన్డే వరల్డ్ కప్‌లలో సెంచరీలు చేసిన బంగ్లా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. 2021లో టెస్ట్‌లకు, 2024లో టీ20లకు మహ్మదుల్లా వీడ్కోలు పలికాడు. ఇక.వన్డేల్లో 5698, టెస్ట్‌ల్లో 2914, టీ20ల్లో 2444 రన్స్ చేశాడు. ఆఫ్ స్పిన్నర్‌గా మూడు ఫార్మాట్లలో కలిపి 166 వికెట్లు పడగొట్టాడు.

బిజినెస్

హైదరాబాద్‌లో టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ గ్లోబల్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లైఫ్‌సైన్స్ కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజరీ సేవలందించే స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్త్‌పిన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ కంపెనీ నగరంలో టెన్త్‌పిన్ ఏఐ ల్యాబ్స్ (టెయిల్), గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. విస్తరణ ప్రక్రియలో భాగంగా టెన్త్‌పిన్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం, ఇక్కడ ఏర్పాటు చేసింది కంపెనీకి ప్రపంచంలోనే అతి పెద్ద కేంద్రం కావడం ఆనందదాయకమని ఈ సందర్భంగా జయేష్ రంజన్ అన్నారు. లైఫ్‌సైన్స్ కంపెనీలు తమ నిపుణులతో కలిసి పని చేసేందుకు ఇది ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌గా వ్యవహరిస్తుందని కంపెనీ డైరెక్టర్ బార్ట్ రీజ్ అన్నారు.

గ్లెన్‌మార్క్ నుంచి కొత్త మధుమేహ ఔషధం

హైదరాబాద్: మధుమేహ రోగుల్లో గ్లైసెమిక్ కంట్రోల్‌కు, బరువు తగ్గడానికి ఎంపాగ్లిఫ్లోజిన్ టాబ్లెట్లను మార్కెట్లో విడుదల చేసినట్టు గ్లెన్‌మార్క్ ఫార్మా ప్రకటించింది. గ్లెంపా బ్రాండ్ కింద గ్లెంపా (ఎంపాగ్లిఫ్లోజిన్ 10/25 ఎంజీ), గ్లెంపా-ఎల్ (ఎంపాగ్లిఫ్లోజిన్ 10/25 ఎంజీ+లినాగ్లిప్టిన్ 5 ఎంజీ), గ్లెంపా-ఎం (ఎంపాగ్లిఫ్లోజిన్ 12.5 ఎంజీ+మెట్‌ఫార్మిన్ 500/1000 ఎంజీ) డోసేజిల్లో ఇవి అందుబాటులో ఉంటాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




13వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	73	విజయవాడ	95
వరంగల్	73	గుంటూరు	90
కరీంనగర్	73	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	73	చిత్తూరు	80
కర్నూలు	73	నెల్లూరు	85
విశాఖపట్నం	89	అనంతపురం	85
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,980 ▲	80,650 ▲	1,09,000 ▲
విజయవాడ	88,800 ▲	83,600 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	86,480 ▲	79,270 ▲	99,540 ▲
రాజమండ్రి	87,980 ▲	80,650 ▲	1,00,200 ▲
ప్రొద్దుటూరు	87,800 ▲	81,300 ▲	99,000 ▲
ముంబై	86,140 ▲	78,910 ▲	98,100 ▲

అన్నీ మంచి శకునములే..!



దిగొచ్చిన ధరలు.. పుంజుకున్న పారిశ్రామికం

- 7 నెలల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- ఫిబ్రవరిలో 3.61 శాతానికి పరిమితం
- జనవరిలో 5 శాతానికి పారిశ్రామికోత్పత్తి సూచీ

న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట తగ్గుముఖం పట్టగా.. పారిశ్రామిక వృద్ధి పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 7 నెలల కనిష్ఠ స్థాయి 3.61 శాతానికి దిగొచ్చింది. కూరగాయలు, కోడి గుడ్లు, ప్రొటీన్ ఉత్పత్తులు, పాలు, వాటి ఉత్పత్తుల ధరలు తగ్గడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ద్రవ్యోల్బణం జనవరి నెలలో 4.26 శాతం ఉండగా గత ఏడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా ఉంది. గత ఏడాది జూలైలో ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కనిష్ఠ కట్టడి స్థాయి 4% సమీపానికి దిగొచ్చిన ద్రవ్యోల్బణం తిరిగి ఆ స్థాయి కన్నా దిగువకు తగ్గడం ఇదే ప్రథమం. అయితే గత ఏడాది నవంబరు నుంచి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి (2% ఎగువకు లేదా దిగువకు సర్దుబాటుతో 4%) పరిధిలోనే కదలాడుతూ వస్తోంది.

వడ్డీపోటు మరింత తగ్గే చాన్స్

ద్రవ్యోల్బణం 4 శాతం దిగువకు జారుకోవడంతో కీలక రెపోరేట్లు మరింత తగ్గే అవకాశాలున్నాయని విశ్లేషకులంటున్నారు. వచ్చే నెల 9న ఆర్‌బీఐ తదుపరి ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించనుంది. ఆ సందర్భంగా రెపోరేటును మరో పావు (0.25) శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. అదే జరిగితే రెండు నెలల వ్యవధిలోనే ఇది రెండో కోత అవుతుంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును పావు శాతం తగ్గించింది. దాంతో రెపో 6.25 శాతానికి జారుకుంది. ఇప్పుడు మరో పావు కోత పెడితే రెపో రేటు 6 శాతానికి దిగివస్తుంది. తద్వారా రెపో ప్రామాణిక గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీరేట్లతోపాటు ఈఎంఐల భారం సైతం తగ్గే అవకాశం ఉంటుంది. ఏప్రిల్‌తో పాటు జూన్ లేదా ఆగస్టు సమీక్షలో రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించే అవకాశాల్లేకపోలేవని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితీ నాయర్ అంచనా వేశారు.

తయారీ రంగం జోరు

తయారీ రంగం దన్నుతో జనవరి నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5 శాతానికి పెరిగింది. అంతేకాదు, 2024 డిసెంబరు ఐఐపీని సైతం ప్రభుత్వం తొలుత అంచనా వేసిన 3.2 శాతం నుంచి తాజాగా 3.5 శాతానికి పెంచింది. ఐఐపీ గత ఏడాది జనవరిలో 4.2% ఉండగా వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో కూడా అదే స్థాయిలో ఉంది. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల్లో నమోదైన 6 శాతం కన్నా ఇది తక్కువే. తయారీ రంగంలో వృద్ధిరేటు గత ఏడాది జనవరితో పోల్చితే 3.6 శాతం నుంచి 5.5 శాతానికి పెరిగింది. అయితే గనుల రంగంలో మాత్రం ఉత్పత్తి 6 శాతం నుంచి 4.4 శాతానికి క్షీణించింది. ఒకపక్క ప్రపంచం మొత్తాన్ని ట్రంప్ సుంకాల హెచ్చరికలు అతలాకుతలం చేస్తున్న వాతావరణంలో మన దేశంలో స్థూల ఆర్థిక గణాంకాలు మెరుగుపడడం ఆనందదాయకమని, రాబోయే సవాళ్లను ప్రభుత్వం ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు ఇవి దోహదపడతాయని అసోచాం అంటోంది.

మిత్సుబిషి కోసం అజాద్ ఇంజనీరింగ్ తయారీ కేంద్రం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రెసిషన్ ఇంజనీరింగ్‌లో సుప్రసిద్ధమైన అజాద్ ఇంజనీరింగ్ కంపెనీ హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ (ఎంహెచ్ఐ) కోసం లీన్ మాన్యుఫాక్చరింగ్ కేంద్రాన్ని ప్రారంభించింది. 7,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎంహెచ్ఐ జీటీసీసీ బిజినెస్ డివిజ్ వైస్ ప్రెసిడెంట్ మసాహితో కటోకా, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, అజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ ప్రారంభించారు. ఎంహెచ్ఐతో తాము దశాబ్ది కాలంగా సాగిస్తున్న ప్రయాణంలో ఇదొక మైలురాయి అని రాకేష్ చోప్దార్ అన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 200 మంది వృత్తి నిపుణులు పని చేస్తున్నారంటూ సమీప భవిష్యత్తులో వీరి సంఖ్య మరెన్నో వందలకు పెరుగుతుందని చెప్పారు. ప్రపంచ తయారీ కేంద్రంగా భారతదేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు పెరుగుతున్న ప్రాధాన్యతకు ఈ కేంద్రం ఏర్పాటు నిదర్శనమని జయేష్ రంజన్ అన్నారు.

నాలుగో రోజూ నష్టపోయిన సెన్సెక్స్

రూ.1.4 లక్షల కోట్లు హాంఫట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు కూడా నష్టాల్లోనే ముగిసింది. నిస్తేజంగా సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 72.56 పాయింట్ల నష్టంతో 74,029.76 వద్ద ముగియగా నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 22,470.50 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ రూ.1.4 లక్షల కోట్లు దిగజారి రూ.392.84 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఒక దశలో 504.16 పాయింట్ల వరకు నష్టపోయి 73,598.16 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది.

మ్యూచువల్ ఫండ్స్ జోరుకు బ్రేక్: ఫిబ్రవరి నెల కూడా దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కలిసి రాలేదు. ఈ సంస్థలు నిర్వహించే ఈక్విటీ పథకాల్లోకి వచ్చే పెట్టుబడులు 26 శాతం తగ్గి రూ.29,303 కోట్లకు పడిపోయాయి. జనవరిలో నమోదైన రూ.39,688 కోట్లతో పోలిస్తే ఇది రూ.10,385 కోట్లు తక్కువ కాగా గత డిసెంబరులో వసూలైన రూ.41,156 కోట్లతో పోలిస్తే రూ.11,853 కోట్లు తక్కువ

కాగ్నిజెంట్ ఉద్యోగులకు బోనస్

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు 85 నుంచి 115 శాతం బోనస్ చెల్లించనున్నట్టు ఉద్యోగులకు లెటర్లు పంపించినట్టు సమాచారం. గత మూడేళ్లలో కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో బోనస్ ప్రకటించడం ఇదే మొదటిసారి. ఈ నెల, వచ్చే నెల జీతాలతో కలిసి ఈ బోనస్‌ను కంపెనీ చెల్లించనుంది.

కోరమాండల్ చేతికి నాగార్జున అగ్రికెమ్

రూ.820 కోట్లకు 53% వాటా కొనుగోలు

త్వరలో 26 శాతం ఓపెన్ ఆఫర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (గతంలో నాగార్జున అగ్రికెమ్) యాజమాన్యం చేతులు మారింది. మురుగప్ప గ్రూప్‌నకు చెందిన ఎరువుల కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ రూ.820 కోట్లతో ఎన్ఏసీఎల్ ఈక్విటీలో 53.13 శాతం వాటా కొనుగోలు చేసింది. ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రమోటర్ల నుంచి ఈ వాటాను ఒక్కో షేరు రూ.76.7 చొప్పున కొనుగోలు చేసినట్టు కోరమాండల్ ఇంటర్నేషనల్ బుధవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనికి సంబంధించిన ఒప్పందానికి కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ డైరెక్టర్ల బోర్డు కూడా ఆమోదం తెలిపింది. దీంతో మరో 26 శాతం వాటా కొనుగోలు కోసం కంపెనీ త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించబోతోంది. ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాల మార్కెట్‌లో తన స్థానాన్ని నాగార్జున అగ్రికెమ్ కొనుగోలు మరింత పటిష్ఠం చేస్తుందని మురుగప్ప గ్రూప్ భావిస్తోంది. నాగార్జున అగ్రికెమ్ తయారు చేసే యాక్టివ్ ఇంగ్రిడియంట్స్, కెమికల్ కాంపౌండ్స్‌ను వరి, మొక్కజొన్న, ఆలు పంటల క్రిమి సంహారక, కలుపు మందుల తయారీలో ఉపయోగిస్తారు. నాగార్జున అగ్రికెమ్ ఈక్విటీలో ప్రస్తుతం ప్రమోటర్లకు 63.65 శాతం వాటా ఉంది. ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్‌కు ఏపీతో పాటు గుజరాత్‌లోనూ ఉత్పత్తి యూనిట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఉంది. ఈ అమ్మకంతో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన నాగార్జున గ్రూప్ తన ప్రధాన వ్యాపారాల నుంచి దాదాపుగా వైదొలగినట్టయింది.

స్టార్‌లింక్‌తో జియో జట్టు

ఎయిర్‌టెల్ బాటలో అంబానీ కంపెనీ



న్యూఢిల్లీ: భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఆధారిత హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలందించేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో భారత నం.1 ధనవంతుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో బుధవారం భాగస్వామ్యం కుదుర్చుకుంది. స్పేస్‌ఎక్స్ అనుబంధ విభాగమే స్టార్‌లింక్. కాగా, స్పేస్‌ఎక్స్‌తో భారతీ ఎయిర్‌టెల్ జట్టు కట్టిన మరుసటి రోజే రిలయన్స్ జియో కూడా ఇదే తరహా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. భారత్‌లో సేవలందించేందుకు స్టార్‌లింక్‌కు ఇంకా అనుమతి లభించలేదు. ఇందుకు అవసరమైన లైసెన్సు పొందాక స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం అమలవుతుందని జియో స్పష్టం చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా రిలయన్స్ జియో తన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిటైల్ స్టోర్లలో స్టార్‌లింక్ డివైజ్‌లతోపాటు సేవలను ఆఫర్ చేయనుంది. అంతేకాదు, ఆ డివైజ్‌ల ఇన్‌స్టాలేషన్, యాక్టివేషన్ సేవలను సైతం అందించనుంది. జియో, స్పేస్‌ఎక్స్ కలిసి ఇరువురి సేవలకు పరస్పరం దోహదపడే మార్గాలను అన్వేషించనున్నాయి.

విరోధులు భాగస్వాములుగా..

తాజా భాగస్వామ్యాల ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవల రంగంలో విరోధులు భాగస్వాములుగా మారారు. ఎందుకంటే, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం వేయాలని జియో, ఎయిర్‌టెల్ డిమాండ్ చేయగా.. స్టార్‌లింక్ సహా ఇతర అంతర్జాతీయ సంస్థలు నేరుగా కేటాయింపులు జరపాలని కోరాయి. కాగా, అంతర్జాతీయంగా ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా శాటిలైట్ స్పెక్ట్రమ్‌ను నిర్దిష్ట ధరకు నేరుగా కేటాయించడం జరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో విరోధాన్ని పక్కన పెట్టి స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, జియో జట్టు కట్టడం విశేషం.

మహా హైదరాబాద్

హెచ్ఎండీఏ పరిధిని ఆర్ఆర్ఆర్ వరకూ విస్తరిస్తూ సర్కారు జీవో

- 7,257 నుంచి.. 10,472 చదరపు కిలోమీటర్లకు పెరిగిన పరిధి
- ఫ్యూచర్ సిటీలో చేర్చనున్న 36 రెవెన్యూ గ్రామాల మినహాయింపు
- కొత్తగా చేరిన 4 జిల్లాలు, 32 మండలాలు..
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ పరిధిని ఆర్ఆర్ఆర్ వరకూ విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో ఎంఎస్ నంబర్ 68 జారీ చేసింది. దీంతో.. ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్ల మేర హెచ్ఎండీఏ పరిధి 10,472.72 చదరపు కిలోమీటర్లకు చేరినట్లయింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో ఏడు జిల్లాలు (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట) ఉండగా.. ఈ విస్తరణతో మరో నాలుగు జిల్లాల్లోని 32 మండలాలు చేరాయి. ఈ 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్ఎండీఏ పరిధి భారీగా పెరిగింది. హెచ్ఎండీఏ పరిధిని విస్తరించనున్నట్లు 'మహా హైదరాబాద్' అనే శీర్షికతో జనవరి 19న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో దాని చుట్టూ పట్టణీకరణ వేగవంతమవుతుందని అంచనా వేసిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా.. ప్రస్తుతమున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ నుండి 36 రెవెన్యూ గ్రామాలను పెంచిన పరిధి నుంచి మినహాయించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. ఆ 36 రెవెన్యూ గ్రామాలను ప్రతిపాదిత "ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ"లో చేర్చాలని నిర్ణయించారు.

కొత్తగా చేరే మండలాలివీ..

రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మండలాలతో పాటు.. కొత్తగా మరో ఐదు మండలాలు తలకొండపల్లి, ఆమనగల్లు, మాడుగుల, కడ్తాల్, కేశంపేట చేరాయి. దీంతో రంగారెడ్డి జిల్లాలోని మొత్తం 27 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో చేరినట్టయింది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 8మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు చౌటకూర్, కొండాపూర్, సదాశివపేట చేరాయి. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే మూడు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో మూడు మండలాలు గజ్వేల్, జగదేవ్‌పూర్, రాయపోల్ చేరాయి. మెదక్ జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మాసాయిపేట మండలం చేరింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటికే ఐదు మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. కొత్తగా మరో ఐదు మండలాలు సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, రాజపేట, యాదగిరిగుట్ట, తుర్కపల్లి చేరాయి

కొత్తగా చేరే జిల్లాల్లోని మండలాలు..

వికారాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలు కొత్తగా హెచ్ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. వాటిలో ఏయే మండలాలు రానున్నాయంటే.. వికారాబాద్ జిల్లాలో ఐదు మండలాల్లోని (మోమిన్‌పేట, నవాబ్‌పేట, పరిగి, పూడూరు, వికారాబాద్) కొన్ని గ్రామాలు. నల్లగొండ జిల్లాలో నాలుగు మండలాల్లోని (గట్టుప్పల్, చింతపల్లి, మర్రిగూడ, నాంపల్లి) కొన్ని గ్రామాలు. మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు మండలాల్లోని (నవాబ్‌పేట, బాలానగర్, రాజాపూర్) కొన్ని గ్రామాలు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెల్దండ మండలంలోని మూడు గ్రామాలు.

33 మందికి అదనపు కలెక్టర్ హోదా

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 33 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు అదనపు కలెక్టర్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరి వేతన స్కేలు కూడా మారింది. టైమ్‌స్కేల్ రూ.76830-151000 ఉండగా తాజా నిర్ణయంతో రూ.96890-158380కు చేరింది. వేతనం రూ.20వేల మేర పెరిగింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో జారీ చేశారు.

1500 ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో 643 ఎకరాల భూమి సేకరణకు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసింది. కందుకూరు మండలం తిమ్మాయిపల్లిలో 366.04 ఎకరాలు, కొంగరకుర్దులో 277ఎకరాల సేకరణకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు ఇందులో దాదాపుగా అన్నీ అసైన్డ్ భూములే ఉన్నాయి. ఈ వారంలోనే మరో 900 ఎకరాల దాకా భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో 600ఎకరాలు, పంజాగూడ గ్రామంలో 300ఎకరాల సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, బుధవారం నోటిఫికేషన్ జారీ చేసిన భూముల్లో ఎక్కువ భాగం వర్షాధార పంటలు సాగవుతున్నాయి. తిమ్మాయిపల్లిలోని 80ఎకరాల్లో వరి, 20ఎకరాల్లో కూరగాయలు, మిగతా భూముల్లో జొన్న, మొక్కజొన్న పండిస్తుండగా, కొంత బీడు భూమి ఉంది. కొంగరకుర్దులో సేకరించనున్న 277 ఎకరాలు.. 1972, 1989, 1992లో 200మందికి లావణి పట్టాలతో పంపిణీ చేశారు. వీటిలోనూ రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లిలో ఐటీ పార్కు లేదా పారిశ్రామికవాడ ఏర్పాటుకు 198ఎకరాలు సేకరించనున్నారు. రెండు రోజుల్లో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుంది.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో 'వీఐటీ'కి చోటు

చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025లో వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) స్థానం దక్కించుకుంది. 14 పాఠ్యాంశాల బోధనలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల సరసన నిలిచింది. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలకు సంబంధించి.. ఏకంగా ప్రపంచంలోని టాప్-100 వర్సిటీల జాబితాలో చోటు దక్కించుకుంది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్యాక్వారెల్లి సైమండ్స్ బుధవారం ఈ జాబితాను విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 1700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025 ఎడిషన్‌ను రూపొందించారు. ఈ విశ్లేషణాత్మక అధ్యయనంలో వీఐటీ విశేష ప్రతిభను ప్రదర్శించింది. 4 పాఠ్యాంశాల ర్యాంకులను మెరుగుపర్చుకోవడంతోపాటు మరో 8 పాఠ్యాంశాల ర్యాంకులను యథాతథంగా కాపాడుకోగలిగింది. మరో రెండు పాఠ్యాంశాలు తొలి సారి ర్యాంకింగ్ జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. విద్య, పరిశోధన నైపుణ్యాలకు వీఐటీ పెద్దపీట వేస్తుందనడానికి ఈ ర్యాంకులే ఉదాహరణ అని నిర్వాహకులు తెలిపారు.

వీఐటీలో బోధిస్తున్న పాఠ్యాంశాలకు దక్కిన పాయింట్లు

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: 142, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్:110, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: 51- 100, ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్:151-200, ఇంజనీరింగ్- మెకానికల్, ఏరోనాటికల్ అండ్ మానుఫ్యాక్చరింగ్: 201-250, ఇంజనీరింగ్ - కెమికల్: 251 - 300, న్యాచురల్ సైన్సెస్: 362, మెటీరియల్ సైన్స్: 151-200, మ్యాథమెటిక్స్: 201-250, స్టాటిస్టిక్స్ అండ్ ఆపరేషనల్ రీసెర్చ్: 251-275, కెమిస్ట్రీ: 301-350, ఫిజిక్స్ అండ్ అస్ట్రానమీ: 401-450, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్: 451-500, బయోలాజికల్ సైన్సెస్: 351-400, అగ్రికల్చరల్ అండ్ ఫారెస్ట్రీ: 351-400, బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్: 551-600

సీఎం చైర్మన్‌గా.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ

- ఉపాధ్యక్షుడిగా మునిసిపల్ లేదా.. పరిశ్రమల మంత్రి
- సభ్యులుగా సీఎస్, పలువురు ఉన్నతాధికారులు

హైదరాబాద్, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నుంచి రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) మధ్యలో ఉన్న ఏడు మండలాల్లోని 56 గ్రామాలను ఫ్యూచర్‌సిటీగా ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేసే దిశలో ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. బుధవారం ఈ మేరకు ఫ్యూచర్ సిటీ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఉపాధ్యక్షుడిగా మునిసిపల్ శాఖ లేదా పరిశ్రమల శాఖ మంత్రుల్లో ఒకరు వ్యవహరిస్తారు. సభ్యులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికం, పరిశ్రమలు, ఐటీ శాఖల పత్యేక ప్రధాన కార్యదర్శులు, మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శులు, హెచ్ఎండీఏ కమిషనర్, టీజీఐఐసీ ఎండీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, డైరక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) ఉంటారు. సభ్య కార్యదర్శిగా ఎఫ్‌సీడీఏ సీఈవో వ్యవహరిస్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు సెక్టార్లుగా విభజిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఓఆర్ఆర్‌కు లోపల ఉన్న ప్రాంతాన్ని 'కోర్ తెలంగాణ'గా.. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు రెండు కిలోమీటర్ల అవల వరకు ఉన్న ప్రాంతాన్ని 'తెలంగాణ అర్బన్'గా, ఆ ప్రాంతానికి అవతల కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు కాకుండా విగిలిన అన్ని ప్రాంతాలను 'రూరల్ తెలంగాణ'గా పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు రెండు కిలోమీటర్ల దూరం వరకు ఉండే బఫర్‌జోన్ ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా ప్రకటించారు. ఈ భవిష్యత్ నగరం నాగార్జునసాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే మధ్యలో ఉన్న 30 వేల ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. ఏడు మండలాల్లోని 56 గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తీసుకురావాలని ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు.

ఎఫ్‌సీడీఏ పరిధి ఇదే..

అమన్‌గల్ మండలం: కోనాపూర్, రామనూతుల ఇబ్రహీంపట్నం మండలం: కప్పపహాడ్, పోచారం, రాంరెడ్డిగూడ, తూలేకాలన్, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తాడ్లకాల్వ; **కడ్తల్ మండలం:** కడ్తల్, చేరికొండల్ పట్టికల్వకుర్తి, చెరికొండల్ పట్టిపడ్కల్, ఏకరాజ్‌గూడ, కర్కల్‌పహాడ్, ముడ్విన్ **కందుకూరు మండలం:** కందుకూరు, దసార్లపల్లి, అన్నోజిగూడ, డెబ్బాడగూడ, గూడూర్, గుమ్మడవల్లె, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూర్, మాదాపూర్, మీర్ఖాన్‌పేట్, మహమ్మద్‌నగర్, ముచ్చర్ల, పంజగూడ, రచ్లూర్, సర్వరావులపల్లె, తిమ్మాయిపల్లె, తిమ్మాపూర్ **మహేశ్వరం మండలం:** మొహబ్బత్‌నగర్, తుమ్మలూర్ **మంచాల్ మండలం:** ఆగపల్లి, నోముల, మల్లికార్జునగూడ **యాచారం మండలం:** చౌదర్‌పల్లె, గుంగల్, కొత్తపల్లె, కుర్మిద్ద, మేడపల్లె, మల్కీజ్‌గూడ, మొగుళ్లవంపు, నక్కార్టా, నానక్‌నగర్, నందివనపర్తి, నజ్దీక్ సింగారం, తక్కెళ్లపల్లి, తాటిపర్తి, తులేఖుర్ద్, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి

బీఆర్ఎస్‌తో సత్సంబంధాలా!

(మొదటిపేజీ తరువాయి)



హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహాలు, వ్యవహరించాల్సిన తీరుపై చర్చించేందుకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్-1లో మంత్రులు, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సభ్యులు అంశాల వారీగా, విభాగాల వారీగా సబ్జెక్టుపై పట్టు సాధించాలని, లేదంటే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని అన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు దీటుగా సమాధానాలు చెప్పాలంటే కచ్చితంగా అన్ని సబ్జెక్టులపై పట్టుండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పుడు ప్రవేశపెట్టేది పూర్తిస్థాయి బడ్జెట్ అని, ఈ దృష్ట్యా ఈ సమావేశాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.

సభ్యులు వందశాతం హాజరుకావాల్సిందే..

15 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించేందుకు ఈ సమావేశాల్లో అవకాశం దక్కిందని సీఎం రేవంత్ అన్నారు. సభ్యులంతా సభ జరిగినన్ని రోజులు వందశాతం హాజరు కావాల్సిందేనని చెప్పారు. సభ జరిగేదే ఏడాదిలో 20-25 రోజులని, అందులోనూ 3-4 గంటల పాటే సభ ఉంటుందని పేర్కొన్నారు. ఆ సమయం కూడా కేటాయించలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా.. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ఎంపీల హాజరుపై సోనియాగాంధీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారనే విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఇక్కడ కూడా అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు విప్‌లు సభ్యుల హాజరును పరిశీలించాలని సూచించారు. సభలో సభ్యులంతా సమన్వయంతో వ్యవహరించాలని, ప్రతిపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోవాలని అన్నారు. ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తాయని, అధికార పార్టీ సభ్యులుగా సంయమనం పాటించాలని అన్నారు. అయితే అవసరమైనప్పుడు మాత్రం బలమైన కౌంటర్లు ఇవ్వాలన్నారు. సభలో బడ్జెట్‌తోపాటు అప్పులపై శ్వేతపత్రం పెట్టే అంశంపై ఆలోచిస్తున్నామని సీఎం తెలిపారు. గవర్నర్ ప్రసంగం అనంతరం బీఆర్ఎస్ సభ్యులు సభలో గందరగోళం చేస్తున్న సమయంలో విప్‌లు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల్లో చాలా మంది కొత్తగా ఎన్నికైన వారు ఉన్నందున.. శాసనసభలో వ్యవహరించాల్సిన తీరుపై వారు సీనియర్లతో చర్చించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆరు నుంచి పది మంది ఎమ్మెల్యేలు బృందంగా ఏర్పాటు కావాలని, వారికి ఆసక్తి ఉన్న అంశాలపై బృందంలో చర్చించాలని అన్నారు. అవసరమైతే సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతోనూ చర్చించి సమాచారం పొందాలన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు తిట్లతో కాకుండా సబ్జెక్టుతో సమాధానాలు చెప్పాలన్నారు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండాలని, ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం నిర్దేశించారు. ప్రధానంగా రాజీవ్ యువ వికాసం పథకం గురించి ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. సీఎం, మంత్రులతోపాటు ఎమ్మెల్యేలపైనా విమర్శలు, ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని బలంగా తిప్పికొట్టాలన్నారు. తమకు సంబంధం లేదన్నట్టు ఉంటే అదే సమస్య ఆ తరువాత మిగిలిన వారికి కూడా ఎదురవుతుందని హెచ్చరించారు. మంత్రుల నియోజకవర్గాలకే నిధులు అధికంగా వెళ్తున్నాయనే విషయాన్ని పలువురు సభ్యులు లేవనెత్తగా.. ఈ బడ్జెట్ తరువాత అందరికీ సమానంగా కేటాయింపులు ఉంటాయన్నారు.

సాగర్ ఎమ్మెల్యేపై సీఎం సీరియస్..

సీఎల్పీ సమావేశంలో సీఎం మాట్లాడుతున్న సమయంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ ఫోన్ చూస్తూ కూర్చోవడం, కొద్దిసేపటికి ఫోన్ పట్టుకుని బయటకు వెళ్లడంతో రేవంత్‌రెడ్డి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "సభలో సభ్యుల హాజరు గురించి నేను మాట్లాడుతుండగానే అలా బయటకు వెళ్తే అర్థమేంటి? సీఎల్పీ సమావేశంలోనే కూర్చునే ఓపిక లేకపోతే ఎలా? క్రమశిక్షణతో మెలిగితేనే భవిష్యత్తు బాగుంటుంది" అని సీఎం అన్నట్లు సమాచారం. ఎమ్మెల్యేగా మొదటిసారి గెలవడం కంటే రెండోసారి గెలవడమే నాయకుడి పనితీరుకు నిదర్శనమని, అందుకే ఎమ్మెల్యేలంతా అప్రమత్తంగా నడచుకోవాలని అన్నారు. ఇక త్వరలో జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. ఎమ్మెల్యేలు, జిల్లాల ప్రతినిధుతో ప్రత్యేకంగా భేటీ కానున్నట్టు పేర్కొన్నారు. అందరితో కలిసి భోజనం చేస్తూ.. వ్యవస్థాగత అంశాలపై లోతుగా చర్చిస్తానన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పట్ల సీరియస్‌గా వ్యవహరించాలని, పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిపైనా సమీక్షలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా నుంచి కొంతమంది గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వెళ్లారని, వారికి బ్యాంకుల్లో ఉన్న రుణాలు మాఫీ కాలేదని సీఎం దృష్టికి తెచ్చారు. దీంతో సమస్యను పరిష్కరించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సీఎం సూచించారు.

ఒక్కో కార్పొరేట్ సంస్థకు.. ఒక్కో గురుకుల నిర్వహణ బాధ్యత

- దశలవారీగా పారిశ్రామిక ప్రోత్సాహకాల విడుదల
- హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- 3 శాఖలపై ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఒక్కో యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయ నిర్వహణ బాధ్యతలను ఒక్కో కార్పొరేట్ సంస్థకు అప్పగిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కార్పొరేట్ కంపెనీలు తమ 'కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)' కింద కొంత మేర నిధులను సమాజ వికాసం కోసం ఖర్చు చేస్తుంటాయని, అలాంటి నిధులను ఈ గురుకులాల నిర్వహణకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐటీ-పరిశ్రమలు, పురపాలక-పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖల ప్రీ బడ్జెట్ సమావేశ బుధవారం ప్రజాభవన్‌లో జరిగింది. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమల శాఖ సంవత్సర కాలంగా రకరకాల సదస్సులను నిర్వహించి భారీగా పెట్టుబడులను సాధించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకులాల నిర్వహణ బాధ్యతలను కార్పొరేట్ సంస్థలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాకాలను దశలవారీగా విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి హైదరాబాద్ తలమానికమని, అందుకు అనుగుణంగా మహానగరం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇప్పటికే కొనసాగుతోన్న పనుల్లో వేగం పెంచాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. విద్యుత్తు శాఖకు ఈసారి బడ్జెట్‌లో ప్రాధాన్యమిస్తామని ఆయన చెప్పారు.

హస్తినలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో గురువారం ఆయన భేటీ కానున్నారు. రాష్ట్రంలో మే నెలలో ప్రపంచ సుందరి పోటీ (మిస్ వరల్డ్)లను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చించనున్నట్టు తెలిసింది. మిస్ వరల్డ్ పోటీల కోసం ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రతినిధులతో పాటు దాదాపు 4 వేలకు పైగా మీడియా సంస్థల ప్రతినిధులు రాష్ట్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలోనే వారి వీసాలు, పాస్‌పోర్టుల అంశంతో పాటు ఇతర అంశాలపైనా సీఎం.. కేంద్రమంత్రితో చర్చించనున్నట్లు సమాచారం.

నాఫెడ్ ద్వారా పసుపు కొనండి:తుమ్మల

నాఫెడ్ ద్వారా పసుపు పంటను కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఈ నెలలోనే అధిక మొత్తంలో పసుపు పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం (ఎంఐఎస్) కింద కొనుగోలు చేయాలని లేఖలో పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా వీలైనంత తొందరగా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో పసుపు పంట క్వింటాల్‌కు రూ.7వేలు, రూ.11వేలు ధర పలుకుతుందని.. గత రెండేళ్లతో పోల్చితే 15 నుంచి 17% ధర పడిపోయినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో పసుపు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.

నాలుగు మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు వ్యవసాయ మార్కెట్లకు పాలకవర్గాలను నియమించింది. నల్లగొండ జిల్లాలోని చండూర్, సూర్యాపేట జిల్లా సూర్యాపేట, నిర్మల్ జిలా ఖానాపూర్, రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లతో పాటు ఇతర పాలక వర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

1,778 కోట్లతో ఈఎంసీ, సీఎఫ్‌సీలు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిదారులను ఆకర్షించేందుకు వీలుగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల (ఈఎంసీ) పథకాలను నోటిఫై చేసినట్లు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2008లో రూపొందించిన ఐటీఐఆర్ విధానాన్ని 2017లో సమీక్షించి రద్దు చేసినట్లు చెప్పారు. అయితే తమ హయాంలో రూ.1,778.6 కోట్ల ఖర్చుతో 3 ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లు, ఒక కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ప్రాజెక్టును 1,292.87 ఎకరాల్లో చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఈ-సిటీలో, రంగారెడ్డిలోని మహేశ్వరంలోనూ ఈఎంసీ పథకాన్ని అమలు చేస్తున్నారని, రాయదుర్గంలోని హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ, మహబూబ్‌నగర్‌లోని దివిటిపల్లిలో సవరించిన ఈఎంసీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

మారకపోతే మార్చురీకే

ఇప్పటికే స్టేచర్ నుంచి స్ట్రెచర్‌కు వచ్చావు.. ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్ ఇచ్చిపోయావు

- పదేళ్లలోనే 7లక్షల కోట్ల అప్పు
- ప్రాజెక్టుల పేరు చెప్పి కమీషన్లు దండుకున్నావు
- పది నెలలు కాకముందే నన్ను దిగిపోమంటావా?
- నేనెందుకు దిగాలి?
- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌ధ్వజం



నూతన అధ్యాపకులకు నియామక పత్రాలను అందజేస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'పదేళ్ల పాటు ప్రజలు నీకు స్టేచర్ ఇచ్చారు... కానీ, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి నాశనం చేసినందుకు గత ఎన్నికల్లో స్ట్రెచర్‌పైకి తీసుకువచ్చారు. అయినా తీరు మారకపోతే రేపు మార్చురీకి పంపిస్తారు" అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 60-70 ఏళ్ల క్రితం మేం కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ నిటారుగా, పటిష్ఠంగా ఉంటే.. లక్ష కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం జరిగిపోయిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన 1532 మంది అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పులు చేసిండు. ప్రాజెక్టుల పేరిట కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు చేసుకుని కమీషన్లు తీసుకున్నడు.. ఆఖరుకు వారికి రూ.42వేల కోట్ల బకాయిలు పెట్టిండు. ఆయన గారు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్ ఇచ్చిపోయిండు.. అయినా కోలుకుని ఏదో రకంగా చేస్తుంటే.. దిగిపో అంటున్నారు. నేనెందుకు దిగిపోవాలి.. నేనేమైనా వాళ్ల ఫాంహౌస్ గుంజుకున్నానా? పాలించమని ప్రజలకు మాకు ఐదేళ్ల గడువు ఇచ్చారు. ఈరోజు మీకు నియామక పత్రం ఇస్తున్నం.. వచ్చే ఏడాది దిగిపో అంటే ఊరుకుంటారా? బీఆర్ఎస్ వాళ్ల బాధ ఏందో తెలియడం లేదు. నన్ను పని చేయకుండా అడ్డుకుంటున్నారు. నా పరిస్థితి ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ అన్నట్టుగా ఉంది. క్యాన్సర్ ముదిరిపోతుంటే ఎన్ని రోజులు కప్పిపుచ్చుకోవాలి?" అని ప్రశ్నించారు. ప్రతి నెలా ప్రభుత్వానికి రూ.18500 కోట్ల ఆదాయం వస్తుండగా, అందులో ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6500 కోట్లు, నాడు అయ్యగారు చేసిన అప్పులకు రూ.6500 కోట్లు కట్టాల్సి వస్తోందని తెలిపారు. మిగతా రూ.5వేల కోట్లను సంక్షేమ పథకాలు, పలు ప్రాజెక్టులకు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ఉన్న పథకాలన్నీ అమలు చేయాలంటే ప్రతినెలా రూ. 9వేల కోట్లు తక్కువ పడుతున్నాయని చెప్పారు. అందుకే ఒకనెల ఆశా వర్కర్లకు, ఇంకో నెల అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు ఆపుతున్నామని, లేదంటే షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను పెండింగ్‌లో పెడుతున్నామని అన్నారు. ఒక నెల ఇంటి కిరాయి ఇచ్చేసి పాలోడికి, స్కూలు ఫీజులు ఆపినట్టు ఇలా రొటేషన్ పనే జరుగుతోందన్నారు.

ఒక్కో విద్యార్థిపై ఏడాదికి లక్ష ఖర్చు

పదేళ్లలో విద్యా శాఖ నిర్లక్ష్యానికి గురైందని, కేరళతో పోటీపడుతూ తొలి మూడు స్థానాల్లో ఉండాల్సిన రాష్ట్రం.. నేడు చివరి నుంచి మూడో స్థానంలో ఉందని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పవా? ఎందుకు పోటీ పడట్లేదు? లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బోధనను ఉద్యోగంలా కాకుండా భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే బాధ్యతగా భావించాలని నియామక పత్రాలు అందుకున్న అధ్యాపకులకు సూచించారు. "ప్రైవేటు బడుల్లో విద్యార్థి చదువు కోసం ప్రతి కుటుంబం ఏడాదికి రూ.20వేలు ఖర్చు చేస్తుంటే.. ప్రభుత్వం లక్ష వరకు ఖర్చు చేస్తోంది. దీనిని ఖర్చు కాకుండా భవిష్యత్తు పెట్టుబడిగా భావిస్తున్నాం. కానీ ఖర్చుకు తగ్గట్టు ఫలితాలు రావట్లేదు. దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది" అని అన్నారు. విద్యారంగంలో సంస్కరణలకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తుందన్నారు.

సీఎంగా నాకు దక్కే గొప్ప సంతృప్తి అదే

"బిడ్డా.. కొలువు వచ్చిందా. అని ఆశగా అడిగే తల్లికి.. అమ్మా.. నీ రక్తం చెమటగా మార్చి చేసిన త్యాగం ఫలించిందే.. అని నువ్వు చెప్పినప్పుడు ఆ అమ్మ కళ్లల్లో ఉప్పొంగే ఆనందమే ముఖ్యమంత్రిగా నాకు దక్కే గొప్ప సంతృప్తి" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రవీంద్రభారతిలో నూతన అధ్యాపకులకు నియామకపత్రాలు అందించిన అనంతరం 'ఎక్స్' ఖాతాలో ఈ మేరకు ఆయన పోస్టు చేశారు.

దమ్ముంటే విగ్రహాలపై చెయ్యేసి చూడు

కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారు.. కేటీఆర్ వ్యాఖ్యలపై మహేష్‌కుమార్ గౌడ్

- బీఆర్ఎస్‌లో పోకిరీ ఎమ్మెల్యేలు..
- గవర్నర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కేటీఆర్ వ్యాఖ్యలు
- క్షమాపణలు చెప్పాలి: పీసీసీ చీఫ్



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తల్లి, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాలను ప్యాక్ చేస్తామంటూ కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని, దమ్ముంటే విగ్రహాలపై చెయ్యేసి చూడాలని, కాంగ్రెస్ కార్యకర్తలు మీ బట్టలూడదీసి కొడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడి కాంగ్రెస్ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని కేటీఆర్‌కు హితవు పలికారు. బుధవారం మహేష్‌కుమార్ గౌడ్ అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పోకిరి ఎమ్మెల్యేలు ఉన్నారని, గవర్నర్ ప్రసంగించేప్పుడు ఎలా ఉండాలో తెలియదా అని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ చిన్నపిల్లాడిలా వ్యాఖ్యలు చేశారని, గవర్నర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారన్నారు. గవర్నర్‌కు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిన సన్నాసులు ఎవరో కేటీఆర్ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండేదని, ఈ విషయంపై మాట్లాడడానికి కేటీఆర్‌కు సిగ్గుండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సేవాదళ్ కీలక పాత్ర పోషించిందని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇందిరా భవన్‌లో సేవాదళ్ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో మాట్లాడారు. సేవాదళ్ కమిటీలను జిల్లాల వారీగా నియమించనున్నట్లు తెలిపారు.

కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో: బల్మూరి

పిచ్చి కుక్క కరిచినట్టు మాట్లాడితే తెలంగాణ ప్రజలు రాళ్లతో తరిమికొట్టే పరిస్థితి వస్తుందనే విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. ఎవరికి పిచ్చి ముదిరిందో, ఎవరు అసెంబ్లీకి రాకుండా ఫాంహౌస్‌కు పరిమితమై పడుకున్నారో తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని, ఆ ఆదేశాలను అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు సర్క్యులేట్ చేయాలని సీఈవోలకు నిర్దేశించారని పేర్కొంది. 'ఓటర్ల గుర్తింపు సక్రమంగా ఉండేందుకు ఓటరు కార్డుతో ఆధార్, మొబైల్ నంబర్లను అనుసంధానించే అన్ని ప్రయత్నాలూ చేయాలి' అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసినట్టు తెలిపింది. దీంతోపాటు జనన, మరణాల నమోదు అధికారులతో సమన్వయం చేసుకొంటూ ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేస్తుండాలని కూడా సీఈసీ నిర్దేశించినట్టు పేర్కొంది. అలాగే, 18 ఏళ్ల వయసు దాటిన భారత పౌరులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా నమోదై ఉండేలా ఇంటింటి సర్వే సమయంలో అందరు బీఎల్‌వోలూ(బూత్ స్థాయి అధికారులు) కృషి చేయాలని సీఈసీ ఆదేశించారు. కాగా, ఓటరు నమోదుకు ఆధార్ లింక్ తప్పనిసరి కాదని 2022లో సుప్రీంకోర్టుకు ఇచ్చిన వివరణలో ఈసీఐ స్పష్టం చేసింది. దానికి భిన్నంగా తాజా ఆదేశాలు ఉన్నాయి.

ఎఫ్-35 కొనే ఆలోచన లేదు: ఎయిర్ చీఫ్ మార్షల్

న్యూఢిల్లీ, మార్చి 12: భారతదేశానికి ఎఫ్-35 యుద్ధ విమానాలు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా ప్రకటించిందిగానీ.. అసలు వాటిని కొనే ఆలోచనేదీ ప్రస్తుతానికి తమ పరిశీలనలో లేదని భారత ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు. "ఫైటర్ జెట్ల కొనుగోలు అంటే సాధారణ విషయం కాదు. మన అవసరాలు ఏమిటి? కొనుగోలుకు అయ్యే ఖర్చు ఎంత? తదితర అంశాలన్నింటినీ జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. గృహోపకరణాలను కొన్నట్టు కొనలేం. అందునా వీటికి సంబంధించి (అమెరికా నుంచి) లాంఛనప్రాయమైన ప్రతిపాదన ఏదీ రాలేదు. ఎఫ్-35ల కొనుగోలు అంశం మా పరిశీలనలో లేదు" అని ఆయన వివరించారు. ఎఫ్-35ల ధర ఒక్కొక్కటీ మన కరెన్సీలో దాదాపు రూ.697 కోట్లకు పైమాటే!

అమెరికాలో ఎంబసీ పేరుతో వచ్చే కాల్స్‌తో జాగ్రత్త!

వాషింగ్టన్, మార్చి 12: ఎంబసీ పేరిట వచ్చే తప్పుడు ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అమెరికాలోని భారతీయులకు అక్కడి భారతీయ రాయబార కార్యాలయం అడ్వైజరీ విడుదల చేసింది. పాస్‌పోర్టు, వీసా ఫామ్, ఇమిగ్రేషన్ పత్రాల్లో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దడం కోసం పెనాల్టీ లేక ఫీజులు చెల్లించాలంటూ డబ్బు గుంజే పనులు మోసగాళ్లు చేస్తుంటారని తెలిపింది. అక్రమ వలసదారులను అమెరికా ప్రభుత్వం తన దేశం నుంచి గెంటివేస్తున్న (డిపోర్టేషన్) విషయం తెలిసిందే. దీనిని అవకాశంగా తీసుకుని మోసగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉందని హెచ్చరించింది. మరోవైపు, ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా విద్యాశాఖలో ఇప్పుడు పని చేస్తున్నవారిలో కనీసం సగం మంది(2,183)ని తొలగించనున్నట్లు అమెరికా విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మోహన్ వెల్లడించారు.

ప్రతీ వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలి: సుధామూర్తి

ఢిల్లీ, మార్చి 12 : ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవాలని ఎంపీ సుధామూర్తి అన్నారు. తనకు 7, 8 భాషలు వచ్చని ఆమె చెప్పారు. ఇలా ఇతర భాషలు నేర్చుకోవడం పిల్లలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు - కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం నెలకొన్న వేళ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు సమావేశాల్లోనూ ఈ అంశంపై ఎంపీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ అయిన సుధామూర్తి త్రిభాషా సూత్రానికి ఇలా మద్దతు పలికారు.

పని ఒత్తిడిలో 52 శాతం ఉద్యోగులు

న్యూఢిల్లీ, మార్చి 12: కొవిడ్ తర్వాత ఉద్యోగులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోలేక భారత్‌లోని దాదాపు 52% మంది ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న వెర్టెక్స్ గ్రూప్ తాజా సర్వేలో వెల్లడించింది. ఈ సంస్థ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పంజాబ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న మొత్తం 1500 మందిపై సర్వే నిర్వహించి ఫలితాలను వెల్లడించింది. 23 శాతంపైగా ఉద్యోగులు సాధారణ పని గంటలకు మించి పనిచేస్తున్నారని ఈ సర్వే వెల్లడించింది.

ట్రంప్ సుంకాలపై ఈయూ కన్నెర్ర

ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటన... 'కెనడాపై డబుల్ టారిఫ్'పై ట్రంప్ యూటర్న్

బ్రస్సెల్స్, మార్చి12: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలపై యూరోపియన్ యూనియన్ కన్నెర్ర చేసింది. అమెరికాకు చెందిన 28.33 బిలియన్ డాలర్ల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా ఉత్పత్తులపై ఉన్న టారిఫ్‌ల సస్పెన్షన్‌ను ఏప్రిల్ ఒకటి నుంచి తొలగిస్తున్నట్లు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ తెలిపారు. సుంకాల వల్ల అమెరికా, యూరప్‌లో ధరలు పెరిగిపోతాయని, వినియోగదారులను, వ్యాపారులను కాపాడేందుకు ఈయూ చర్యలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు, కెనడాకు చెందిన ఉక్కు, అల్యూమినియంపై 50% టారిఫ్ విధిస్తామని ప్రకటించిన ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు. తొలుత ట్రంప్ 25 శాతం టారిఫ్ విధించడంతో అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్‌పై ఎగుమతి సుంకాలను 25% పెంచుతున్నట్లు కెనడాలోని ఒంటారియో ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా 50% సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే అమెరికా వాణిజ్య కార్యదర్శి లుట్నిక్ జరిపిన చర్చలు ఫలించడంతో విద్యుత్‌పై 25% అదనపు రుసుం వసూలు చేయాలనే ప్రణాళిక విరమించుకున్నట్లు ఒంటారియో ప్రకటించింది. దీంతో ట్రంప్ కూడా వెనక్కి తగ్గారు.

అమెరికా ఆల్కహాల్‌పై భారత్ 150% సుంకం

అమెరికా ఆల్కహాల్ సహా కొన్ని ఉత్పత్తులపై భారత్ 150% సుంకాలు విధిస్తోందని వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లివిట్ చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులపైనా భారత్ వంద శాతం సుంకాలు విధిస్తోందని, అందుకే ట్రంప్ పరస్పర సుంకాలను విధించాలని చూస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ ఇటీవలే ప్రకటించారు.



టెస్లా కారును కొనుగోలు చేసిన ట్రంప్

ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థ కారును ట్రంప్ కొనుగోలు చేశారు. మస్క్ నేతృత్వంలోని డోజ్ శాఖ ప్రభుత్వ ఉద్యోగుల అంశంలో తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ఫలితంగా టెస్లా కంపెనీ షేర్ల విలువలు భారీగా పతనమయ్యాయి. టెస్లా కార్లు కొనుగోలు చేయవద్దు అనే ప్రచారమూ అధికమైంది. ఈ నేపథ్యంలో టెస్లాకు మద్దతుగా ఆ సంస్థకు చెందిన కారును కొనుగోలు చేశారు. టెస్లాకు చెందిన ఐదు రకాల కార్లను మస్క్ ఏకంగా వైట్‌హౌస్‌కు తీసుకొచ్చి ట్రంప్ వాకిట్లో పెట్టారు. వాటిల్లో నుంచి ఓ ఎరుపు రంగు కారును ఎంపిక చేసుకున్న ట్రంప్ దాదాపు 80వేల డాలర్ల(దాదాపు రూ.70లక్షలు)కు ఆ వాహనాన్ని కొనుగోలు చేశారు.

కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సై

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడానికి అగ్రరాజ్యం అమెరికా చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. సౌదీ అరేబియాలో అమెరికా-ఉక్రెయిన్ మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఈ చర్చల్లో భాగంగా 30 రోజుల పాటు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. దీంతో.. ఉక్రెయిన్‌పై విధించిన ఆంక్షలను ఉపసంహరించినట్లు ట్రంప్ ప్రకటించారు. మునుపటిలాగానే ఉక్రెయిన్‌కు మిలటరీ సాయం.. ఇంటెలిజెన్స్ సహకారం అందజేస్తామని వివరించారు. "కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. రష్యా స్పందనే మిగిలి ఉంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ మా ప్రతిపాదనకు అంగీకరిస్తారని మేము ఆశిస్తున్నాం. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మరోమారు చర్చలు జరుపుతాం. ఆయనను వైట్‌హౌస్‌కు ఆహ్వానిస్తాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కాల్పుల విరమణకు మూడు షరతులను విధించే అవకాశాలున్నాయని బ్లూంబెర్గ్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇందులో ప్రధానంగా ఉక్రెయిన్ ఇకపై నాటో సభ్యత్వ ఆశలను వదులు కోవాలని డిమాండ్ చేయనుందని పేర్కొంది. దీంతోపాటు.. తాము ఆక్రమించిన భూభాగాలను ఉక్రెయిన్ గుర్తించాలని, తటస్థతను పాటించాలని షరతులను విధించనున్నట్లు తన కథనంలో పేర్కొంది.

గుండెపోటుకు చైనా వ్యాక్సిన్!

న్యూఢిల్లీ, మార్చి 12: గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించడానికి చైనా వ్యాక్సిన్‌ను రూపొందించింది. రక్తనాళాలు గట్టిపడడం, రక్తవాహికల్లో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడడానికి కారణమయ్యే 'ప్లేక్స్' ఏర్పడడాన్ని ఈ నానో వ్యాక్సిన్ నిరోధిస్తుంది. నాన్జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, చైనా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా 'కాక్‌టైల్' రూపంలో ఈ నానో వ్యాక్సిన్‌ను రూపొందించాయి. రక్తనాళాలు పెళుసుబారకుండా, వాహికల్లో కొవ్వు పొరలు (ప్లేక్స్) ఏర్పడకుండా అనేక ప్రొటీన్లు పనిచేస్తున్నాయన్న పూర్వ పరిశోధనా ఫలితాలు తాజా రూపకల్పనకు స్ఫూర్తి. అలా పని చేసే వాటిలో పీ210 కారకం ఒకటి. దీనిని ఐరన్ ఆక్సైడ్ నానోపార్టికల్స్‌కు జత చేశారు. ఇలా తయారుచేసిన వ్యాక్సిన్ రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఒక ఉత్ప్రేరకాన్ని వాడారు. దీనిని తొలిదశలో ఎలుకలపై ప్రయోగించినప్పుడు చక్కటి ఫలితాలు వచ్చాయి.

ప్రపంచ టాప్-50 జాబితాలో 9 భారతీయ విద్యా సంస్థలు

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భారత్‌లోని 9 యూనివర్సిటీలు, విద్యా సంస్థలు 'క్యూఎస్' ప్రపంచ టాప్-50 జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. సబ్జెక్టుల వారీగా ఇచ్చిన ఈ ర్యాంకుల్లో మినరల్, మైనింగ్ ఇంజనీరింగ్‌లో ధన్‌బాద్ ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ (ఐఎస్ఎం) 20వ ర్యాంకుతో దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థగా నిలిచింది. ఇదే సబ్జెక్టులో ముంబై, ఖరగ్‌పూర్ ఐఐటీలు వరుసగా 28, 45 స్థానాలు దక్కించుకున్నాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో ఢిల్లీ, ముంబై ఐఐటీలు టాప్-50లో చోటు సంపాదించాయి. ఐఐటీ మద్రాస్ (పెట్రోలియం ఇంజనీరింగ్), జేఎన్‌యూ (డెవలప్‌మెంట్ స్టడీస్) టాప్-50లో నిలిచాయి. దంత వైద్య శాస్త్రంలో సవిత మెడికల్, టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ (తమిళనాడు) కూడా టాప్-50లో చోటు దక్కించుకుంది. ఇదిలా ఉండగా, క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ సత్తా చాటింది. ఏడు సబ్జెక్టుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించింది. ఆంగ్ల భాష- సాహిత్యం కోర్సుకు 251-300 బ్యాండ్ ర్యాంకింగ్ లభించింది. లింగ్విస్టిక్స్ 301-350, సోషియాలజీ 301-375, కెమిస్ట్రీ 451-500, ఎకనామిక్స్-ఎకనామెట్రిక్స్ 501-550, ఫిజిక్స్-ఖగోళశాస్త్రం 601-675, బయోలాజికల్ సైన్సెస్‌లో 651-700 బ్యాండ్ ర్యాంకింగ్ దక్కింది.

మరో ఐదేళ్లు నేనే సీఎం: సిద్దరామయ్య



బెంగళూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత ప్రభుత్వంలోనే కాదు... మరో ఐదేళ్లు నేనే సీఎం' అంటూ కర్ణాటక సీఎం సిద్దరామయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యారెంటీల అమలు కమిటీని రద్దు చేయాలని శాసనసభలో ప్రతిపక్షాలు బుధవారం ఆందోళన చేస్తున్న సందర్భంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేత అశోక్ మాట్లాడుతూ, ఇక్కడ పర్మనెంట్ అని చెప్పుకొనేవారు కనిపించకుండా పోయారని కన్నడలో ఓ పాట ఉందని (కనిపించకుండా మాయమైన శివుడు) అన్నారు. దీనికి సీఎం దీటుగా స్పందిస్తూ... మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈసందర్భంలో సీనియర్ సభ్యుడు సునిల్‌కుమార్ మాట్లాడుతూ 'కాంగ్రెస్ వస్తుంది... మీరుంటారా..?' అని ప్రశ్నించారు. దీంతో తానే మరో ఐదేళ్లు సీఎంగా ఉంటానని సిద్దూ బదులిచ్చారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఎప్పుడైనా ఉండవచ్చునన్న ఊహాగానాల నేపథ్యంలో సిద్దరామయ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

భారత్-మారిషస్ మధ్య 8 ఒప్పందాలు

పోర్ట్ లూయిస్, మార్చి 12: భారత్-మారిషస్ మధ్య వాణిజ్యం, తీరప్రాంత భద్రత తదితర అంశాలపై 8 కీలక ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల బంధాన్ని మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్య హోదాకు తీసుకెళ్లాలని తాను, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మారిషస్ జాతీయ దినోత్సవ వేడుకలకు మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో ఐఎన్ఎస్ ఇంఫాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత వైమానిక దళానికి చెందిన స్కై డైవింగ్ బృందం కూడా వేడుకల్లో పాల్గొంది. ఈ సందర్భంగా మోదీ దక్షిణార్ధ గోళ దేశాల కోసం మహాసాగర్ పేరిట కొత్త విజన్‌ను ప్రకటించారు. మారిషస్ పార్లమెంట్ భవన నిర్మాణానికి భారత్ సహకరిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యానికి తల్లి వంటి భారత్ నుంచి మారిషస్‌కు దీన్ని కానుకగా మోదీ అభివర్ణించారు. పర్యటనలో భాగంగా మోదీకి మారిషస్ ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారాన్ని బహూకరించింది.

హైజాక్ చేసిన రైలు



పాకిస్థాన్‌లో రైలు హైజాకర్ల హతం

కరాచీ, మార్చి 12: పాకిస్థాన్‌లో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను విడిపించేందుకు చేపట్టిన సైనిక చర్య ముగిసిందని పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో మొత్తంగా 33 మంది హైజాకర్లను హతమార్చి వారి చెరలో ఉన్న 346 మంది బందీలను విడిపించినట్లు వెల్లడించింది. ఈ ఉదంతంలో 21 మంది ప్రయాణికులు, 28 మంది సైనికులు మృతి చెందినట్లు వెల్లడించింది. బలోచిస్థాన్ ప్రావిన్సులోని క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న రైలును మంగళవారం బలోచ్ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.